





www.prajapaksham.in

# ప్రజాపక్షం

ప్రతి అక్షరం ప్రజల కోసం

PRAJAPAKSHAM ★



అందరూ హిందువులే అయితే.. ఘర్ వాపసీ ఏమిటి? 06

అమెరికాతో తక్షణ ఒప్పందానికి ఇరాన్ సంసిద్ధత! 04

ఐదువేల మంది కష్టమర్ల డేటా చోరీ 05



సంపుటి 28, సంచిక: 245 | శుక్రవారం | 27-02-2026 | హైదరాబాద్ Published from: Hyderabad, Khammam, Karimnagar, Mahabubnagar పేజీలు: 12 | వెల రూ. 5.00


వివాదాస్పద ఎన్‌సిఇఆర్‌టి

## పాఠ్యపుస్తకంపై సుప్రీం నిషేధం

ప్రతులన్నింటినీ స్వాధీనం చేసుకోవాలని ఆదేశం




**న్యూఢిల్లీ:** న్యాయ వ్యవస్థలో అవినీతి పెరుగుతున్నట్టు చిత్రీకరించిన, జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సిఇఆర్‌టి) 8వ తరగతి సామాజిక శాస్త్ర పాఠ్యపుస్తకంపై సుప్రీం కోర్టు నిషేధం విధించింది. అంతేగాక, ఆ పుస్తకాలతో పాటు, డిజిటల్ ప్రతులను కూడా స్వాధీనం చేసుకోవాలని ఆదేశించింది. ఈ నిర్ణయం న్యాయవ్యవస్థ ప్రతిష్ఠను దెబ్బతీయడానికి పన్నిన వ్యూహాత్మక కుట్రగా కనిపిస్తోందని కోర్టు వ్యాఖ్యానించింది. సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్య కాంత్ నేతృత్వంలో జస్టిస్ జోయ్‌మాల్య బాగ్జీ, జస్టిస్ విపుల్ పాంచోలీ సభ్యులుగా ఉన్న సుప్రీం కోర్టు ధర్మాసనం కేసును విచారిస్తున్న విషయం తెలిసిందే. ఎన్‌సిఇఆర్‌టి తుపాకీతో కాల్చారని, న్యాయ వ్యవస్థ రక్తమోడుతున్నదని ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ వ్యాఖ్యానించడం గమనార్హం. ఇది కేవలం పొరపాటు కాదని, ఒక ప్రణాళికాబద్ధమైన చర్యలా కనిపిస్తోందని ఆయన అభిప్రాయపడ్డారు. బెంచ్ తరువాయి 12లో

### ఎన్‌సిఇఆర్‌టి క్షమాపణ..

వెబ్ నుంచి పాఠ్యాంశం తొలగింపు

జాతీయ విద్యా పరిశోధన, శిక్షణ మండలి (ఎన్‌సిఇఆర్‌టి) ఇటీవల 8వ తరగతి సామాజిక శాస్త్ర పాఠ్యపుస్తకంలో న్యాయవ్యవస్థపై ఉన్న ఒక అధ్యాయంపై వివాదం తలెత్తిన నేపథ్యంలో క్షమాపణలు తెలిపింది. ఆ అధ్యాయంలో తరువాయి 2లో

### 'సుప్రీం' ఆగ్రహం సముచితమే : కాంగ్రెస్

ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకాల్లో న్యాయవ్యవస్థపై విమర్శాత్మక వ్యాఖ్యలు ఉండటంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడం సముచితమేనని కాంగ్రెస్ పార్టీ పేర్కొంది. అదే సమయంలో, గత దశాబ్దంలో ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల పునర్రచన ప్రక్రియను కాంగ్రెస్ తీవ్రంగా విమర్శించింది. పార్టీ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్ 'ఎక్స్' వేదికగా చేసిన ప్రకటనలో, సుప్రీం కోర్టు స్పందన న్యాయసమ్మతమని వ్యాఖ్యానించారు. ఎన్‌సిఇఆర్‌టి పుస్తకాల పునర్వ్యవస్థీకరణ గత పదేళ్లుగా అవమానకరంగా, ప్రమాదకరంగా మారిందని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ ప్రక్రియను ఆర్‌ఎస్‌ఎస్ ప్రేరేపితమైనదిగానూ, దుష్ప్రయోజనాలతో కూడినదిగానూ అభివర్ణించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ అవసరమని ఆయన డిమాండ్ చేశారు.

ప్రధాని ఇజ్రాయెల్ పర్యటన

## సిగ్గుచేటు చర్య

ఆ దేశ పార్లమెంట్ నెస్సెట్‌ను ఉద్దేశించి మోదీ చేసిన ప్రసంగాన్ని చరిత్ర ఆచరణాత్మక దౌత్యంగా గుర్తుంచుకోబోదని సిపిఐ విమర్శ

**న్యూఢిల్లీ :** భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇజ్రాయెల్ పర్యటనను, ఆ దేశ పార్లమెంట్ నెస్సెట్‌ను ఉద్దేశించి ఆయన చేసిన ప్రసంగాన్ని చరిత్ర ఆచరణాత్మక దౌత్యంగా గుర్తుంచుకోబోదని, ఇది మన కాలంలోని అత్యంత తీవ్రమైన, అత్యంత దీర్ఘకాలిక అన్యాయాలలో సహకరించిన సిగ్గుచేటు చర్యగా మిగలబోతుందని సిపిఐ విమర్శించింది. ఈ మేరకు సిపిఐ జాతీయ కార్యదర్శివర్గం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. గాజాలో నిర్విరామ సైనిక కార్యకలాపాలు కొనసాగుతున్న సమయంలో, వెస్ట్ బ్యాంక్‌లో హింస, బలవంతంగా నిర్వాసితులను చేయడం తీవ్రమవుతున్న సమయంలో ప్రధాని పర్యటన, ప్రసంగం చోటు చేసుకోవడాన్ని సిపిఐ తీవ్రంగా ఖండించింది. ఈ పర్యటనను ఒక సాధారణ దౌత్యపరమైన చర్యగా భావించలేమని పేర్కొంది. పదుల వేల మంది పాలస్తీనా పౌరుల హత్యకు, ఇళ్ళు, ఆసుపత్రులు, ప్రధాన మౌలిక సదుపాయాలను పెద్ద ఎత్తున నాశనం తరువాయి 2లో


అగ్రశ్రేణి లాజిస్టిక్ హబ్‌గా తెలంగాణ

మంత్రి శ్రీధర్‌బాబు 03


ఉద్రిక్తతలవేళ క్యూబాపై అమెరికా

## ఆకస్మిక దాడి!



దూసుకొచ్చిన స్పీడుబోటు : ఎదురు కాల్పుల్లో నలుగురు మృతి

అసాధారణ ఘటనపై రష్యా మండిపాటు

**హవానా:** అమెరికా స్పీడ్ బోటు ఒకటి అకస్మాత్తుగా క్యూబా జలాల్లోకి దూసుకురావడంతో ఆ దేశ సైన్యం కాల్పులు జరిపింది. దీంతో బోటులో ఉన్న నలుగురు మరణించారు. బుధవారం ఉదయం జరిగిన ఈ ఘటనలో మరో ఆరుగురు గాయపడ్డారు. ఫ్లోరిడా రిజిస్ట్రేషన్‌తో ఉన్న ఒక బోటులో వచ్చిన పదిమంది క్యూబా తీరప్రాంత గస్తీ దళాలపై కాల్పులు జరిపారు. దీంతో క్యూబా సైన్యం ఆత్మరక్షణ కాల్పులు జరిపింది. ఐతే ఈ పదిమందీ ఫ్లోరిడాలో నివసిస్తున్న క్యూబా జాతీయులేనని, వీరికి గతంలో నేర చరిత్ర ఉందని సైనిక దళాలు గుర్తించాయి. ఈ నేర చరిత్ర ఉన్నవారిలో నలుగురు మరణించారు. మరో ఆరుగురు చికిత్స పొందుతున్నారు. ఈ కేసులో తరువాయి 12లో

నిబంధనలకు మించి

## ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు

ప్రైవేటు పాఠశాలలు వసూలు చేసిన డబ్బును రికవరీ చేసేలా నిబంధన



- వంద తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు
- పైలెట్ ప్రాజెక్టు తరహాలో నియోజకవర్గంలో ఒకటి
- ఎఐ సాంకేతికతపై ఉపాధ్యాయులు, లెక్చరర్లకు స్వల్పకాలిక శిక్షణ
- ప్రాథమిక నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులకు బ్రేక్‌ఫాస్ట్
- విశ్వ విద్యాలయాలకు నిధులు అందజేతపై నివేదిక సమర్పించండి
- విద్యా శాఖపై సమీక్షలో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్రంలోని ప్రైవేటు పాఠశాలలలో నిబంధనలకు మించి ఫీజులు వసూలు చేస్తే అనుమతి రద్దు చేయడంతో పాటు వసూలు చేసిన డబ్బును రికవరీ చేసేలా నిబంధన విధించాలని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రైవేట్ పాఠశాలలలో ఫీజుల నియంత్రణకు సంబంధించిన సిఫార్సులను ప్రజాభిప్రాయం కోసం వెబ్‌సైట్‌లో ఉంచాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా 100 నియోజకవర్గాల్లో (హైదరాబాద్ నగరం వెలుపల) తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఈ ఏడాది నుంచి ప్రారంభించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. తరగతి గదులు, క్రీడా మైదానం, ఇతర అన్ని రకాల వసతులు, బోధనా సిబ్బంది, రవాణా సౌకర్యం తరువాయి 2లో

గండిపల్లి రిజర్వాయర్‌కు

## రూ.100 కోట్లు మంజూరు చేయండి

- యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయాలి
- సిఎం రేవంత్ రెడ్డికి చాడ వెంకట్‌రెడ్డి లేఖ

ప్రజాపక్షం/హైదరాబాద్



గౌరవెల్లితో పాటు గండిపల్లి రిజర్వాయర్‌ను కూడా పూర్తి చేయడానికి అవసరమైన నిధులు కేటాయిస్తూ సత్వరం పూర్తి చేసేందుకు ఉత్తర్వులు జారీ చేయాలని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు చాడ వెంకట్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. గండిపల్లి రిజర్వాయర్ పూర్తి చేయడానికి ప్రత్యేకంగా రూ.100 కోట్ల నిధులు మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన రిజర్వాయర్‌ను పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ మేరకు గురువారం ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డికి ఆయన ఒక లేఖ రాశారు. హుస్నాబాద్ నియోజకవర్గ పరిధిలోని మెట్ట ప్రాంత రైతాంగానికి సాగునీరు అందించే లక్ష్యంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని ఆనాటి కాంగ్రెస్ ప్రభుత్వం జలయజ్ఞంలో భాగంగా గండిపల్లి రిజర్వాయర్‌ను చేపట్టినట్లు ఆయన వివరించారు. ఈ ప్రాంతానికి శాసనసభ్యులుగా ప్రాతినిధ్యం వహించిన తాను గౌరవెల్లి, గండిపల్లి, తోటపల్లి రిజర్వాయర్, ఇందుర్తి రిజర్వాయర్ నిర్మాణానికి మాజీ ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్.రాజశేఖర్ రెడ్డితో 2007లో శంకుస్థాపన చేయించానని, అప్పటి నుండి రిజర్వాయర్ సత్వర పూర్తి కోసం అనేక విజ్ఞప్తులు చేస్తున్నప్పటికీ గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం, అలాగే బిఆర్‌ఎస్ ప్రభుత్వాలు భూసేకరణ చేయడానికి, ప్రాజెక్టుల నిర్మాణానికి విడతల వారీగా అరకొర నిధులు కేటాయించడంతో అవి పూర్తి కాలేదని సిఎం దృష్టికి తీసుకువ్చానని వివరించారు. గత ప్రభుత్వాల హయాంలోనే గండిపెల్లి ప్రాజెక్టుకు సంబంధించి భూసేకరణ జరిగినప్పటికీ నిధులు తరువాయి 12లో

విశ్వవిద్యాలయాల్లో

## విద్యార్థి సంఘాల ఎన్నికలు




ప్రజాపక్షం/హైదరాబాద్

రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ విద్యాకమిషన్ సిఫారసు

ఎన్‌ఇపిలోని మంచిని స్వీకరించాలని సూచన

ఇంటర్ బదులు 10+2

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన జాతీయ విద్యావిధానాన్ని పూర్తిగా అమలు చేయకుండా అందులోని మంచి అంశాలను పరిగణలోకి తీసుకోవాలని, విశ్వవిద్యాలయాల్లో విద్యార్థి సంఘాల ఎన్నికలు నిర్వహించాలని తెలంగాణ విద్యా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. నర్సరీ నుంచి 12వ తరగతి వరకు ఒకే తరహా ఎస్‌ఎస్‌సి బోర్డును, ఇంటర్మీడియట్ బోర్డును విలీనం చేయాలని, డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్(డిఇఐఇడి)ని రద్దు చేయాలని, బి.ఎడ్.ను పునర్వ్యవస్తీకరణ భాగంగా బి.ఎడ్ ((ప్రైమరీ)బి.ఎడ్(సెకండరీ) చేసి విద్యార్థులకు పాఠశాలలో 150 రోజుల బోధన అభ్యాసం తప్పనిసరి చేయాలని తెలిపింది. అలాగే ఉపాధ్యాయుల అర్హతలను పెంచాలని, విద్యార్థుల ఉత్తీర్ణత శాతాన్ని 35 శాతం 45 శాతం, దశలవారీగా 50 శాతానికి పెంచాలని ప్రతిపాదించింది. 'తెలంగాణ ప్రైవేటు పాఠశాలల , జూనియర్ కళాశాలల ఫీజు నియంత్రణ , పర్యవేక్షణ ముసాయిదా బిల్లు(2026)ను, తెలంగాణ పబ్లిక్ స్కూల్ బిల్లు2026, విశ్వవిద్యాలయాల పరిధిలోని కళాశాలల 'అనుబంధ'(అఫిలేషన్ ఇచ్చే) అనుమతి ఇచ్చేందుకు స్వతంత్రంగా ఒక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది.రాష్ట్ర వ్యాప్తంగా నర్సరీ నుంచి 12వ తరగతి వరకు తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను (టిపిఎస్) ఏర్పాటు చేయాలని, వచ్చే విద్యా సంవత్సరం 2026–27, 2027–28 విద్యా సంవత్సరానికి మొత్తంగా 400 టిపిఎస్‌లను ఏర్పాటు చేయాలని, ఇందుకు రూ. 7480 కోట్ల నిధులను కేటాయించాలని ,ప్రయోగాత్మకంగా ముందుగా 200 టిపిఎస్‌లు ఏర్పాటు చేయాలని విద్యా కమిషన్ రాష్ట్ర ప్రభుత్వానికి సిఫారసు చేసింది. ఈ మేరకు తెలంగాణ విద్యా కమిషన్ చైర్మన్ ఆకునూరి మురళీ ఆధ్వర్యంలో కమిషన్ బృందం హైదరాబాద్‌లోనికమాండ్ కంట్రోల్‌లో ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డికి "తెలంగాణ విద్యా విధానం2026" సిఫార్సులతో కూడిన నివేదికను గురువారం అందజేశారు. ఈ కార్యక్రమంలో సభ్యులు తరువాయి 2లో


రాష్ట్రంలో 45 మంది ఐఎఎస్‌ల భారీ బదిలీ

కీలక శాఖల్లో కొత్త నియామకాలు 02




వెలుగుమట్ల నిర్వాసితులకు

## పునరావాసం కల్పించాలి

- బాధితులను పరామర్శించిన వామపక్షాలు
- డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని కలెక్టర్‌కు వినతి

ప్రజాపక్షం/ఖమ్మం

ఖమ్మం పట్టణంలో వెలుగుమట్ల ప్రాంతంలో ఇండ్ల కూల్చివేతలో నిర్వాసితులైన వారందరికీ వెంటనే పునరావాసం కల్పించాలని, ప్రత్యామ్నాయం నివాసం ఏర్పాటు చేసేంత వరకు పునరావాస కేంద్రాలు నిర్వహించాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం వెలుగు మట్లలోని ఇండ్లను కూల్చడం తొందరపాటు చర్య అని యుద్ధరంగాన్ని తలపించే రీతిలో పెద్ద సంఖ్యలో తరువాయి 12లో




## పేదలే ఇందిరమ్మ ప్రభుత్వానికి పేటెంట్

- వెలుగుమెట్లలో 2023లో ఇళ్లు కూలగొట్టింది బిఆర్‌ఎస్ ప్రభుత్వమే
- బాధితులకు ఇంటిస్థలం, ఇళ్లు ఇచ్చే బాధ్యత మాది
- మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ స్పష్టీకరణ

ప్రజాపక్షం/హైదరాబాద్


రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నుంచి ఇప్పటివరకు జరిగిన పార్లమెంటు, ఉప ఎన్నికలు, పంచాయతీరాజ్, మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వానికి పట్టం కట్టడాన్ని జీర్ణించుకోలేక ప్రతిపక్ష బిఆర్‌ఎస్ నేతలు ప్రభుత్వంపై విప్రచారం చేస్తున్నారని, దీనికి మరోవైపు బిజెపి నేతలు వంతపాడుతున్నారని మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, వివేక్ వెంకట స్వామి ఆరోపించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఎంపి బలరాం నాయక్, రామ సహాయం రఘుమారెడ్డి, ఎంఎల్‌ఎలు రాజేందర్ రెడ్డి, మాధవరెడ్డితో కలసి మాట్లాడారు.ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ 2023 జూలై 15న వెలుగుమట్లలో తరువాయి 12లో

తండాల్లో గుట్టుగా

## గుడుంబా తయారీ

- పట్టణాల దాకా జోరుగా విక్రయాలు
- రూ. లక్షలు సంపాదిస్తున్న అక్రమార్కులు
- మామూళ్ల మత్తులో సిబ్బంది!
- మూలాలపై దృష్టి సారించని ఎక్సైజ్‌శాఖ!





ప్రజాపక్షం/మెట్‌పల్లి

మెట్‌పల్లి డివిజన్‌లోని పల్లెలు, మారుమూల తండాల్లో మళ్లీ గుడుంబా గుప్పుమంటోంది. కొన్నేళ్లుగా స్తబ్దంగా ఉన్న గుడుంబా తయారీ మళ్లీ పుంజుకుంటోంది.గుడుంబా తయారీదారులు గుట్టుచప్పుడు కాకుండా తయారు చేసి రహస్యంగా ఇతర ప్రాంతాలకు తరలిస్తూ దందా సాగిస్తున్నారు. మద్యం ధరలు విపరీతంగా పెరగడంతో పేద, మధ్య తరగతి ప్రజలు నాటుసారా వైపు మల్లుతున్నారు. గుడుంబాను ల్నిరోధించాల్సిన సంబంధిత ఎక్సైజ్ అధికారులు మూలాలపై దృష్టి పెట్టకుండా అడపాదడప దాడులు చేస్తూ తరువాయి 12లో

బీజాపూర్‌లో

## ఎన్‌కౌంటర్

ఇద్దరు మావోయిస్టులు మృతి

**చింతూరు:** జనజీవన స్రవంతిలో కలిసేందుకు కొందరు మావోయిస్టు అగ్రనాయకులు సైతం లొంగిపోతుండగా, మరి కొందరు నమ్మిన సిద్ధాంతం కోసం భద్రతా బలగాల చేతిలో మృతి చెందుతూనే ఉన్నారు. ఈ ఏడాది మార్చి 31 నాటికి మావోయిస్టు రహిత భారత్‌గా మారుస్తానన్న కేంద్ర మంత్రి అమిత్ షా తన పట్టుదల నెరవేర్చుకునే పనిలో తలమునకలై ఉన్నారు. కొందరు మావోయిస్టులు శాంతి చర్చలకు ఆహ్వానించండని వినతి చేసినా పెడచెవిన పెడుతూ లొంగిపోతే వదిలేస్తాం... లేకుంటే బలగాల చేతిలో బలి కావాల్సిందే అంటూ హెచ్చరికలు చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే చత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మృతి చెందినట్టు పోలీసులు తెలిపారు. ఇంద్రావతి నదీతీరం వెంబడి ఉన్న అడవిలో గురువారం ఉదయం భద్రతాదళాల ఉమ్మడి బందం సోదాలు జరుపుతుండగా కాల్పులు జరిగినట్లు సీనియర్ పోలీస్ అధికారి ఒకరు తెలిపారు. అప్రమత్తమైన భద్రతాదళాలు ఎదురు కాల్పులు జరిపాయని, ఈ ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టులు మరణించారని ఆయన చెప్పారు.

## సిగ్గుచేటు చర్య

(మొదటి పేజీ తరువాయి)

చేయడానికి దారితీసిన చర్యల ఫలితంగా ఏర్పడిన ప్రభుత్వానికి ఇది రాజకీయ ఆమోదం లాంటిదని విమర్శించింది. 2023 అక్టోబర్ 7న ఇజ్రాయెల్ ప్రాణాలు కోల్పోయినందుకు ప్రధానమంత్రి సంతాపం వ్యక్తం చేసినప్పటికీ, నెస్సెట్‌లో ఆయన చేసిన ప్రసంగం పాలస్తీనా ప్రజలపై విధించిన వినాశకరమైన మానవ కష్టాలపై కలవరపెట్టే నిశ్శబ్దం చోటు చేసుకుందని సిపిఐ మండిపడింది. కొద్ది మంది పౌరుల జీవితాలకు సంబంధించి మాత్రమే ప్రస్తావిస్తూ 'ఎట్టి పరిస్థితుల్లోనూ పౌరుల హత్యను సమర్థించలేమ'నే నైతిక అంశాలు కేవలం డొల్ల వాదన మాత్రమేనని పేర్కొంది. 'ఆక్రమిత పాలస్తీనా భూభాగాల్లో ఇజ్రాయెల్ చర్యలను భారతదేశం ఉగ్రవాదంపై చేస్తున్న చట్టబద్ధమైన పోరాటంతో ఒకే గాటన కట్టడం ద్వారా 'ఉమ్మడి విలువలు' విస్తరించిన 'వ్యూహాత్మక భాగస్వామ్యం' గురించి మాట్లాడటం ప్రమాదకరమైన, తప్పుడు నైతిక సమానత్వాన్ని సూచిస్తుంది. ఇది పాలస్తీనా ప్రజలు ఎదుర్కొంటున్న దీర్ఘకాలిక ఆక్రమణ, సామూహిక శిక్ష , క్రమబద్ధమైన వివక్ష వాస్తవికతను తక్కువ చేస్తుంది. భారతదేశం స్వీయ భద్రతా ఆందోళనల నైతిక స్థితిని తగ్గిస్తుంది' అని సిపిఐ ప్రకటన పేర్కొంది.''అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రోత్సహించే 'బోర్డ్ ఆఫ్ పీస్' వంటి సమాంతర, ఏకపక్ష కార్యక్రమాలలో భారతదేశం పాల్గొంటున్నట్లు వార్తలు వస్తున్నాయి. ఈ చర్యలు ఐక్యరాజ్య సమితి ఆదేశిత చట్రాలను దాటవేయడానికి, పాలస్తీనా ప్రజల స్వీయ పాలన హక్కుతో సహా వారి అంతర్జాతీయంగా గుర్తించబడిన హక్కులను నీరుగార్చడానికి ప్రమాదకరమైన సంసిద్ధతను ప్రదర్శిస్తున్నాయి'' అని సిపిఐ ఆందోళన వ్యక్తం చేసింది.

ప్రధాని పర్యటనలో ప్రధాన లక్ష్యం రక్షణ సహకారం, ఆయుధ సహ ఉత్పత్తి,వాణిజ్య ఒప్పందాలను మరింత విస్తరించడమేనని సిపిఐ తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. భారతదేశం ఇప్పటికే ఇజ్రాయెల్ సైనిక పరికరాల అతిపెద్ద కొనుగోలుదారులలో ఒకటిగా ఆవిర్భవించిందని, ఈ బంధం విస్తరణ ద్వారా ఆక్రమణతో లబ్ధి పొందే సైనిక పారిశ్రామిక సముదాయాన్ని ప్రత్యక్షంగా బలోపేతం చేస్తుందని తెలిపింది. తద్వారా సామాన్య పౌరులపై పదేపదే బల ప్రదర్శన చేసేందుకు ఉపయోగించడం ద్వారా లబ్ధి పొందుతుందని పేర్కొంది. కాబట్టి ఈ భాగస్వామ్యం 'విలువలపై ఆధారపడినది' అనే వాదన పూర్తిగా సమర్థనీయం కాదని సిపిఐ ఎండగట్టింది. భారత ప్రభుత్వం ప్రమాదకరమైన, అనైతిక మార్గాన్ని వెంటనే సరిదిద్దాలని సిపిఐ డిమాండ్ చేసింది. ఆక్రమణ, ఉగ్రవాద పాలకులతో బహిరంగ రాజకీయ పొత్తును ఎంపిక చేసుకోవడం ద్వారా, ప్రస్తుత ప్రభుత్వం వ్యూహాత్మక స్వయంప్రతిపత్తిని ఉపయోగించడం లేదని సిపిఐ స్పష్టం చేసింది. ఇది అణచివేతదారులను ఎంచుకోవడమే అవుతుందని తెలిపింది. తద్వారా భారత ప్రజల వలసవాద వ్యతిరేక, అంతర్జాతీయవాద వారసత్వాన్ని మోసం చేస్తుందని, అన్ని రకాలుగా అణచివేతకు గురైన ప్రజలతో న్యాయం, శాంతి సంఘీభావం పట్ల భారతదేశ దీర్ఘకాలిక నిబద్ధతను వదిలివేస్తుందని ఆవేదన వ్యక్తం చేసింది.

# పశ్చిమ ఆసియాలో యుద్ధమా?శాంతా?

**జెనీవా:** పశ్చిమ ఆసియాలో యుద్ధమా? శాంతా? సమీప భవిష్యత్తులో ఏం జరగబోతోంది? అమెరికా అధ్యక్షుడు ట్రంప్ ఒకవేళ నిజంగానే ఇరాన్‌పై పరిమిత యుద్ధానికి ఆదేశాలు జారీ చేస్తారా? అమెరికా సైనిక జనరల్ చెప్పిన జోస్యం నిజమవుతుందా? అనే ప్రశ్నలకు ప్రపంచదేశాలు సొంత అంచనాలు వేస్తున్నాయి. ఈ ఉత్కంఠ మధ్య యుద్ధ నివారణకు ఉద్దేశించిన కీలకమైన మూడో విడత చర్చలు జెనీవాలోని ఒమన్ దౌత్యకార్యాలయంలో గురువారం ప్రారంభమయ్యాయి. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ ఆరాఘ్చి, అమెరికా తరపున స్టీవ్ విట్‌కాఫ్, జారెడ్ కుష్నెర్ చర్చల్లో పాల్గొంటున్నారు. సంఘర్షణ నివారణకు ఇదే చివరిప్రయత్నమని ట్రంప్ ముందే ప్రకటించారు. ఈసారి ఇరాన్ లొంగి వస్తుందని ఆయన గట్టి నమ్మకంతో ఉన్నారు. ఎవరి వైఖరికి వారు కట్టుబడి ఉండటంతో ఒప్పంద అవకాశాలు ఇప్పటివరకూ అస్పష్టంగా కనిపిస్తున్నాయి. అమెరికా వైపు నుండి ఎక్కువ యుద్ధ బెదిరింపు ప్రకటనలు వస్తుండగా,ఇరాన్ మాత్రం పూర్తిగా ఆత్మరక్షణ హెచ్చరికలు చేస్తోంది. ఈ పరిస్థితుల్లో చైనా శాటిలైట్ ఎనలైసిస్ కంపెనీ ఒకటి ఇరాన్ చుట్టూ అమెరికా నౌకలను మోహరించిన ఉపగ్రహ చిత్రాలను విడుదల చేసింది. అమెరికా నౌకలు, సేనలు ఎక్కడెక్కడ ఎన్ని కి.మీ దూరంలో మోహరించి ఉన్నాయో హై రిజల్యూషన్ చిత్రాలను చైనా మిలిటరీ సాయంతో ఈ కంపెనీ విడుదల చేసిందని వార్తలు వచ్చాయి. దీంతో ఒకవేళ అమెరికా దాడిచేసే ఇరాన్‌కు చైనా మద్దతు ఇస్తుందని వదంతులు మొదలయ్యాయి. ఇరాన్ కూడా అత్యవసర ప్రాతిపదికపై చైనా నుండి నౌకలను విధ్వంసం చేసే సూపర్ సోనిక్ సిఎం–302 క్షిపణులను కొనుగోలు చేసేందుకు సిద్ధమైందని నివేదికలు వెలువడ్డాయి. ఈ వార్తలు ఇప్పటికే అంతటా వ్యాపించాయి. ఈ సిఎం–302 క్షిపణి ఇప్పటివరకూ చైనా వైజె–12 కు కొత్త వెర్షన్.

ఈసారి అమెరికా దాడి ప్రారంభిస్తే యుద్ధ ఉద్ధృతి పశ్చిమ ఆసియా అంతటికీ వ్యాపిస్తుందన్న ఇరాన్ హెచ్చరికను అమెరికా నిర్లక్ష్యం చేసే అవకాశాలు లేవని నిపుణులు చెబుతున్నారు. 2003లో ఇరాక్‌పై యుద్ధం తర్వాత పశ్చిమ ఆసియాలో భారీస్థాయిలో యుద్ధవిమాన వాహకనౌకలను అమెరికా మోహరించడం ఇదే మొదటిసారి. ఇరాన్‌ను లొంగదీసేందుకు పరిమిత దాడి మార్గాలను కూడా ట్రంప్ పరిశీలిస్తున్నారు. ఐతే ఆయనవన్నీ బెదిరింపు రాజకీయాలేనని, పశ్చిమ ఆసియాలో సేనలను మోహరించి భయపెట్టి చర్చల్లో లొంగదీయాలన్నదే ప్రణాళిక అని కొంతమంది అంచనావేస్తుండగా, ఇంటా–బయటా ఒత్తిడులు ముఖ్యంగా టారిఫ్‌లపై సుప్రీంకోర్టు తీర్పు, ప్రపంచ దేశాలు ఎదురుతిరిగే ప్రమాదం పొంచి ఉన్న తరుణంలో ట్రంప్ యుద్ధం వైపు మొగ్గినా మొగ్గుతారని మరికొందరు అంచనావేస్తున్నారు. మధ్యంతర ఎన్నికల్లో ట్రంప్ ఓడిపోయే ప్రమాదాలను తప్పించుకోవడానికి ఇలాంటి మార్గం ఏదో ఎంచుకుంటారన్న ఊహాగానాలు సాగుతున్న పరిస్థితుల్లో ఇరాన్ యంత్రాంగం మాత్రం అంతర్జాతీయ వేదికపై తన సార్వభౌమాధికారాన్ని ఉద్ఘాటిస్తూనే చర్చలపట్ల సానుకూలంగా స్పందిస్తోంది. గత ఏడాది ఇరాన్‌పై దా డులు చేయడానికి ముం దుగా రెండు దేశాలమధ్యా ఐదు విడతల చర్చలు విఫలమయ్యాయి. అణ్వాయుధాలు తయారు చేయడానికి వ్యతిరేకమని ఎప్పటికప్పుడు ఇరాన్ నాయకులు పునరుద్ఘాటిస్తున్నారు. అదేసమయంలో శాంతియుత ప్రయోజనాల కోసం యురేనియంను శుద్ధి చేసుకునే హక్కు ఇరాన్‌కు ఉందని స్పష్టం చేస్తున్నారు. ఈ వాదనలను అమెరి కా ఏకపక్షంగా తిరస్కరిస్తున్నది. యుద్ధానికైనా, చర్చలకైనా సిద్ధంగా ఉన్నామని వీలైనంతవరకూ యుద్ధాన్ని ని వారించే ప్రయత్నం చేస్తామని ఇరాన్ యంత్రాంగం చె బుతుండగా ట్రంప్ కూడా మంద్ర స్వరంలో అవే ధ్వ నులు చేస్తున్నారు. కాంగ్రెస్ సంయుక్త సమావేశంలో, ఇరాన్‌ను ''నెంబర్ ఒన్ టెర్రరిస్టు స్పాన్సర్''గా ట్రంప్‌అభివర్ణిస్తూ, వారివద్ద అణ్వాయుధాలను సహించబోమన్నారు. 47 ఏళ్ళక్రితం తాము ఇరాన్‌పై నియంత్రణ వదిలేసిన తర్వాత నుండీ ఆ దేశం ఉగ్రవాదాన్ని పెంచిపోషిస్తోందని విమర్శించారు. ఆపరేషన్ మిడ్‌నైట్ హేమర్‌తో వారి అణువ్యవస్థను ధ్వంసం చేశామని, కానీ మళ్ళీ ప్రయత్నాలు చేస్తోందన్నారు.

### ఇరాన్‌కు చైనా మద్దతు..క్షిపణి కొనుగోళ్ళు!



### ఇరాన్ అణు పునరుద్ధరణ యత్నాలకు సాక్ష్యాలున్నాయి:జెడివాన్స్

**వాషింగ్టన్:** గత ఏడాది ఇరాన్‌లో అమెరికా ఫైటర్ జెట్స్ దాడుల తర్వాత ఆణ్వాయుధ నిర్మాణంకోసం అణుకార్యక్రమాన్ని పునరుద్ధరించేందుకు ఆ దేశం మళ్ళీ ప్రయత్నిస్తోందని తమ వద్ద సాక్ష్యాధారాలు ఉన్నాయని అమెరికా ఉపాధ్యక్షుడు జె.డి.వాన్స్ ఆరోపించారు. జెనీవా కేంద్రంగా ఒమన్ దౌత్యకార్యాలయంలో గురువారం మధ్యాహ్నం అమెరికా–ఇరాన్ మధ్య మూడో విడత చర్చలు ప్రారంభమవుతున్న తరుణంలో జె.డి.వాన్స్ పైవిధంగా వ్యాఖ్యానించారు. ''వారు అణ్వాయుధాన్ని తయారు చేయడానికి ప్రయత్నం చేస్తే మాకు సమస్యలు వస్తాయి, మేం ఏదైతే వద్దని చెబుతున్నామో సరిగ్గా వారు వాస్తవానికి అదే చేసేందుకు ప్రయత్నం చేస్తున్నారనడానికి మా వద్ద సాక్షాలు ఉన్నాయి'' అన్నారు. తాము చేస్తున్న హెచ్చరికలను ఇరాన్ తీవ్రంగా పరిగణించి వివేకంగా ఆలోచించాలని, చర్చలను తమ బలహీనతగా భావించవద్దని ఆయన హెచ్చరించారు. ఇలాంటి పాలకుల దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదన్నారు. ఐతే ఇరాన్‌తో సమస్య పరిష్కారానికి దౌత్యపరమైన మార్గంలో ముందుకు వెళ్ళేందుకే తాము ఎక్కువ ప్రాధాన్యతనిస్తామన్నారు. ఇరాన్ దగ్గర అణ్వాయుధాలు ఉండకూడదు, అలా ఉంటే అవిమాకు సమస్యలు తెచ్చిపెడతాయి అన్నారు. మరోవైపు అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కూడా ఫిబ్రవరి 24వ తేదీ రాత్రి అమెరికా కాంగ్రెస్ ఉభయ సభల సంయుక్త వార్షిక సమావేశంలో మాట్లాడుతూ, ఇరాన్ దగ్గర అణ్వాయుధం లేకుండా చూస్తామని, వారిని అణ్వాయుధం తయారుచెయ్యకుండా అడ్డుకుంటామని ప్రతిజ్ఞ చేశారు.

## ఎన్‌సిఇఆర్‌టి క్షమాపణ.. (మొదటి పేజీ తరువాయి)

న్యాయ అవినీతి వంటి అంశాలు ప్రస్తావించడంపై భారత సుప్రీం కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. దీనికి అనుగుణంగా ఎన్‌సిఇఆర్‌టి ఆ పాఠ్యపుస్తకాన్ని తన వెబ్‌సైట్ నుండి తొలగించడమే కాక, ఆ పుస్తక సరఫరాను తాత్కాలికంగా నిలిపివేసింది. సంబంధిత అధ్యాయంలో అనుచితమైన విషయాలు, తీర్పు లోపం అనుకోకుండా చోటుచేసుకున్నాయని ఎన్‌సిఇఆర్‌టి గురువారం విడుదల చేసిన ఒక ప్రకటనలో అని అంగీకరించింది. భారత న్యాయవ్యవస్థను అత్యున్నత గౌరవంతో చూస్తామని పేర్కొంది. దేశ అత్యున్నత న్యాయస్థానం భారత రాజ్యాంగ పరిరక్షక, మౌలిక హక్కుల సంరక్షణ వ్యవస్థగా పని చేస్తుందని పేర్కొంది. ఇలావుంటే, 'న్యాయ వ్యవస్థలో అవినీతి'పై ఎన్‌సిఇఆర్‌టి సామాజిక శాస్త్రంలో ఒక పాఠాన్ని ఇవ్వడంపై సుప్రీం కోర్టు అసంతృప్తి వ్యక్తం చేసింది. కేసును సుమోటోగా విచారణకు స్వీకరించిన విషయం తెలిసిందే. ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలో, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్జీ, జస్టిస్ విపుల్ పాంచోలీ సభ్యులుగా ఉన్న త్రిసభ్య ధర్మాసనం ఈ అంశాన్ని పరిశీలించింది. సీనియర్ న్యాయవాదులు కపిల్ సిబల అభిషేక్ సంఘ్వీ అత్యవసర విచారణకు అభ్యర్థించడంతో ఈ అంశం కోర్టు ముందుకు వచ్చింది.న్యాయవ్యవస్థను కించ పరిచే లేదా దాని సమగ్రతను దెబ్బ తీసే వ్యాఖ్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ అనుమతించబోమని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ స్పష్టం చేశారు. కాగా, విద్యార్థుల్లో రాజ్యాంగ అవగాహన, సంస్థల పట్ల గౌరవం, ప్రజాస్వామ్య పాలనపై సమగ్ర అవగాహన పెంపొందించడమే లక్ష్యంగా కొత్త పుస్తకాలను రూపొందించినట్టు ఎన్‌సిఇఆర్‌టి తన ప్రకటనలో పేర్కొంది. ఏ రాజ్యాంగ సంస్థ అధికారాన్ని ప్రశ్నించడం లేదా తగ్గించడం తమ ఉద్దేశం కాదని సంస్థ స్పష్టం చేసింది. 2026–27 విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందు సంబంధిత అధికారులతో సంప్రదించి ఆ అధ్యాయాన్ని పునర్వ్యవస్థీకరించి మళ్లీ విడుదల చేస్తామని వివరించింది. ఇలావుంటే, అటార్నీ జనరల్ తరపున సోలిసిటర్ జనరల్ తుషార్ మెహతా నిర్బంధంగా క్షమాపణ చెప్పినట్టు కనిపిస్తున్నదని ప్రధాన న్యాయమూర్తి వ్యాఖ్యానించారు. ఎన్‌సిఇఆర్‌టి ప్రకటనలో స్పష్టమైన క్షమాపణ కనిపించలేదని, దాని బదులు ఆ అధ్యాయాన్ని సమర్థించేందుకు ప్రయత్నించినట్లు అనిపించిందని సిజెఐ పేర్కొన్నారు.

## క్యూబాకు 'కార్సికామ్' సదస్సు సంఘీ భావం

**బాస్సెటెర్రె:** క్యూబాపై అమెరికా ఆంక్షలు, పశ్చిమార్థగోళంలో ఆధిపత్యం కోసం చేస్తున్న ఆగడాలు మితిమీరిపోవడంతో కరీబియన్, అమెరికా ప్రాంతంలో ఉన్న 15 ప్రాంతీయ దేశాల రీజినల్ బ్లాక్ నాయకులు సెయింట్ కిట్స్–నెవిస్ (వెస్టిండీస్‌లోని ఒక ద్వీపదేశం)లోని బాస్సెటెర్రె నగరంలో మంగళవారం సమావేశమయ్యాయి. మితిమీరుతున్నా ఆమెరికా ఆగడాలపై ఈ దేశాల నాయకులు చర్చించారు. కరీబియన్, అట్లాంటిక్ సముద్రప్రాంతంలో పరస్పరం సహాయకారిగా ఉంటున్న అంతర్ ప్రభుత్వ కూటమి 'కార్సికామ్' 50వ సదస్సు బుధవారం, గురువారం బాసెటెర్రాలో జరిగింది. క్యూబా,వెనిజులా పరిణామాలపై ఈ దేశాలు చర్చించాయి. క్యూబాకు అండగా ఉండాలని సమావేశం నిర్ణయించింది. 15 దేశాల ప్రభుత్వాధినేతల ఈ సమావేశం ఒక మైలురాయి ఘట్టంగా మారింది. ఈ ఉన్నతస్థాయీ సమావేశం కేవలం ప్రాంతీయ నాయకులకే పరిమితం కాకుండా కరీబియన్ ప్రాంతంలో మారుతున్న పరిస్థితుల్లో అమెరికా సహా అంతర్జాతీయ భాగస్వాములను కూడా ఆకర్షించింది. సౌదీ౨ అరేబియా విదేశఋూంగమంత్రి అదెల్ అల్–జుబైర్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ విదేశీశాఖ సహాయమంత్రి నౌరా బింట్ మహ్మద్ అల్‌కాబీ, కామన్వెల్త్ సెక్రటరీ జనరల్ షిర్లీ బోచ్ వెల్ ప్రత్యేక అతిథులుగా హాజరయ్యారు.

## 45 మంది ఐఎఎస్‌ల భారీ బదిలీ

### కీలక శాఖల్లో కొత్త నియామకాలు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్ర పరిపాలన అవసరాలను దృష్టిలో ఉంచుకుని తెలంగాణ ప్రభుత్వం ఐఎఎస్ అధికారుల భారీ స్థాయి బదిలీలు, పోస్టింగులు చేపట్టింది. ఈ మేరకు సాధారణ పరిపాలన శాఖ జి.ఓ.ఆర్.టి. నెం. 290 జారీ చేసింది. సీనియర్ అధికారుల నుంచి జిల్లా కలెక్టర్ల వరకు మొత్తం 45 మందికి పైగా అధికారుల స్థానాల్లో మార్పులు జరిగాయి. మొత్తం మీద సీనియర్ స్థాయి నుంచి ఫీల్డ్ స్థాయి వరకు విస్తృత మార్పులు చేయడం ద్వారా పరిపాలనలో సమన్వయం లక్ష్యంగా ఈ బదిలీలు జరిగాయని అధికార వర్గాలు తెలిపాయి.

***బదిలీ అయిన అధికారుల వివరాలు ఇలా ఉన్నాయి.***

| అధికారి పేరు | ప్రస్తుతం హోదా | కొత్త పోస్టింగ్ |
|---|---|---|
| సంజయ్ కుమార్ | ఇండస్ట్రీస్ ఐటి | పంచాయితీరాజ్ |
| సబ్యసాచీ ఘోష్ | ఫ్లాగ్‌షిప్ స్కీమ్స్‌తో | సిఎస్ఆర్ అదనపు బాధ్యత |
| ఎం. దానా కిషోర్ | ఎల్ఇటి మరియు ఎఫ్ | విపత్తు నిర్వహణ (ఎఫ్‌ఎసి) |
| ఎన్. శ్రీధర్ | పంచాయితీరాజ్ | ఐటి ఇండస్ట్రీస్ |
| రాహుల్ బొజ్జా | ఇరిగేషన్ | జిఎడి |
| ఈ. శ్రీధర్ | ఎఫ్ఎసి పొలిటికల్ | సిఎడి |
| గౌరవ్ ఉప్పల్ | కోఆర్డినేషన్ (ఢిల్లీ) | ఫైనాన్స్ ప్లానింగ్ |
| బి. విజయేంద్ర | కలెక్టర్ మహబూబ్‌నగర్ | టిజిఎస్‌డబ్ల్యూర్ఇఐఎస్ |
| డి. దివ్య | సిఇఒ ఎస్ఇఆర్‌పి | స్టేట్ నోడల్ ఆఫీసర్, ప్రజావాణి |
| అద్వైత్ కుమార్ సింగ్ | కలెక్టర్ మహబూబాబాద్ | కోఆర్డినేషన్ (ఢిల్లీ) |
| ఎం. హనుమంతరావు | కలెక్టర్ యాదాద్రి | దేవాదాయ శాఖ |
| సిక్తా పట్నాయక్ | కలెక్టర్ నారాయణపేట్ | స్పెషల్ సెక్రటరీ ఫైనాన్స్ |
| సందీప్ కుమార్ ఝా | జిహెచ్‌ఎంసి జెడ్‌సి | కలెక్టర్ జంగాం |
| ముషారఫ్ అలీ | ఎస్‌పిడిసిఎల్ | 3వ డిస్కం |
| పామెలా సత్యపతి | కలెక్టర్ కరీంనగర్ | స్పెషల్ కమిషనర్ లేబర్ |
| అనురాగ్ జయంతి | జిహెచ్‌ఎంసి జెడ్‌సి | కలెక్టర్ యాదాద్రి భువనగిరి |
| రాహుల్ రాజ్ | కలెక్టర్ మెదక్ | రిజిస్ట్రార్ కోఆపరేటివ్ సొసైటీలు |
| భవేశ్ మిశ్రా | ఐటిఇసి డిఎస్ | ఐటిఇసి ఎస్ఎస్ |
| జితేష్ వి.పాటిల్ | కలెక్టర్ భద్రాద్రి | ఎస్‌పిడిసిఎల్ |
| రిజ్వాన్‌బాషా షేక్ | కలెక్టర్ జంగాం | కలెక్టర్ జోగులాంబ గద్వాల్ |
| సంతోష్ బి.ఎం. | కలెక్టర్ జోగులాంబ | డైరెక్టర్ ట్రైబల్ వెల్ఫేర్ |
| ప్రతీక్ జైన్ | కలెక్టర్ వికారాబాద్ | కలెక్టర్ నారాయణపేట్ |
| స్నేహ శబరిష్ | కలెక్టర్ హనుమకొండ | కలెక్టర్ మహబూబాబాద్ |
| పీ. కాత్యాయనీ దేవి | ప్రజావాణి | స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ |
| జి. ఫణీంద్ర రెడ్డి | ఎఎంఎస్ఐడిసి | అదనపు కలెక్టర్ నారాయణపేట్ |
| చిత్ర మిశ్రా | పిఒ,ఐటిడిఎ ఏటూరునాగారం | కలెక్టర్ కరీంనగర్ |
| గరీమా అగర్వాల్ | అదనపు కలెక్టర్ రాజన్న సిరిసిల్ల | కలెక్టర్ రాజన్న సిరిసిల్ల |
| దీపక్ తివారి | అదనపు కలెక్టర్ ఆసిఫాబాద్ | కలెక్టర్ వికారాబాద్ |
| ప్రతిమ సింగ్ | అదనపు కలెక్టర్ రంగారెడ్డి | కలెక్టర్ మెదక్ |
| అంకిత్ | అదనపు కలెక్టర్ నిజామాబాద్ | కలెక్టర్ భద్రాద్రి కొత్తగూడెం |
| చహత్ బాజ్‌పాయ్ | మున్సిపల్‌కమిషనర్,జిడబ్ల్యూఎంసి | కలెక్టర్ హనుమకొండ |
| ఖుష్బూ గుప్తా | పిఒ,ఐటిడిఎ ఉట్నూర్ | కలెక్టర్ మహబూబ్‌నగర్ |
| మందా మకరందు | ప్రాజెక్ట్ డైరెక్టర్, సిఎంఆర్ఒ | జోనల్ కమిషనర్ జిహెచ్‌ఎంసి |
| ఫైజాన్ అహ్మద్ | అదనపు కలెక్టర్ నిర్మల్ | అదనపు కలెక్టర్, మెడ్చల్ |
| శివేంద్ర ప్రతాప్ | అదనపు కలెక్టర్ మహబూబ్‌నగర్ | జాయింట్ ఎండి మెట్రో రైల్ |
| పింకేష్‌కుమార్ | అదనపు కలెక్టర్ జనగాం | జోనల్ కమిషనర్ జిహెచ్‌ఎంసి |
| ఉమాశంకర్‌ప్రసాద్ | సబ్ కలెక్టర్ తాండూర్ | అదనపు కలెక్టర్ వికారాబాద్ |
| శ్యామ్ ప్రసాద్ | జాయింట్ సెక్రటరీ ఎంజెపి | అదనపు కలెక్టర్ నాగర్‌కర్నూల్ |
| పి. చంద్రయ్య | అదనపు కలెక్టర్ రెవెన్యూ | అదనపు కలెక్టర్, మంచిర్యాల |
| వై.వి. గణేష్ | స్పెషల్ కలెక్టర్ ఎల్ఎ | అదనపు కలెక్టర్ వరంగల్ |
| అబ్దుల్ హమీద్ | అదనపు కలెక్టర్ సిద్దిపేట | అదనపు కలెక్టర్ సిద్దిపేట |
| బి. వెంకటేశ్వర్లు | డిఆర్ఒ కరీంనగర్ | అదనపు కలెక్టర్ నిర్మల్ |
| ఖీమ్యానాయక్ | అదనపు కలెక్టర్, వనపర్తి | అదనపు కలెక్టర్ వనపర్తి |
| కె. విద్యాసాగర్ | ఒఎస్‌డి చీఫ్ సెక్రటరీ | ఇండస్ట్రీఇన్వెస్ట్‌మెంట్ సెల్ |
| ఎం. సురేందర్ | అదనపు రిజిస్ట్రార్ కోఆపరేటివ్ | అదనపు నోడల్ ఆఫీసర్ ప్రజావాణి |

## అనుమతి రద్దు (మొదటి పేజీ తరువాయి)

\కలిగి ఉన్న రంగారెడ్డి జిల్లా మంచాల మండలంలోని ఆరుట్ల తెలంగాణ పబ్లిక్ స్కూల్ తరహాలోనే ఈ వంద స్కూళ్లు ఉండాలని సిఎం ఆదేశించారు. నాణ్యమైన విద్యకు చిరునామాగా తెలంగాణలోని ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దాలని, ఇందుకు ఎంత వ్యయమైనా వెనుకాడేది లేదని ముఖ్యమంత్రి స్పష్టం చేశారు. విద్యా శాఖపై సిఎం రేవంత్ రెడ్డి గురువారం కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. కార్పొరేట్ పాఠశాలల తరహాలో ప్రభుత్వ పాఠశాలు కోర్ అర్బన్ రీజియన్ ఎకానమీ (క్యూర్) పరిధిలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ పాఠశాలల తరహాలో నిర్మించాలని సిఎం రేవంత్ రెడ్డి సంబంధిత ఇంజినీర్లను ఆదేశించారు. వీటి నిర్మాణంలో ఆధునిక సాంకేతికతను వినియోగించుకోవాలని, ఏడాదిలో క్యూర్ పరిధిలో నిర్దేశించుకున్న 12 ఇంటిగ్రేటెడ్ నూతన పాఠశాలల నిర్మాణం పూర్తి కావాలని సిఎం ఆదేశించారు. నగరంలోని భారతీయ విద్యా భవన్, జూబ్లీహిల్స్ పబ్లిక్ స్కూళ్లలో ఉండే అన్ని వసతులు ఈ ఇంటిగ్రేటెడ్ పాఠశాలల్లో ఉండాలన్నారు. క్యూర్‌లో అప్‌గ్రేడ్ చేయనున్న 17 పాఠశాలలు, అదనపు గదులు, ఇతర వసతులు కల్పించనున్న 164 పాఠశాలల పనుల్లో ఎటువంటి రాజీ పడకూడదని సిఎం స్పష్టం చేశారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో 99 రోజుల పాటు చేపట్టనున్న కార్యక్రమాల్లో వారం రోజులు విద్యా సంబంధిత అంశాలకు కేటాయించాలని సిఎం సూచించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు పాఠశాలలు, కళాశాలలను సందర్శించి అవసరమైన వసతుల కల్పన, ఇతర అంశాలను తెలుసుకుని వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

**పాఠశాల స్థాయి నుంచి ఎఐ బోధనకు చర్యలు**

కృత్రిమ మేధస్సు (ఎఐ) ప్రపంచాన్ని శాసిస్తున్న నేపథ్యంలో పాఠశాల స్థాయి నుంచి దాని బోధనకు అవసరమైన చర్యలు తక్షణమే చేపట్టాలని అధికారులను సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. మారుతున్న సాంకేతికతను అందిపుచ్చుకునేలా ఎఐపై ఉపాధ్యాయులు, లెక్చరర్లకు స్వల్పకాలిక శిక్షణ తరగతులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఎఐతో ప్రపంచ వ్యాప్తంగా వచ్చే మార్పులను తెలుసుకుని దాని ద్వారా వచ్చే అవకాశాలు మన విద్యార్థులే అందిపుచ్చుకునేలా మన సన్నద్ధత ఉండాలని సిఎం అభిప్రాయపడ్డారు. సాంకేతిక విద్యా విధానంలో అందుకు అనుగుణమైన మార్పులను తీసుకురావాలని సిఎం పేర్కొన్నారు. 20262027 విద్యా సంవత్సరం నుంచి అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు బ్రేక్ ఫాస్ట్‌తో పాటు పాలు అందజేయాలని, పాలను విజయా డెయిరీ నుంచి సేకరించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాఠశాల విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్, పుస్తకాలతో పాటు ఈ ఏడాది నుంచి కిట్ అందజేయాలని, ఇందుకు సంబంధించిన మొత్తాన్ని బడ్జెట్‌లో పొందుపర్చేలా చూడాలని అధికారులను సిఎం ఆదేశించారు.

**పాలిటెక్నిక్ కళాశాలలు, ఎటిసిలలో ఎఐ ఆధారిత కోర్సులు**

పాలిటెక్నిక్ కళాశాలలు, ఎటిసిలలో ఎఐ ఆధారిత కోర్సులను వెంటనే ప్రారంభించాలని, కాలం చెల్లిన కోర్సులను తొలగించాలని సిఎం రేవంత్ రెడ్డి ఆదేశించారు. పాలిటెక్నిక్, ఎటిసిలలో కోర్సులు పూర్తి చేసిన వారికి వెంటనే వివిధ పరిశ్రమల్లో ఉపాధి అవకాశాలు లభించేలా చూడాలన్నారు. రాష్ట్రంలోని అన్ని విశ్వ విద్యాలయాలకు నిధులు కేటాయిస్తామని, ఇప్పటికే ఉస్మానియా యూనివర్సిటీకి రూ.1000 కోట్లు కేటాయించిన విషయాన్ని సిఎం గుర్తు చేశారు. మిగతా యూనివర్సిటీలకు ఎంత నిధులు అవసరమనే దానిపై నివేదిక సమర్పించాలని ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ బాలకిష్టారెడ్డిని ముఖ్యమంత్రి ఆదేశించారు.

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు చర్యలు

ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల నియంత్రణకు సంబంధించి తెలంగాణ ప్రైవేటు పాఠశాలల ఫీజు రెగ్యులటరీ మానిటరింగ్ కమిషన్ తమ నివేదికలోని అంశాలను ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి ఎదుట ఉంచింది. వివిధ రాష్ట్రాల్లో అమల్లో ఉన్న విధానాలు, తెలంగాణలో తీసుకోవాల్సిన అంశాలను వివరించారు. జిల్లా స్థాయిలో కలెక్టర్, డిఈఓల నేతృత్వంలో పాఠశాలలను పరిశీలించి ఫీజుల నిర్ణయంపై నివేదిక సమర్పించాలని సిఎం ఆదేశించారు. రాష్ట్ర స్థాయిలో రిటైర్డ్ జడ్జి లేదా రిటైర్డ్ చీఫ్ సెక్రటరీ స్థాయిలోని కమిటీ తుది కమిటీగా ఉండి నిర్ణయాలు తీసుకుంటుందని తెలిపారు.

అలాగే ఫీజు నియంత్రణకు సంబంధించి విద్యార్థుల తల్లిదండ్రులు, మేధావులు, సామాజికవేత్తల అభిప్రాయ సేకరణకు ముసాయిదాను పబ్లిక్ డొమైన్‌లో ఉంచాలని సిఎం రేవంత్ రెడ్డి సూచించారు. సమావేశంలో ముఖ్యమంత్రి సలహాదారు వేం నరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కె.కేశవ రావు, సిఎం ముఖ్య కార్యదర్శి వి.శేషాద్రి, సిఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్ రెడ్డి, విద్యా కమిషన్ ఛైర్మన్ ఆకునూరి మురళీ, ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ప్రొఫెసర్ బాలకృష్ణా రెడ్డి, విద్యాశాఖ కార్యదర్శి యోగితా రాణా, సాంకేతిక విద్యా శాఖ కమిషనర్ దేవసేన, ఇంటర్మీడియట్ బోర్డు డైరెక్టర్ కృష్ణ ఆదిత్య, విద్యా శాఖ ప్రత్యేక కార్యదర్శి వెంకటేష్ ధోత్రే, పాఠశాల విద్యా శాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్, సమగ్ర శిక్ష నోడల్ ఆఫీసర్ డి.నాగరాజు, ఉస్మానియా విశ్వవిద్యాలయం వీసీ ప్రొఫెసర్ మొలుగారం కుమార్, డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ ఘంటా చక్రపాణి, విద్యా కమిషన్ సభ్యులు ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వరరావు, డాక్టర్ చారకొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డి, ప్రొఫెసర్ పద్మజా షా, కార్తీక్ సుబ్రహ్మణ్యన్, వీర వాసవి, డాక్టర్ జెన్నఫర్ అజ్మీ సయ్యద్, డాక్టర్ ఎన్.వెంకటేష్, షేక్ జావేద్ అఫ్రోజ్, డాక్టర్ జే.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థి సంఘాల ఎన్నికలు (మొదటి పేజీ తరువాయి)

ప్రొఫెసర్ పి.ఎల్.విశ్వేశ్వర్ రావు, డాక్టర్ చారకొండ వెంకటేష్, జ్యోత్స్న శివారెడ్డితో పాటు ప్రొఫెసర్ పద్మజాషా, కార్తీక్ సుబ్రహ్మణ్యన్, వీర వాసవి, డాక్టర్ జెన్నత్ ఫర్ అజ్మీ సయ్యద్, డాక్టర్ ఎన్. వెంకటేశ్, షేక్ జావేద్ అఫ్రోజ్, డాక్టర్ జె.స్వప్న తదితరులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా అమెరికా, వియత్నాం, మలేషియా దేశాల్లో స్వయంగా పర్యటించడంతో పాటు వివిధ దేశాలు, పలు రాష్ట్రాల్లోని అత్యుత్తమ విధానాలను పరిశీలించి నివేదిక రూపొందించినట్లు విద్యా కమిషన్ ఛైర్మన్, సభ్యులు సిఎంకు తెలియజేశారు. కాగా నివేదికలో చట్టబద్ధత కల్పించాల్సిన అంశాలు, వచ్చే విద్యా సంవత్సరం నుంచి అమలు చేయాల్సిన అంశాలపై నివేదికను రూపొందించే బాధ్యతలను ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేశవరావు నేతృత్వంలోని విద్యా కమిటీకి సిఎం రేవంత్ రెడ్డి అప్పగించారు.

సిఎంను కలిసిన అనంతరం కమిషన్ సభ్యులతో కలిసి చైర్మన్ ఆకునూరిమురళీ కమిషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ప్రభుత్వానికి సిఫారసు చేసిన పలు అంశాలను వెల్లడించారు.

విద్యార్థుల కేంద్ర బిందువుగానే విద్యా విధానం ఉండాలని అన్ని సిఫార్సులు ఆచరణాత్మకమైనవేని, వీటిపైన విస్తృత స్థాయి భాగస్వామ్యంతో ,సంప్రదింపుల అనంతరం , సమస్యలను గుర్తించి సిఫార్సులు చేసినట్టు వారుతెలిపారు.

**విద్యా కమిషన్ ప్రభుత్వానికి చేసిన సిఫార్సులు ఇవే....**

* తెలంగాణ పబ్లిక్ స్కూల్స్‌ను (టిపిఎస్) నర్సరీ నుండి 12వ తరగతి వరకు 1,500 విద్యార్థుల సామర్థ్యంతో, అన్నీ మౌలిక సదుపాయాలను కల్పించాలి. విద్యార్థులపై భారం పడకుండా, మెరుగైన విద్యను అందించాలని, అందుకు అనుగుణంగా మౌలిక సదుపాయాలు, నాన్ టీచింగ్, టీచింగ్ స్టాఫ్‌ను నియమించాలని ప్రతిపాదించింది. క్యాంపస్,బస్ సౌకర్యం కల్పించాలి. బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం, సాయత్రం స్నాక్స్ ఇవ్వాలి.

పూర్వ ప్రాథమిక విద్యను (నర్సరీ,ఎల్‌కెజి,యుకెజి ) ప్రాథమిక పాఠశాల లో ఏర్పాటు చేయాలి.

* హైదరాబాద్, రంగారెడ్డి , మేడ్చల్ జిల్లాలలో ప్రతి ఒక్కటిలో 3 చొప్పున, ఇతర జిల్లాలలో ప్రతి ఒక్కటిలో 1 చొప్పున స్కూల్ డిస్ట్రిక్ట్‌లను ఏర్పాటు చేయాలి..
* విద్యా ప్రమాణాలు, సిబ్బంది నియామకం, మౌలిక వసతుల కల్పన. నాణ్యతా చర్యలను పర్యవేక్షించేందుకు కలెక్టర్ల ఆధ్వర్యంలో స్కూల్ డిస్ట్రిక్ట్ బోర్డు ఉండాలి. ఉపాధ్యాయుల ఆటోమేటిక్ పదోన్నతులు ఉండకూడదు
* మూడు భాషల విధానాన్ని ఒకటవ తరగతి నుండే అమలు చేయాలి. ఇందులో తెలుగు/ఉర్దూ ,ఇంగ్లీష్, హిందీ. నర్సరీ నుండి విశ్వవిద్యాలయ స్థాయి వరకు ఇంగ్లీష్‌లోనే బోధన.
* అన్ని రెసిడెన్షియల్ సంస్థలను ఒకే తెలంగాణ స్టేట్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీగా ఏర్పాటు. ఐఐటి,జెఇఇ/ఎన్ఇఇటి కోచింగ్ సెంటర్లు, హాస్టళ్లను నియంత్రించేందుకు చట్ట సవరణ.
* ప్రైవేట్ జూనియర్ కళాశాలల నుండి పోటీ పరీక్షల సెంటర్లను వేరు చేయాలి.
* ప్రైవేట్ జూనియర్ కళాశాల పేరుతో నిర్వహించే కోచింగ్ ను (వ్యాపారాన్ని) నిషేధించాలి
* 10వ తరగతి, 12వ తరగతిలో మాత్రమే బోర్డు ఎగ్జామ్ ను నిర్వహించాలి
* 'ఎప్‌సెట్‌ను రద్దు చేసి, ఇంటర్ మార్కుల ఆధారంగానే ఇంజినీరింగ్,వ్యవసాయం,ఫార్మసీలో ప్రవేశాలుఉండాలి.
* విశ్వవిద్యాలయాలు,ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో ఖాళీగా ఉన్న అన్ని రెగ్యులర్ అధ్యాపక పోస్టులను (సగటున 72శాతం) వెంటనే భర్తీ చేయాలి.
* విశ్వవిద్యాలయ కార్యనిర్వాహక మండలిని పునర్నిర్మించాలి. ఐఎఎస్ అధికారులను విసిలుగా నియమించొద్దు.
* ఐటిఐలను కార్మిక,ఉపాధి శాఖ నుండి సాంకేతిక విద్య శాఖ కు బదిలీ చేయాలి.
* పాలిటెక్నిక్ విద్యార్థులకు ఇంజనీరింగ్‌లో తక్షణమే ఎంట్రీ ఉండకూడదు.
* ప్రతి డిగ్రీ కళాశాలకు అనుబంధం గా 200 కెపాసిటితో అతి పేద విద్యార్థులకు ఒక సంక్షేమ హాస్టల్‌ను ఏర్పాటు చేయాలి.
* తెలంగాణ ఎడ్యుకేషన్ స్టాండర్డ్స్ అథారిటీని ఏర్పాటు చేయాలి.
* రాష్ట్ర బడ్జెట్‌లో విద్యా రంగానికి కనీసం 18 శాతం నిధులను కేటాయించాలి.
* 'కమిషన్ లెక్కల ప్రకారం.. తెలంగాణ రాష్ట్రంలో విద్యా వ్యవస్థ....
* ప్రభుత్వ పాఠశాలలో ఒకటవ తరగతిలో విద్యార్థుల నమోదు 26 శాతం.
* 2వ తరగతి వాచకము చదవే 3వ తరగతి విద్యార్థులు 6.3 శాతం.
* సున్నా నమోదు ఉన్న ప్రభుత్వ బడుల సంఖ్య 1920 ( దేశంలో రెండవ స్థానం)
* 82శాతం ప్రభుత్వ ప్రాథమిక బడులు మల్టిగ్రేడ్ టీచింగ్.
* 36 శాతం ప్రభుత్వ ప్రాథమిక బడుల లో ఒక టీచర్ మాత్రమే.
* నాణ్యమైన పాఠశాల విద్య లో తెలంగాణ ర్యాంక్ 26.
* యూనివర్సిటీలలో 80 శాతం టీచింగ్ పోస్టులు ఖాళీలు.
* 13.9 శాతం (ప్రభుత్వ, ప్రైవేట్) కళాశాలకు మాత్రమే ఎన్ఎఎసి గ్రేడ్ ఉంది.



# సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై 100 రోజుల కార్యక్రమం

## ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** రాష్ట్రంలో వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల అమలుపై 100 రోజుల కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణా రావు వెల్లడించారు. రాష్ట్ర ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ప్రజా ప్రతినిధులు పాల్గొనే వంద రోజుల కార్యక్రమంలో అన్ని శాఖల వారీగా విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ సచివాలయంలో గురువారం ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శులు, ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులతో ప్రత్యేక సమావేశాన్ని సిఎస్ నిర్వహించారు. సమావేశంలో సిఎస్ మాట్లాడుతూ, ఈ వంద రోజుల కార్యక్రమంపై ఈ నెల 28వ తేదీన నిర్వహించే కార్యదర్శుల సమావేశానికి రాష్ట్ర ముఖ్యమంత్రి హాజరవుతారని తెలిపారు. మార్చ్ 1వ తేదీ జిల్లా కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. మార్చి 2వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు వివిధ అభివృద్ధి పనులపై ప్రతీ శాఖ తమ 100 రోజుల కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయాలని, జిల్లా కలెక్టర్ల సమావేశంలో చర్చనీయాంశాలు వెంటనే రూపొందించాలన్నారు. వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలను ముఖ్యమంత్రితో పాటు మంత్రులు ప్రారంభిస్తారని ఇందుకుగాను ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ప్రభుత్వ భవనాలను సిద్ధం చేయాలన్నారు. ప్రధానంగా గ్రామీణాభివృద్ధి, మున్సిపల్, విద్య, వైద్య, పంచాయితీరాజ్, వ్యవసాయం, రెవెన్యూ, పర్యాటక, పరిశ్రమలు, మహిళా శిశు సంక్షేమం, గృహ నిర్మాణం,విద్యుత్, కార్మిక తదితర అన్ని శాఖలు కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలని సిఎస్ చెప్పారు. ముఖ్యంగా, పారిశుధ్యం గ్రామీణాభివృద్ధి ఆరోగ్య తదితర కార్యక్రమాలపై నూతనంగా ఎన్నికైన సర్పంచులు, మున్సిపల్ చైర్మన్లకు అవగాహన, చైతన్య కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. సచివాలయం తోపాటు హెచ్ఓడిలలో ఈ ఆఫీస్‌ను అమలు చేయాలని ఆదేశించారు. సమావేశంలో స్పెషల్ సిఎస్‌లు జయేష్ రంజన్, వికాస్ రాజ్, సి.వి.ఆనంద్ , సంజయ్ కుమార్ , మహేష్ దత్ ఎక్కా, సబ్యసాచి ఘోష్, నవీన్ మిట్టల్, దాన కిషోర్, అహ్మద్ నదీమ్, తదితరులు పాల్గొన్నారు.

# అగ్రశ్రేణి లాజిస్టిక్ హబ్‌గా తెలంగాణ

- 2047 నాటికి ఈ రంగంలో తిరుగులేని శక్తిగా రాష్ట్రం
- 'ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం' అభివృద్ధికి సమగ్ర ప్రణాళికలు
- 'ట్రాన్స్ పోర్ట్ లాజిస్టిక్ ఇండియా 2026' సదస్సులో మంత్రి శ్రీధర్ బాబు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణను దేశంలోని అగ్రశ్రేణి లాజిస్టిక్ హబ్‌లల్లో ఒకటిగా తీర్చిదిద్దేలా తమ ప్రభుత్వం ప్రణాళికాబద్ధంగా కృషి చేస్తోందని రాష్ట్ర ఐటి, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు వెల్లడించారు. ఆ దిశగా మౌలిక సదుపాయాల అభివృద్ధి, డిజిటల్ ఇంటిగ్రేషన్, పాలసీ అండ్ రెగ్యులేటరీ ఫెసిలిటేషన్, సస్టైనబిలిటీ అండ్ గ్రీన్ లాజిస్టిక్స్, స్కిల్ డెవలెప్ మెంట్ అండ్ ఇన్నోవేషన్‌తో కూడిన 'ఫ్యూచర్ రెడీ ఎకో సిస్టం' అభివృద్ధిపై ప్రత్యేకంగా దృష్టి సారించామన్నారు. ముంబై లోని జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో 'మెస్సే ముంచెన్ ఇండియా(మెస్సే ముంచెన్ జర్మనీ అనుబంధ సంస్థ)' నిర్వహిస్తోన్న 'ట్రాన్స్ పోర్ట్ లాజిస్టిక్ ఇండియా 2026' సదస్సులో గురువారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.... దేశ ఆర్థిక గమనాన్ని నిర్దేశించే కీలక రంగాల్లో ప్రధానమైన 'లాజిస్టిక్ రంగం'లో 2047 నాటికి తెలంగాణను తిరుగులేని శక్తిగా మార్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, భవిష్యత్తు ప్రణాళికలను వివరించారు. భౌగోళిక విస్తీర్ణంలో పదకొండు, జనాభాలో పన్నెండో స్థానంలో ఉన్న తెలంగాణ వాటా దేశ జిడిపిలో ప్రస్తుతం 5 శాతంగా ఉందన్నారు. దీనిని 2047 నాటికి 10 శాతానికి పెంచాలనే సంకల్పంతోనే 'తెలంగాణ రైజింగ్ 2047' డాక్యుమెంట్ కు శ్రీకారం చుట్టామన్నారు. 3 ట్రిలియన్ డాలర్లకు తెలంగాణ ఆర్థిక వ్యవస్థను చేర్చాలనే లక్ష్య సాధనలో లాజిస్టిక్ రంగానిదే కీలక పాత్ర అని స్పష్టం చేశారు. ప్రపంచవ్యాప్తంగా సరఫరా గొలుసుల పునర్నిర్మాణం, ఎఐ ఆధారిత ఇంటెలిజెంట్ లాజిస్టిక్స్, సస్టైనబిలిటీ అనే మూడు ప్రధాన మార్పులు లాజిస్టిక్స్ రంగాన్ని సమూలంగా మార్చేస్తున్నాయన్నారు. ఇలాంటి తరుణంలో భౌగోళికంగా మనకున్న అనుకూలతలను 'డిజైన్ అడ్వాంటేజ్'గా మార్చుకుని సత్తా చాటేలా ముందుకెళ్తున్నామన్నారు. రీజినల్ రింగ్ రోడ్డు, మెట్రో ఫేజ్ – 2, కొత్త ఎయిర్ పోర్టులు, డ్రై పోర్టు, తెలంగాణ లాజిస్టిక్స్ పాలసీ 2.0, లాజిస్టిక్ హబ్స్ తదితర ప్రాజెక్టులు ఈ రంగంలో రాష్ట్రాన్ని అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా మార్చుతాయనడంలో ఎలాంటి సందేహం లేదన్నారు. యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్శిటీ, ఇతర భాగస్వామ్య పక్షాల సహకారంతో లాజిస్టిక్స్ రంగానికి అవసరమైన రెడీ టూ వర్క్ ఫోర్స్‌ను తయారు చేస్తున్నామని పునరుద్ఘాటించారు. కేవలం వస్తువులను ఉత్పత్తి చేయడమే కాకుండా, వాటిని ప్రపంచం ఊహించని వేగంతో డెలివరీ చేసి 'లాజిస్టిక్ పవర్ హౌస్'గా ఎదిగే సత్తా తెలంగాణకు ఉందని స్పష్టం చేశారు.



తమిళనాడు సిపిఐ సీనియర్ నాయకుడు, స్వాతంత్ర్య సమరయోధుడు నల్లకన్నుకు వేలాదిమంది కార్యకర్తలు, అభిమానులు గురువారం అంతిమ వీడ్కోలు పలికారు. సిపిఐ రాష్ట్ర కార్యాలయం నుండి చెన్నై మెడికల్ కాలేజీ వరకూ అంతిమ యాత్ర సాగింది. అనంతరం వైద్య విద్యార్థుల పరిశోధన నిమిత్తం నల్లకన్ను భౌతిక కాయాన్ని మెడికల్ కాలేజీకి అప్పగించారు.

# ఆదర్శ నాయకుడు నల్లకన్ను

సిపిఐ హైదరాబాద్ కౌన్సిల్ ఘనంగా నివాళి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** తమిళనాడు రాష్ట్ర సిపిఐ మాజీ కార్యదర్శి కామ్రేడ్ నల్ల కన్నుకు సిపిఐ హైదరాబాద్ కౌన్సిల్ ఘనంగా నివాళులర్పించారు. హిమాయత్‌నగర్‌లోని సిపిఐ కార్యాలయం వద్ద ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సిపిఐ సీనియర్ నాయకులు కామ్రేడ్ డాకర్ బివి విజయలక్ష్మి మాట్లాడుతూ, స్వాతంత్ర పోరాటంలో ఏడు సంవత్సరాలు జైలు జీవితం గడిపి పేద ప్రజల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీ లో నల్ల కన్ను చేరటం జరిగింది. జీవితాంతం రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీల కోసం వారి హక్కుల పరిరక్షణ కోసం అనేక ఉద్యమాలు నిర్వహించిన నాయకుడని కొనియాడారు. అక్రమ ఇసుక తవ్వకాలకు వ్యతిరేకంగా , పర్యావరణ పరిరక్షణ సామాజిక న్యాయ జెండాగా జరిగిన అనేక ఉద్యమాల్లో క్రియాశీలక పాత్ర పోషించాడు. కోట్లాదిమంది పీడత ప్రజల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోతారన్నారు. సిపిఐ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి స్టాలిన్ మాట్లాడుతూ, దోపిడికి వర్గాలకు వ్యతిరేకంగా అట్టడుగు ప్రజల హక్కుల కోసం కమ్యూనిస్టు పార్టీ సిద్ధాంతం పనిచేస్తుందని తన జీవితం ద్వారా తెలిపిన వ్యక్తి కామ్రేడ్ నల్ల కన్ను అని అన్నారు. తమిళనాడు వ్యాప్తంగా వివిధ రంగాలలో పనిచేస్తున్న వారిని అత్యంత ప్రభావితం చేసిన వ్యక్తి. పార్టీలకు అతీతంగా అందరి మనసులను గెలుచుకున్న వ్యక్తి. జీవిత చరమాంకంలో కూడా అత్యంత సాధారణ జీవితం గడిపాడు. ప్రభుత్వాలు, వివిధ సంస్థలు తనకు ఇచ్చిన అవార్డుకు సంబంధించిన డబ్బును కూడా తిరిగి ప్రభుత్వాలకి ఇచ్చినటువంటి ఆదర్శమైన నాయకుడన్నారు. ఆయన జీవితం పోరాడుతున్న శక్తులకు ఒక స్ఫూర్తిదాయకం. ఆయన ఆశయాలను ముందుకు తీసుకెళ్తూ సమసమాజ నిర్మాణం కోసం పోరాటం నిర్మించడమే ఘనమైన నివారణ అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యవర్గ సభ్యులు చంద్రమోహన్ గౌడ్ నేర్లకంటి శ్రీకాంత్, కాంపల్లి శ్రీనివాస్, జిల్లా కౌన్సిల్ సభ్యులు చెట్టు కింది శ్రీనివాస్, జంగయ్య,చైతన్య ,కళ్యాణ్,అశోక్, భవన నిర్మాణ కార్మికులు గణేష్, జిల్లా నాయకులు గౌస్,భాను, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# మధ్యప్రదేశ్‌కు బెస్ట్ టూరిజం అవార్డు




## 'ఢిల్లీ సాటె-2026' ప్రదర్శనలో

**ప్రజాపక్షం/హైదరాబాద్:** సౌత్ ఆసియా ట్రావెల్, టూరిజం ఎక్స్‌చేంజ్ (సాటే2026) ఆధ్వర్యంలో ఢిల్లీలో నిర్వహించిన ప్రదర్శనలో మధ్యప్రదేశ్‌కు బెస్ట్ టూరీజం అవార్డు లభించింది. మధ్యప్రదేశ్ పర్యాటక బోర్డు సాటే 2026లో ప్రత్యేక స్టాల్ ఏర్పాటు చేసి రాష్ట్రంలోని యునెస్కో వారసత్వ కట్టడాలు, జాతీయ ఉద్యానవనాలు, హెలి–టూరిజం సర్క్యూట్లు, హోమ్‌స్టే ప్రాజెక్టులు, మెరుగైన రవాణా సదుపాయాలను ప్రదర్శించింది. ఈ సందర్భంగా మధ్యప్రదేశ్ పర్యాటక శాఖ ఎండి డా.ఇళయరాజా టి. మాట్లాడుతూ, సాటే వంటి అంతర్జాతీయ వేదికలు పెట్టుబడులు, భాగస్వామ్యాలు, మార్కెట్ విస్తరణకు దోహదం చేస్తాయన్నారు. భారతదేశంలో ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా మధ్యప్రదేశ్ స్థానాన్ని మరింత బలోపేతం చేయడమే తమ లక్ష్యం అని పేర్కొన్నారు. రాష్ట్రంలోని యునెస్కో గుర్తింపు పొందిన ఖజారోహో గ్రూప్ ఆఫ్ మోనోమెంట్స్, సాంచిస్థుప, బీమ్‌బెత్క రోక్ షెల్టర్స్ వంటి ప్రదేశాల్లో సందర్శకుల సౌకర్యాలు, డిజిటల్ సేవలు, మెరుగైన నిర్వహణ వ్యవస్థలు ఏర్పాటు చేయడం ద్వారా పర్యాటకులకు అనుకూల వాతావరణం కల్పించినట్లు అధికారులు వెల్లడించారు. భారతదేశపు టైగర్ రాష్ట్రంగా పేరుగాంచిన మధ్యప్రదేశ్‌లోని కన్హా టైటర్ రిజర్వ్, బందవ్‌గర్హ్, సత్‌పురా టైగర్ రిజర్వ్ వన్యప్రాణి అభయారణ్యాలు ప్రపంచ వ్యాప్తంగా పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. హోమ్‌స్టే ప్రాజెక్టుల ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలు పెరిగి, స్థానిక సంస్కృతి–సంప్రదాయాలకు ప్రాధాన్యం లభిస్తోందన్నారు.

## సిపిఐ సీనియర్ నాయకులు నల్లకన్నుకు ఆటో వర్కర్స్ యూనియన్ నివాళి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కమ్యూనిస్టు నేత, స్వాతంత్ర్య యోధుడు కామ్రేడ్ నల్లకన్ను (101) మృతికి సంతాపం తెలుపుతూ ఎఐటియుసి రాష్ట్ర కార్యాల యం వద్ద ఆటో వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, యూనియన్ గౌరవాధ్యక్షులు వి.ఎస్.బోస్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.వెంకటేశం ఆటో యూనియన్ నాయకులు ఎస్. అశోక్, సి.హెచ్.జంగయ్య, యం.నర్సింహ్మా, యం.క్రిష్ణ, కె. బాబు, మురళి, ఇంద్రసేన తదితరులు పాల్గొన్నారు.

## 28న ఎల్‌బి స్టేడియంలో 'జై కిసాన్ రైతుకు వందనం'

**ప్రజాపక్షం / సోమాజిగూడ :** సన్న కారు రైతులలో కొంత మందిని జిల్లాల స్థాయిగా ఎంపికైన వారికి ''జై కిసాన్ రైతుకు వందనం'' అనే అవార్డు అందజేత కార్యక్రమాన్ని ఈ నెల 28న సాయంత్రం 4 గంటలకు హైదరాబాద్ ఎల్‌బి స్టేడియంలో నిర్వహించనున్నట్టు సాయి అలేఖ్య సాంస్కృతిక సంఘ సేవా సంస్థ వ్యవస్థాపకులు అరుణ ఉపద్రుష్ట తెలిపారు. ఈ మేరకు గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. అరుణ మాట్లాడుతూ వ్యవసాయం మీద మరింత అవగాహన తెచ్చేలా ఈ కార్యక్రమం ఉంటుందన్నారు. సాయి అలేఖ్య సాంస్కృతిక సంఘ సేవా సంస్థ 30 ఏండ్లు పూర్తి అవుతున్న సందర్భంగా కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఉపద్రుష్ట అశోక్, వి. విజయకుమార్, స్నేహ రామ చందర్, జి. జలజ తదితరులు పాల్గొన్నారు.



## హనుమంతరావు, జెట్టి కుమార్‌కు రాజ్యసభ ఇవ్వాలి

### ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను కోరిన జగ్గారెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి అహార్నిషలు కృషి చేసిన వి.హనుమంతురావు, జెట్టి కుసుమ కుమర్‌లకు రాజ్యసభకు ఎంపిక చేయాలని ఎఐసిసి అధ్యక్షులు మల్లికార్జున ఖర్గేని గురువారం ఢిల్లీలో కలిసి కోరినట్లు తెలంగాణ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి మాట్లాడుతూ తెలంగాణలో ఖాళీ అయిన రాజ్యసభ స్థానాలను వి.హనుమంతురావు, జెట్టి కుసుమ కుమార్‌కి ఇవ్వాలని సిఎం రేవంత్ రెడ్డి, పిసిసి ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్‌తో పాటు ఇంచార్జి నటరాజ్‌కు విన్నవించినట్లు చెప్పారు. రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గేనీ కలవడానికి ఢిల్లీ వచ్చానని, రాహుల్ గాంధీ ముందస్తు షెడ్యూల్ కారణంగా ఆయన బిజీగా ఉండడంతో కలవడం కుదరలేదన్నారు. జెట్టి కుసుమ కుమార్ కుటుంబం స్వాతంత్ర్య సమరయోధులు, వారందరూ కాంగ్రెస్‌లోనే కొనసాగారనీ, కుసుమకుమార్ కూడా యూత్ కాంగ్రెస్ లీడర్‌గా అనేక కార్యక్రమాలకు శ్రీకారం చుట్టాడని, ఆయనకు రాజ్యసభ అవకాశం ఇవ్వాలని కోరారన్నారు. అలాగే హనుమం తరావు తెలంగాణలో అనేక ముఖ్యమంత్రులతో పని చేశారు, మూడు సార్లు రాజ్యసభ ఎంపిగా పని చేశారనీ, రాజీవ్ గాంధీ , సోనియాగాంధీ ఆయనకు అవకాశాలు ఇచ్చారని గుర్తు చేశారు. వయసులో పెద్ద వ్యక్తి, చురుకైన వ్యక్తి కాబట్టి మరో సారి అవకాశం ఇవ్వాలని కోరానని చెప్పారు. ఖర్గే కమిటీలో చర్చిస్తామని హామీ ఇచ్చారని, రాహుల్ గాంధీ నిర్ణయం మేరకు ముందుకు వెళ్తామని జగ్గారెడ్డి పేర్కొన్నారు.


# కాళేశ్వరం ప్రాజెక్టుతో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నం

## రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో బిఆర్‌ఎస్ ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేయడంతో పాటు కోట్ల రూపాయలు కమీషన్లు తీసుకొని రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను చిన్నాభిన్నం చేశారని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. గాంధీ భవన్‌లో గురువారం ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, మీడియా సెల్ కన్వీనర్ సామ రామ్మోహన్ రెడ్డిలతో కలిసి విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ పేరుతో అప్పులు తీసుకువచ్చిన నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వం చేసిన పనికి రూ.47 వేల కోట్లు వడ్డీ రూపంలో చెల్లించాల్సి వచ్చిందని మంత్రి లక్ష్మణ్ అన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం కాళేశ్వరం పేరుతో కమీషన్లు దండుకుందని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాకు ఒక్క చుక్క నీరు ఇవ్వలేదన్నారు. కాళేశ్వరంలో చేసిన అవినీతికి ఇతర దేశాల్లో అయితే కఠిన శిక్షలు విధించే వారని మంత్రి అగ్రహం వ్యక్తం చేశారు. రైతులకు సంబంధించి రైతు బంధు, మూసీ ప్రక్షాళన గురించి ప్రధాన ప్రతిపక్ష నాయకులు మాట్లాడుతున్నారని, బిఆర్‌ఎస్ పార్టీ చేసిన పని వల్ల ప్రతి నెల రూ.6 వేల కోట్లు వడ్డీ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని మంత్రి వివరించారు. రాష్ట్రంలో ఆర్థిక సంక్షోభం ఉన్నప్పటికీ అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నామని మంత్రి తెలిపారు. బిఆర్‌ఎస్ నేతలు ముఖ్యమంత్రితో పాటు ప్రభుత్వంపై బురద జల్లె ప్రయత్నం చేస్తున్నారని, కాళేశ్వరం విషయంలో మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్, మాజీ మంత్రి కెటిఆర్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనేక ముఖ్యమైన అంశాల విషయంలో ప్రత్యేకంగా మాట్లాడానికి ప్రధాన ప్రతిపక్ష నేతగా కెసిఆర్ ఏనాడు అసెంబ్లీకి రాలేదని, ప్రభుత్వంలో ఉన్న సమయంలో ఏనాడు ఎస్‌సి, ఎస్‌టి విద్యార్థుల సంక్షేమాన్ని పట్టించుకోలేదని ఆరోపించారు. రెండేళ్ల పరిపాలనతో ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వం వెంట ఉన్నారని, ఏలాగైన ప్రభుత్వంపై తప్పుడు ప్రచారం చేయాలని రాజ్యాంగ బద్ధంగా ఉన్న ముఖ్యమంత్రిని ఏకవచనంతో కెటిఆర్ మాట్లాడుతున్నారని మంత్రి మండిపడ్డారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను గాడిలో పెట్టె ప్రయత్నంలో భాగంగా కాళేశ్వరం వడ్డీలను తగ్గించడానికి ముఖ్యమంత్రి చొరవ తీసుకున్నారని మంత్రి తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో నాలుగు అమలు చేస్తున్నామని, మరో రెండు గ్యారంటీలు త్వరలోనే అమలు చేస్తామని మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు.

## జూబ్లీహిల్స్‌లో భారీ అగ్నిప్రమాదం



**ప్రజాపక్షం /హైదరాబాద్:** జూబ్లి హిల్స్లో భారీ అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. రోడ్ నంబర్ 36లో మంగళగౌరి షోరూంలో గురువారం ఉదయం 11 గంటలకు మంటలు చెలరేగాయి. భారీగా మంటలు ఎగిసిపడుతుండటంతో పాటు ప్రాంతమంతా భారీగా పొగలు వ్యాపించాయి. పక్క భవనాలకు కూడా మంటలు వ్యాపించాయి. ఫైర్ సిబ్బందికి సమాచారం అందించడంతో వెంటనే అక్కడకు చేరుకుని మంటలు అదుపుచేసే ప్ర యత్నం చేశారు. షాప్ ముందు ఏర్పాటు చేసిన టెంపుల్ సెట్ షార్ట్ స ర్క్యూట్ వల్ల మంటలు అంటుకోవడం వల్లనే ప్రమాదం జరిగిన ట్టు తెలుస్తోంది.ఉదయం షోరూ తెరుస్తున్న సమయంలో నిప్పురవ్వలు చెలరేగి టెంపుల్ సెట్‌కు మంటలు అంటుకున్నట్టు సమాచారం. టెంపు ల్ సెట్ పూర్తిగా కాలిపోగా ఇప్పటికే షోరూంలోకి సైతం మంటలు వ్యాపించి దుస్తులన్నీ కాలిపోయా యి. భవనం మొత్తం మంటలు, దట్టమైన పొగతో నిండిపోయిం ది. మంటలు భారీగా ఎగిసి పడుతుండటంతో రోడ్డుపై నుండి వెళ్లే వాహనాలను సైతం నిలిపివేశా రు. ప్రస్తుతం షోరూం సిబ్బంది హుటాహుటీనా బయటికి పరుగులు పెట్టడంతో ఎవరికి ఎలాం టి ప్రాణా హాని జరగలేదు. షో రూం లోపల ఎవరూ లేరని పోలీసులు చెబుతున్నారు.

## మౌనం వెనుక ఉన్న ఆత్మ సౌందర్యం తెలిపిన 'మౌనం'



**ప్రజాపక్షం/హైదరాబాద:** ప్రతి వారికి బాహ్య సౌందర్యం ప్రతిభ, డబ్బు, అధికారం, ఆకర్షణ అని భావించినా కానీ, ఇవేవీ ఆత్మ సౌందర్యానికి మించినవి కా వని మౌనం నవల స్పష్టం చేసింది అని ప్రభుత్వ పూర్వ సలహాదారు డాక్టర్ కెవి. రమణ అన్నారు. రవీంద్ర భారతి సమావేశ మందిరంలో గురువారం యువ కళావాహిని సాంస్కృతిక సేవా సంస్థ నిర్వాహణలో డాక్టర్ శ్రీలత కోట పాటి రచించిన మౌనం నవల ఆవిష్కరణ సభ జరిగింది. ముఖ్య అతిథిగా డాక్టర్ రమణ పాల్గొని సంపుటిని ఆవిష్కరించి, మాట్లాడుతూ మౌనం నవలలోని కథాంశం ఎన్నుకోవటానికి ధైర్యం ఉండాలని అన్నారు. అట్టి ధైర్యం శ్రీలతకు మాత్రమే ఉందని, అందుచేతనే నవలలో కథానాయకి సమిధను దేహ సౌందర్యంతో కాక అపురూప అంతరంగ సౌశీల్యంతో ఆవిష్కరణ చేసారని ప్రశంసించారు. ఈ సభకు అధ్యక్షత వహించిన ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ వోలేటి పార్వతీశం మాట్లాడు తూ మూడు వందల ఇరవై పేజీల మౌనం నవల మనుషుల వ్యక్తిత్వానికి ప్రతిబింబంగా నిలుస్తుందని చెప్పా రు. వేదికపై సినీ రచయిత రాజేంద్ర కుమార్, దూ రదర్శన్ పూర్వ వ్యాఖ్యాత్రి విజయ దుర్గ, వ్యాపార వేత్త కొండయ్య, నవ చేతన ప్రచురణ సంస్థ పి నా రాయణ రెడ్డి తదితరులు పాల్గొనగా, సంస్థ అధ్యక్షుడు లంక లక్ష్మీ నారాయణ వ్యాఖ్యానం సంద ర్భ శుద్ధిగా ఉంది. తౌలుత సురేఖ పవన్ పాడిన పాటలు మధురం గావున్నాయి.

## కూనంనేని సాంబశివరావుకు అరసం నేతల అభినందనలు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికలలో సిపిఐ ఘనవిజయం సాధించినందుకు అరసం నేతలు సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎంఎల్‌ఎ కూనంనేని సాంబశివరావుని అభినందించారు. హైదరాబాద్‌లోని సిపిఐ రాష్ట్ర కార్యాలయం మగ్దుం భవన్‌లో గురువారం కూనంనేని సాంబశివరావుని అరసం రాష్ట్ర అధ్యక్షులు పల్లేరు వీరస్వామి, ప్రధాన కార్యదర్శి రాపోలు సుదర్శన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కె.వి.ఎల్, హైదరాబాద్ నగర ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ గౌడ్ కలిసి పుష్పగుచ్చాలు అందించి, శాల్వతో సత్కరించారు.

తెలంగాణ ప్రభుత్వం
రోడ్లు & భవనాల శాఖ
'ఇ' ప్రొక్యూర్‌మెంట్ టెండర్ నోటీసు
NIT No. DB/BNG/13/2025-26/1 to 2, తేది: 25.02.2026, యాదాద్రి భువనగిరి జిల్లాలో యాదాద్రి భువనగిరి, డివిజన్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B) ప్రకారం యాదాద్రి భువనగిరి జిల్లాలో యాదాద్రి భువనగిరి, (R&B)డివిజన్‌లో 3 (మూడు) పనుల కొరకు రూ.4.70లక్షలతో ఇ-ప్రొక్యూర్‌మెంట్ ప్లాట్ ఫారం కింద ఆన్‌లైన్ టెండర్లను ఆహ్వానించడమైనది. టెండరుదారులు 26.02.2026న మ.3.30గం.ల నుండి టెండర్ షెడ్యూళ్లను ఇ-మార్కెట్ ప్లేస్ అనగా tender.telangana.gov.in నుండి డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. టెండర్ల స్వీకరణకు ఆఖరి తేది: 01.03.2026న మ.3.30గం.ల వరకు. మరిన్ని వివరాలకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ మార్కెట్ ప్లేస్ అనగా tender.telangana.gov.inలో చూడవచ్చు.
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (R&B), డివిజన్: యాదాద్రి భువనగిరి, యాదాద్రి భువనగిరి జిల్లా.
DIPR R.O. No. : 16097-PP/CL/ADVT/1/2025-26, Date: 26-02-2026

గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్
GHMC
ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, చార్మినార్ జోన్.
Short Tender Notice No. 17/EE.Div.NO.28/GHMC/2025-26 తేది: 24.02.2026
Nit No. Short Tender Notice No. 17/EE.Div.NO.28/GHMC/2025-26, తేది: 24.02.2026, పని వివరణ: నిర్వహణ పనులు (08) నెం.లు, అంచనా మొత్తం: రూ.92.85 లక్షలు, బిడ్స్ స్వీకరణకు ప్రారంభ తేది / ఆఖరి తేది & సమయం: ప్రారంభ తేది: 26.02.2026న మ.03.00గం.లకు, స్వీకరణకు ఆఖరి తేది & సమయం: 05.03.2026న మ.03.00గం.ల వరకు. అధికారి పేరు & చిరునామా: శ్రీ షేక్ సనాఉద్దీన్, సెల్ నెం. 7993727669. జతపరచబడినవి: పనుల వివరముల కాపీ,
సం/- ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, డివిజన్ నెం.28, సిఆర్‌జెడ్, జిహెచ్‌ఎంసి.
DIPR R.O. No. : 16105-PP/CL/ADVT/1/2025-26, Date: 26-02-2026

# అక్కడితో ఆగితే డీల్ మాకు ఓకే

## అమెరికాతో తక్షణ ఒప్పందానికి ఇరాన్ సంసిద్ధత !



**టెహ్రాన్:** అణ్వాయుధాల ఉత్పత్తి చేయకూడనే షరతు వరకూ అయితే అమెరికాతో తక్షణం ఒప్పందం చేసుకోవడానికి తమకు ఎలాంటి అభ్యంతరం ఉండదని ఇరాన్ సర్వాధినేత అలీ ఖమేనీ ప్రధాన సహాయకుడు అలీ షంఖానీ గురువారం రాత్రి ప్రకటించారు. అమెరికా గనుక ఇక ఎక్కువ గొంతెమ్మ కోరికలు కోరకుండా అంతవరకూ సరిపెట్టుకుంటే తక్షణం ఒప్పందం కుదరగలదని ఆయన చెప్పడంతో జెనీవా చర్చల్లో అతిపెద్ద సానుకూలమైన ముందడుగు పడినట్టుగా భావిస్తున్నారు. అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మొదటి నుండీ ప్రధానంగా కోరుకుంటున్న విషయం ఏమిటంటే, ఇరాన్ వద్ద అణ్వాయుధం ఉండకూడదు, అణు కార్యక్రమాన్ని ఇరాన్ అపేయడమే. ఇప్పుడు ఖమేనీ సహాయకుడు కూడా అణ్వాయుధాల ఉత్పత్తిని నిషేధించడం వరకూ అయితే తమకు ఎలాంటి అభ్యంతరం లేదని, అమెరికాతో చర్చల్లో ఒప్పందానికి ఇబ్బంది ఉండదనీ ప్రకటించారు. చర్చల్లో అంశం కేవలం అణ్వాయుధాల ఉత్పత్తి వరకూ పరిమితమైతే తమకు అభ్యంతరం లేదని ఆయన చెప్పడం యుద్ధ నివారణకు వీలైన అతిపెద్ద అంశంగా పరిగణిస్తున్నారు. ఇరాన్–అమెరికా మధ్య జెనీవాలోని ఒమన్ దౌత్య కార్యాలయంలో మూడో రౌండ్ చర్చలు గురువారం ముగిశాయి. అనేక భయాలు, ఉత్కంఠ మధ్య ఈ చర్చలు మొదలయ్యాయి. ఇరాన్ ప్రకటన చాలావరకూ పెద్ద భారం దించేసినట్టుగా అనిపిస్తున్నప్పటికీ ఈ విషయంలో ట్రంప్ ఇక ఎలాంటి మెలికలూ పెట్టకుండా ఒప్పుకుంటారా? అనేదే ప్రధానాంశంగా ఉంది. ఇప్పుడు బంతి ట్రంప్ కోర్టులోకి వెళ్ళింది. ఎక్స్ వేదికగా అలీ షంఖానీ ఒక పోస్టింగ్ పెడుతూ, ''ఒకవేళ జెనీవాలో సంప్రదింపులు గనుక, అణ్వాయుధాలను ఉత్పత్తి చేయకపోవడం వరకూ మాత్రమే పరిమితమైతే మా సర్వోన్నత నాయకుడు ఇచ్చిన ఫత్వాకు అనుగుణంగా మాకూ వీలు కలుగుతుంది, ఇరాన్ రక్షణ సిద్ధాంతానికి ఈ షరతు అనుగుణంగా ఉంటుంది, అప్పుడు తక్షణ ఒప్పందానికి చేరులో ఉంటాం'' అని రాశారు. అణ్వాయుధాలను ఉత్పత్తి చేయడానికి ఇరాన్ వ్యతిరేకమని మొదటినుండీ ఆ దేశం చెబుతూ వస్తోంది. జెనీవాలో ఉన్న ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ అరాఘ్చీకి అటువంటి పరిస్థితుల్లో ఒప్పందాన్ని ముగించడానికి అధికారం ఉంటుంది'' అని పేర్కొన్నారు. ఇక దీనిపై ట్రంప్ స్పందించాల్సి ఉంది.

# నిన్న నిరుద్యోగులు.. నేడు అధికారులయ్యారు!

### నూతన అధికారుల శిక్షణా ముగింపు కార్యక్రమంలో సిఎం రేవంత్‌రెడ్డి



**ప్రజాపక్షం/హైదరాబాద్:** గ్రూప్1, గ్రూప్2 పరీక్షల్లో ఎంపికైన నూతన అధికారుల శిక్షణా కార్యక్రమం ముగింపు సందర్భంగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రేరణాత్మక ప్రసంగం చేశారు. శిక్షణను విజయవంతంగా పూర్తి చేసిన అధికారులను అభినందించిన ఆయన, మీరు మొన్న విద్యార్థులు, నిన్న నిరుద్యోగులు, ఈ రోజు అధికారులు అయ్యారు. ఇకపై 4 కోట్ల తెలంగాణ ప్రజలకు సేవ చేయాల్సిన బాధ్యత మీపై ఉంది అని అన్నారు. తెలంగాణ ప్రజల స్వభావాన్ని వివరిస్తూ సిఎం మాట్లాడుతూ, ఆకలిని కూడా భరించగలిగే ప్రజలు ఆధిపత్యాన్ని మాత్రం ఒప్పుకోరని పేర్కొన్నారు. స్వాతంత్ర్య, స్వాభిమాన పోరాటాల చరిత్రను గుర్తుచేస్తూ రాంజీ గోండు, కొమరం భీం రాజ్యాల కోసం కాకుండా అణచివేతకు వ్యతిరేకంగా పోరాడారని చెప్పారు. అలాగే కాకతీయ సామ్రాజ్యంపై తిరుగుబాటు చేసిన సమ్మక్క సారలమ్మలను వనదేవతలుగా గౌరవించడం వారి త్యాగాలకు నిదర్శనమని పేర్కొన్నారు. సామాజిక న్యాయం, సమానత్వం, స్వేచ్ఛ కోసం వారు అమరవీరులయ్యారని గుర్తుచేశారు. అధికారులుగా బాధ్యతలు స్వీకరిస్తున్న మీరు ప్రజల ఆకాంక్షలు, అమరవీరుల స్ఫూర్తిని ఎప్పుడూ గుర్తు పెట్టుకోవాలని సిఎం సూచించారు. తొలి సాధారణ ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో గెలిచిన తెలంగాణ నాయకుడు రావి నారాయణ రెడ్డి అని చెప్పారు. గ్రూప్ పరీక్షలపై మాట్లాడుతూ, సుమారు 6 లక్షల మంది పోటీపడగా 582 మంది గ్రూప్1, 775 మంది గ్రూప్2 ఉద్యోగాలు సాధించారని తెలిపారు. గత 15 ఏళ్లుగా గ్రూప్1 నియామకాలు జరగలేదని, ప్రజా ప్రభుత్వం వాటిని నిర్వహించి యువత ఆకాంక్షలను నెరవేర్చిందన్నారు. టీజీపీఎస్సీని ప్రక్షాళన చేసి, పరీక్షలపై అవగాహన ఉన్న వారినే చైర్మన్, సభ్యులుగా నియమించామని చెప్పారు. ప్రశ్నాపత్రాల లీకేజీలకు అవకాశం లేకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకున్నామని గ్రూప్1 ఫలితాలపై కోర్టుల్లో పోరాటం జరిగిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అభ్యర్థులు మెరిట్ ఆధారంగానే ఎంపికయ్యారని ప్రభుత్వం నమ్మి సుప్రీంకోర్టు వరకు పోరాడిందన్నారు. అధికారులైన తర్వాత బాధ్యత మరిచి వ్యక్తిత్వ పతనం చెందకూడదని హెచ్చరించారు. సంక్షేమ కార్యక్రమాలు ప్రజలకు చేరేలా చూడాల్సిన బాధ్యత మీపైనే ఉందని, ప్రభుత్వానికి కళ్లు, చెవులు మీరే అని అన్నారు. సేవాభావంతో పనిచేయాలని సూచిస్తూ, ప్రతి రోజు కార్యాలయానికి వెళ్లే ముం దు దివంగత ఐఏఎస్ అధికారి ఎస్ ఆర్ శంకరన్ను స్మరించుకోవాలని, పేదలకు సాయం చేసే ముం దు తల్లిదండ్రులను గుర్తు పెట్టుకోవాలని సూచించారు. తల్లిదండ్రులను గౌరవించని ఉద్యోగుల జీతాల్లో 10–15 శాతం కోత విధించేలా చట్టం తీసుకురావాలని ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు వెల్లడించారు.



శిక్షణా ప్రమాణాలను అంతర్జాతీయ స్థాయికి తీసుకెళ్లే దిశగా త్వరలో హార్వర్డ్ యూనివర్సిటీ ఎంసి హెచ్‌ఆర్‌డి మధ్య ఒప్పందం కుదరనుందని తెలిపారు. హార్వర్డ్ నుంచి నిపుణులు వచ్చి ఎంసి హెచ్‌ఆర్‌డిలో అధికారులకు శిక్షణ ఇ వ్వనున్నారని సిఎం వెల్లడించారు. ప్రజా సేవే పరమావధిగా పని చేస్తేనే నిజమైన అధికారి అవుతార ని, తెలంగాణ అభివృద్ధి మీ చేతుల్లోనే ఉందని సిఎం నూతన అధికారులకు పిలుపునిచ్చారు.వెల్లడించారు.శిక్షణలో అత్యుత్తమ ప్రతిభ చూపించిన నూతన అధికారులకు మెడల్స్ ప్రదానం చేశారు. నూతన ఆఫీసర్ల శిక్షణకు సంబంధించిన ఫోటో ప్రదర్శనను సిఎం తిలకించారు.

# మూసీ ప్రక్షాళనను ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయ్

### కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్‌మోహన్ రెడ్డి




**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాజకీయాల కోసం ప్రతిపక్షాలు మూసీ ప్రక్షాళనను అడ్డుకుంటున్నాయనీ, హైదరాబాద్ ప్రజలను ముంచాలని బిజెపి, బిఆర్‌ఎస్ కుట్ర చేస్తున్నాయని కాంగ్రెస్ మీడియా కమిటీ చైర్మన్ సామ రామ్‌మోహన్ రెడ్డి విమర్శించారు. హైదరాబాద్‌ను వరదల నుండి కాపాడడం తమ ప్రభుత్వ లక్ష్యమని, బతుకిచ్చిన మూసీ నదిని బతికిద్దామన్నారు. గాంధీభవన్‌లో గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ గాంధీ ప్రాజెక్టుకి, మధు పార్క్ అపార్ట్‌మెంట్‌కి సంబంధమే లేదనీ, విపక్షాలు అనవసర రాద్ధాంతం చేస్తున్నాయన్నారు. మధు పార్క్ అపార్ట్‌మెంట్ బఫర్ జోన్‌లో ఉందని, అలా అని అపార్ట్‌మెంట్ వాసులపై తాము అధికారం చెలాయించట్లేదని తెలిపారు. పైసా పైసా కూడబెట్టుకొని అపార్ట్‌మెంట్ కొనుకున్న ప్రజల బాధను అర్థం చేసుకుంటున్నాం, కాబట్టే మధు పార్క్ అపార్ట్‌మెంట్ వాళ్ళకి నష్ట పరిహారం చెల్లిస్తామని చెప్పారు. గవర్నమెంట్ వాల్యూ ప్రకారం అక్కడ స్క్వేర్ ఫీట్‌కు రూ. 3 వేల ధర ఉంది కానీ, ప్రభుత్వం రూ.5 వేలు ఇస్తామని చెప్పిందన్నారు. కష్టపడి కొనుకున్న వాళ్ళకి నష్టం జరగవద్దని నష్టపరిహారం ఇస్తున్నామని తెలిపారు. అపార్ట్‌మెంట్ వాళ్ళు మూసీ ప్రక్షాళనకు సానుకూలంగా ఉన్నారని, నాడు బిఆర్‌ఎస్ నాయకులు మల్లన్న సాగర్ బాధితులను తరమడానికి ఊర్లోకి నీళ్లను వదిలారని గుర్తు చేశారు. మధు పార్క్‌కు వెళ్లిన హరీష్ రావు మల్లన్న సాగర్ ఎందుకు వెళ్ళలేదు? మూసీని మించి ప్రతిపక్ష నాయకులే అబద్ధాలతో ఈ రాష్ట్రాన్ని కలుషితం చేస్తున్నారని మండిపడ్డారు. పన్నెండు ఏళ్లలో మూసీ ప్రక్షాళనకు ముప్పై రూపాయలు కూడా కిషన్ రెడ్డి తీసుకురాలేదని ఆరోపించారు. బిఆర్‌ఎస్ నాయకులు కనిపించిన చెరువులన్నీ కబ్జా చేశారు, సబర్మతి, యమునా, గంగా ప్రక్షాళన చేయాలంటున్న బిజెపి మూసీ ప్రక్షాళన అంటే ఎందుకు అడ్డు పడుతోందని, బిఆర్‌ఎస్, బిజెపి నేతల అబద్ధాల ప్రచారాలను తెలంగాణ ప్రజలు క్షమించరని సామ రామ్‌మోహన్‌రెడ్డి పేర్కొన్నారు.

# పిఎం రహత్ పథకానికి తెలంగాణ సానుకూలం

### రోడ్డు ప్రమాద మరణాలను తగ్గించడమే లక్ష్యం: మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రోడ్డు ప్రమాదాల బాధితులకు తక్షణ వైద్యం అందించి, ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన పిఎం రహత్ పథకంలో చేరేందుకు తెలంగాణ ప్రభుత్వం సానుకూలంగా ఉన్నట్లు రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ గురువారం అన్ని రాష్ట్రాల రవాణా మంత్రులు, అధికారులు, డిజిపిలతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆయన ఈ విషయాన్ని వెల్లడించారు. ప్రమాదం జరిగిన తర్వాత గోల్డెన్ అవర్ లోపు బాధితుడిని ఆసుపత్రికి చేర్చితే సుమారు 50 శాతం మరణాలు తగ్గించవచ్చని లా కమిషన్ ఆఫ్ ఇండియా అధ్యయనం సూచించిందని సమావేశంలో వెల్లడించారు. ఈ పథకం ద్వారా ప్రతి బాధితుడికి రూ.1.5 లక్షల వరకు చికిత్స ఖర్చును ప్రభుత్వం భరిస్తుందని, ప్రమాదం జరిగిన తేదీ నుంచి గరిష్టంగా ఏడు రోజుల వరకు ఈ సాయం అందుతుందని తెలిపారు. రాష్ట్రంలో రోడ్డు భద్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకుంటున్నామని మంత్రి పే ర్కొన్నారు. అలాగే ఈవి వాహనాలకు పన్ను మినహాయింపులు, స్క్రాప్ పాలసీ అమలు, ఆటోమేటిక్ టెస్టింగ్ కేంద్రాలు, డ్రైవింగ్ టెస్ట్ స్టేషన్లు వంటి పలు సంస్కరణలు చేపట్టినట్లు వివరించారు. కేం ద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొచ్చిన ఈ ప థకంలో భాగస్వామ్యం కావడానికి తెలంగాణ సిద్ధంగా ఉందని మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. వీడియో కాన్ఫరెన్స్‌లో తెలంగాణ తరపున ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వికాస్ రాజ్, జెటిసిలు చంద్రశేఖర్ గౌడ్, శివలింగయ్య తదితర అధికారులు పాల్గొన్నారు.



## శ్రీచైతన్య సిబిఎస్‌ఇ నూతన పాఠశాలలో ఇఎస్‌ఐసి ఆరోగ్య క్యాంపు

**ప్రజాపక్షం/హైదరాబాద్:** కార్మిక రాజ్య బీమా సంస్థ స్వర్ణోత్సవాలలో భాగంగా కూకట్ పల్లి సిబిఎస్‌ఇ శ్రీ చైతన్య విద్యాసంస్థలో ఇఎస్‌ఐ చందా చెల్లింపు చేయు కార్మికులకు, వారి పైన ఆధారపడిన కుటుంబ సభ్యుల కొరకు సంస్థ అభ్యర్థన మేరకు కార్మిక రాజ్య బీమా సంస్థ (ఇఎస్‌ఐసి) మెడికల్ కాలేజ్ డీన్ డాక్టర్ సురేష్ కుమార్ చవాన్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఎం.రాధిక సనత్ నగర్ వార్ల సహకారంతో ఉచిత ఆరోగ్య క్యాంపుతో పాటు అవగాహన సదస్సును ఏర్పాటు చేయడం జరిగింది. ఈ క్యాంపు నందు శ్రీ చైతన్య విద్యాసంస్థలలో పనిచేయు నెలసరి ఇఎస్‌ఐ చందా చెల్లింపు చేయు కార్మికులతో పాటు వారి పైన ఆధారపడిన కుటుంబ సభ్యులకు ఇఎస్‌ఐసి మెడికల్ కాలేజ్, సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్ వైద్యులు, ఇతర సిబ్బంది హాజరై వారికి మధుమేహం, రక్తపోటు, హిమోగ్లోబిన్, కంటి పరీక్షలతో పాటు వివిధ రకాల ఆరోగ్య పరీక్షలు నిర్వహించి, తగు మందులను కూడా అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఇఎస్‌ఐసి మెడికల్ కాలేజ్ డీన్ సురేష్ కుమార్ చవాన్, హాస్పిటల్ సూపరింటెండెంట్ రాధికకు కార్మికుల తరపున శ్రీ చైతన్య విద్యాసంస్థల డైరెక్టర్ సీమా, డైరెక్టర్ నాగేంద్ర కుమార్, శ్రీ చైతన్య కూకట్ పల్లి సిబిఎస్‌ఇ ఎజిఎం శివరామకృష్ణ, రీజనల్ ఇన్చార్జ్ వెనిగళ్ళ పద్మజ, అడ్మిన్ శ్రీనివాస రెడ్డి కృతజ్ఞతలు తెలియజేశారు.

## కుమ్మెర ఘటనపై మార్చి 2న బిసిల మహాధర్నా

### తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ

**ప్రజాపక్షం /హైదరాబాద్ :** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెరలో ఇటీవల చోటుచేసుకున్న ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎర్ర సత్యనారాయణ పేర్కొన్నారు. బిసి వర్గాలపై పెరుగుతున్న దాడులను అరికట్టేందుకు ప్రత్యేకంగా బిసి అట్రాసిటీ చట్టం తేవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం తెలంగాణ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో లక్డీకాపూల్‌లోని ఓ ప్రైవేట్‌లో హోటల్ నిర్వహించిన సమావేశానికి ఎర్ర సత్యనారాయణ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న హాజరయ్యారు. ఎర్ర సత్యనారాయణ మాట్లాడుతూ బిసిలకు చట్టపరమైన రక్షణ కల్పించేందుకు ప్రత్యేక చట్టం అవసరమని, ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ ఘటనపై మార్చి 2న ఇందిరాపార్క్ వద్ద బిసిల మహాధర్నా చేపట్టనున్నామన్నారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ కుమ్మెర ఘటన బాధితులకు తక్షణ న్యాయం చేయాలని, దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కుమ్మెరలో చిన్నారికి హత్యకు పాల్పడిన వ్యక్తుల పై చర్యలు తీసుకోవాలని, లేని పక్షంలో బిసిలే ఎన్‌కౌంటర్ చేస్తారని తీన్మార్ మల్లన్న హెచ్చరించారు. సమావేశంలో బిసి జాక్ కన్వీనర్ గుజ్జ కృష్ణ , వట్టె జానయ్య, నారగోని , బిసి పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలరాజ్ గౌడ్, నంద గోపాల్, విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.



# రాష్ట్రంలో ఆపరేషన్ క్రాక్ డౌన్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** రాష్ట్రంలో వేళ్లూనుకున్న సైబర్ నేరాల వ్యవస్థను కూకటివేళ్లతో సహా పెకిలించేందుకు తెలంగాణ పోలీసు శాఖ భారీ ఆపరేషన్‌కు శ్రీకారం చుట్టిందని డిజిపి బి.శివధర్ రెడ్డి వెల్లడించారు. 'ఆపరేషన్ క్రాక్‌డౌన్' పేరుతో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) రూపొందించిన ఈ ప్రత్యేక కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చిందని డిజిపి తెలిపారు. ప్రధానంగా సైబర్ నేరగాళ్లకు వెన్నుముకగా మారుతున్న 'మ్యూల్' (బినామీ) బ్యాంకు ఖాతాల నెట్‌వర్క్‌ను ఛేదించడమే లక్ష్యంగా 16 జిల్లాల్లోని పోలీస్ యూనిట్లు ఏకకాలంలో రంగంలోకి దిగాయి. రానున్న కొన్ని నెలల పాటు నిరంతరాయంగా సాగనున్న ఈ ఆపరేషన్‌లో భాగంగా తొలిరోజే రాష్ట్రంలోని 137 బ్యాంకు శాఖల్లో 512 మంది అధికారులు, సిబ్బందితో కూడిన 137 ప్రత్యేక బృందాలు విస్తృత తనిఖీలు చేపట్టాయి. ముఖ్యంగా సైబర్ నేరగాళ్లు అమాయకుల పేరిట తెరిచిన ఖాతాల ద్వారా భారీ ఎత్తున నిధులు మళ్లిస్తున్నట్లు గుర్తించిన పోలీసులు, ఆయా ఖాతాదారుల కేవైసీ వివరాలను క్షుణ్ణంగా పరిశీలిస్తున్నారని ఆయన వివరించారు. టిజిసిఎస్‌బి సేకరించిన గణాంకాల ప్రకారం.. 2025 సంవత్సరంలో ఇప్పటివరకు రాష్ట్రంలో సుమారు 4,775 మ్యూల్ ఖాతాలు చురుగ్గా నిర్వహిస్తున్నట్లు ఆధారాలు లభించాయి. వీటిలో 1,888 అనుమానాస్పద ఖాతాలను ప్రాథమికంగా గుర్తించి తనిఖీ చేయగా, ఈ ఖాతాలు దేశవ్యాప్తంగా నమోదైన 9,431 సైబర్ నేరాలతో ప్రత్యక్ష సంబంధం కలిగి ఉండటం గమనార్హం. ఇందులో 782 కేసులు నేరుగా తెలంగాణ రాష్ట్రానికే సంబంధించినవి కావడం పరిస్థితి తీవ్రతను చాటుతోందని డిజిపి పేర్కొన్నారు. విచారణలో భాగంగా కొన్ని బ్యాంకు శాఖల్లో వందల సంఖ్యలో ఇటువంటి బినామీ ఖాతాలు ఉన్నట్లు వెలుగు చూడటం విస్మయానికి గురి చేస్తుందన్నారు. దీని వెనుక బ్యాంకు సిబ్బంది పాత్ర లేదా ఏజెంట్ల ద్వారా నడుస్తున్న ఒక వ్యవస్థీకృత నెట్‌వర్క్ ఉందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు. హైదరాబాద్ సుల్తాన్ బజార్‌లోని ఒకే ఒక ఖాతా దేశవ్యాప్తంగా 496 నేర కేసులకు అనుసంధానమై ఉండగా, సూర్యాపేట జిల్లాలోని కేవలం నాలుగు బ్యాంకు శాఖల్లోనే 298 ఖాతాలు సైబర్ నేరాలతో ముడిపడి ఉన్నట్లు అధికారులు నిర్ధారించారన్నారు. మరోవైపు, ఆర్‌టిజిఎస్ సదుపాయం లేని కొన్ని చిన్న బ్యాంకులు జాతీయ బ్యాంకుల వ్యవస్థను వాడుకుంటూ నిధుల బదిలీ చేస్తున్నాయని, ఖాతాల ప్రారంభంలో సరైన ధృవీకరణ ప్రక్రియలు పాటించకపోవడాన్ని నేరగాళ్లు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నారని విచారణలో తేలిందని పేర్కొన్నారు. ఈ వినూత్న కార్యక్రమాన్ని రూపొందించిన టిజిసిఎస్‌బి డైరెక్టర్ శిఖా గోయల్‌ను, ఆయా బృందాలను డిజిపి బి.శివధర్ రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఆర్థిక లావాదేవీల విశ్లేషణ, ఖాతాదారుల ప్రొఫైలింగ్ ద్వారా సైబర్ నేరగాళ్ల నెట్‌వర్క్‌ను పూర్తిగా నిర్మూలించాల్సి ఉందని డిజిపి బి.శివధర్ రెడ్డి అభిప్రాయపడ్డారు.




## కస్టమర్ల విశ్వాసంతోనే శ్రీకుశా వెంచర్స్‌కు గుర్తింపు

### సంస్థ వ్యవస్థాపకులు, సిఇఒ ప్రసన్నకుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** తమ కస్టమర్ల విశ్వాసం, టీం కృషి వల్లే తెలంగాణలోని బెస్ట్ ప్రీమియం ప్లాట్ డెవలప్‌మెంట్ కంపెనీ క్యాటగిరీలో శ్రీ కుశా వెంచర్స్ సంస్థకు గుర్తింపు లభించినట్టు సంస్థ వ్యవస్థాపకులు, సిఇఒ ప్రసన్నకుమార్ బల్లిపాగు తెలిపారు. ఇటీవల బెంగళూరులోని రమద బై విందమ్, యెలహంకలో ఘనంగా జరిగిన ''ఇవాల్వింగ్ సౌత్ ఇండియా బిజినెస్ ఎక్సలెన్స్ అవార్డ్స్ – 2026'' కార్యక్రమంలో శ్రీ కుశా వెంచర్స్ నామినేట్ అయినట్టు ఆయన పేర్కొన్నారు. ప్రసన్నకుమార్ మాట్లాడుతూ నాణ్యత, విశ్వసనీయత మా సంస్థ ప్రధాన లక్ష్యాలన్నారు. భవిష్యత్తులో కూడా మెరుగైన సేవలు అందించడానికి కట్టుబడి ఉంటామన్నారు. తెలంగాణలో నాణ్యమైన లేఅవుట్లు, న్యాయపరమైన స్పష్టత, భవిష్యత్తు విలువ కలిగిన ప్రాజెక్టులతో సంస్థ విశ్వాసాన్ని సంపాదించిందని వివరించారు. ఈ నామినేషన్ సంస్థకు గౌరవప్రదమైన మైలురాయిగా నిలిచిందని పేర్కొన్నారు.

## 40వేల టీచర్ పోస్టులకు నోటిఫికేషన్ ఇవ్వాలి : ఆర్.కృష్ణయ్య



**ప్రజాపక్షం / హైదరాబాద్ :** ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న 40 వేల ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కి వెంటనే నోటిఫికేషన్ విడుదల చేయాలని జాతీయ బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపి ఆర్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం జాతీయ బిసి సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిరుద్యోగులతో కలిసి ఏజీ ఆఫీస్ నుండి లక్డీకాపూల్ లోని విద్యా శాఖ కమీషరేట్ వరకు భారీ నిరసన ప్రదర్శన నిర్వహించారు. నిరుద్యోగుల జేఏసీ చైర్మన్ నీలం వెంకటేష్, బిసి ఐక్య వేదిక అధ్యక్షుడు అనంతయ్య అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఆర్. కృష్ణయ్య ముఖ్యఅతిథిగా హాజరై, మాట్లాడారు. 12 వేల ప్రభుత్వ పాఠశాలలో మ్యాథ్స్, ఇంగ్లిష్, సైన్స్ సబ్జెక్టుల బోధించేందుకు టీచర్లు లేకపోవడంతో విద్యార్థుల చదువు కుంటుపడుతుందని అవేదన వ్యక్తం చేశారు. ఇటీవల 6 వేల మంది ఉపాధ్యాయులు ఉద్యోగ విరమణ పొందారని తెలిపారు. 4500 పై ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించారని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలు , గురుకులాల్లో, ఆదర్శ, కస్తూర్బా పాఠశాలల్లో కలిపి సుమారు 40 వేల ఉపాధ్యాయ పోస్టులు ఖాళీగా ఉన్నాయని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్ దృష్టిలో పెట్టుకుని సీఎం రేవంత్ రెడ్డి డిఎస్‌సి నోటిఫికేషన్ విడుదల చేయాలని కోరారు. ఈ నిరసన లో ప్రదర్శనలో బిసి సంఘాల నేతలు, నిరుద్యోగులు పాల్గొన్నారు.

## ఇజ్రాయెల్ పార్లమెంట్ ప్రసంగంలో మోదీ భారతదేశ నైతికస్థితిని దిగజార్చారు

### కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరామ్ రమేశ్

**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో చేసిన ప్రసంగం తీరుపై కాంగ్రెస్ ధ్వజమెత్తింది. ఇజ్రాయెల్ పార్లమెంట్‌ను ఉద్దేశించి మోదీ చేసిన ప్రసంగం తన ఆతిథ్యదేశ ప్రధానమంత్రి బెంజమిన్ నెతన్యాహూను 'నిస్సిగ్గుగా సమర్థించేలా', 'భారతదేశ నైతిక స్థితిని దిగజార్చేలా' ఉందని కాంగ్రెస్ గురువారం విమర్శనాస్త్రాలు సంధించింది. మోదీపై విమర్శలు గుప్పిస్తూ, ఇజ్రాయెల్ సృష్టి అంశంపై ఆల్బర్ట్ ఐనస్టీన్ రాసిన లేఖకు భారతదేశ తొలిప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ జూలై 1947లో ఇచ్చిన సమాధానాన్ని ప్రతిపక్ష కాంగ్రెస్ ఈ సందర్భంగా గుర్తుచేసింది. కాంగ్రెస్ ప్రధానకార్యదర్శి ఇన్‌చార్జి కమ్యునికేషన్స్ జైరామ్ రమేశ్ తన 'ఎక్స్' పోస్ట్‌లో ఇజ్రాయెల్ పార్లమెంట్ నెస్సెట్‌లో మోదీ భారతదేశ నైతిక స్థితిని దిగజార్చేలా ప్రసంగించడాన్ని ఖండించారు. ఈ సందర్భంగా ఆయన జవహర్‌లాల్ నెహ్రూ మాటలను గుర్తుచేస్తూ చాలా సుదీర్ఘంగా చర్చించారు. బుధవారం భారత ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇజ్రాయెల్ పార్లమెంట్ నెస్సెట్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తూ గాజా శాంతి చొరవను ఈ ప్రాంతంలో 'న్యాయపరమైన, శాశ్వత శాంతి వైపు' ఒక మార్గంగా అభివర్ణించారు.'ఉగ్రవాదం ఎక్కడైనా ప్రతీ చోటా శాంతిని బెదిరిస్తుంది' అని నొక్కిచెబుతూ ఇజ్రాయెల్‌తో సంఘీభావ సందేశాన్ని కూడా ఆయన అందించారని మోదీ ద్వంద్వ వైఖరిపై ధ్వజమెత్తారు.'2023 అక్టోబర్ 7న హమాస్ చేసిన అనాగరిక ఉగ్రదాడిలో ప్రాణాలు కోల్పోయిన ప్రతీ ప్రాణానికి, ప్రపంచాన్ని ఛిన్నాభిన్నం చేసిన ప్రతీ కుటుంబానికి భారత ప్రజల ప్రగాఢ సానుభూతిని కూడా నాతోపాటు తీసుకువెళుతున్నాను. ఈ క్షణంలో, అంతకుమించి భారతదేశం ఇజ్రాయెల్‌తో దృఢంగా పూర్తి నమ్మకంతో పోటీపడుతోంది. పౌరుల హత్యను నా లక్ష్యం సమర్థించగలదు. ఉగ్రవాదాన్ని ఏదీ సమర్థించదు' అని మోదీ చెప్పారు. జైరామ్ రమేశ్ మరొక పోస్ట్‌లో ఇజ్రాయెల్ న్యాయవాది, మానవ హక్కుల కార్యకర్త ఐతే మాక్ ప్రధానమంత్రి ఇజ్రాయెల్ పార్లమెంట్‌లో చేసిన ప్రసంగంపై చేసిన విమర్శలను ఉదహరించారు.

## విద్యార్థుల బలిదానాలతో వచ్చిన తెలంగాణలో.. చదువుల కోసం నిధులు లేవనడం సిగ్గుచేటు

### బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** విద్యార్థుల బలిదానాలతో వచ్చిన తెలంగాణలో వారి చదువుల కోసం నిధులు లేవనడం సిగ్గుచేటు అని బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ఫీజు రియంబర్స్‌మెంట్ రాక, 22 లక్షల మంది పేద విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతుంటే, ప్రభుత్వం మాత్రం రూ. ఐదు వేల కోట్లతో గాంధీ విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని ప్రయత్నించడం దారుణమన్నారు. బిసి జెఎసి చైర్మన్ జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలోని బిసి ప్రతినిధుల బృందం గురువారం హైదరాబాద్‌లోని సచివాలయంలో రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి(సిఎస్) కె. రామకృష్ణారావును కలిసి గత ఐదు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న ఫీజుల రియంబర్స్‌మెంట్ బకాయిలను విడుదల చేయాలని వినతి పత్రం అందజేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఫీజు రియింబర్స్‌మెంట్ బకాయిల విడుదలతో పాటు ప్రతి బిసి, ఎస్‌సి, ఎస్‌టి, మైనార్టీ విద్యార్థులకు పూర్తి ఫీజులను చెల్లిస్తామని హామీ ఇచ్చారని, కానీ నేటి వరకు అమలు చేయకపోవడం దురదృష్టకరమన్నారు.

ఇటు ప్రభుత్వం నిధులు విడుదల చేయక, అటు కళాశాల యజమాన్యాలు ఫీజులు కట్టాలని ఒత్తిడి చేయడంతో తీవ్ర మానసిక క్షోభ కు గురై రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 22 మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారని, ఫీజు రి యింబర్స్‌మెంట్ అనేది ప్రైవేట్ కళాశాల యజమాన్యాలకు, ప్రభుత్వాలకు మధ్యన పంచాయ తీ కాదని, ఇది 22 లక్షల మంది పేద విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన విషయమ ని ఆయన వెల్లడించారు. ప్రభుత్వం ఫీజుల రియంబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించేంత వరకు ఉద్యమాన్ని ఆపేది లేదని, త్వరలోనే రాష్ట్ర గవర్నర్, మంత్రులను, డిప్యూటీ సిఎం, సిఎంలను కలిసి విన్నవిస్తామని, సానుకూలమైన నిర్ణయం రాకుంటే మార్చి 16వ తేదీ నుండి జరిగే అసెంబ్లీ సమావేశాల సందర్భంగా వేలాదిమంది విద్యార్థులతో అసెంబ్లీని ముట్టడిస్తామని జాజుల శ్రీనివాస్ గౌడ్ హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బిసి జెఎసి వర్కింగ్ చైర్మన్ గుజ్జ కృష్ణ, బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ఐదు వేల మంది కస్టమర్ల డేటా చోరీ

## 'యెస్' బ్యాంకులో మోసపూరిత లావాదేవీలు



**న్యూఢిల్లీ:** ప్రైవేటు రంగానికి చెందిన ఐడిఎఫ్ సి ఫస్ట్ బ్యాంక్ ఉదంతం మరవకముందే మరో ప్రైవేటు బ్యాంకులో అనధికార లావాదేవీల ఘటన వెలుగుచూసింది. బుక్‌మైఫారెక్స్‌తో కలిసి యెస్ బ్యాంక్ జారీ చేసిన ఫారెక్స్ కార్డుల్లో మోసపూరిత లావాదేవీలు జరిగినట్లు బ్యాంక్ గుర్తించింది. ఆయా కస్టమర్ల సీవీవీ తస్కరించి అనధికారికంగా ఈ లావాదేవీలు జరిపినట్లు బ్యాంక్ ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ ఘటనపై ఆర్‌బీఐ వివరణ కోరినట్లు ఆంగ్ల మీడియా కథనాలు పేర్కొన్నాయి. యెస్ బ్యాంక్ జారీ చేసిన మల్టీ కరెన్సీ ప్రీపెయిడ్ ఫారెక్స్ కార్డులు ఉపయోగించి సుమారు 2,80,000 డాలర్ల (భారతీయ కరెన్సీలో రూ.2.35 కోట్లు) విలువైన లావాదేవీలు జరిగినట్లు బ్యాంక్ గుర్తించింది. 5 వేల మంది కస్టమర్లకు చెందిన కార్డుల వివరాలతో లావాదేవీలు జరిగినట్లు ఎక్స్ఛేంజీలకు సమాచారం ఇచ్చింది. లాటిన్ అమెరికా దేశం నుంచి ఫిబ్రవరి 24వ తేదీ ఉదయం 3.30 8.30 గంటల మధ్య 15 మర్చంట్ ఖాతాల నుంచి ఈ లావాదేవీలు జరిగాయి. ఆ దేశంలో ఇకామర్స్ లావాదేవీలకు 2 ఫ్యాక్టర్ అథెంటికేషన్ లేకపోవడం ఈ మోసానికి మూల కారణమని తెలుస్తోంది. మోసం ఘటన వెలుగుచూసిన వెంటనే లాటిన్ అమెరికా దేశం నుంచి ఇకామర్స్ లావాదేవీలు జరగకుండా యెస్ బ్యాంక్ నిలిపివేసింది. తర్వాత కూడా అనధికార లావాదేవీల కోసం 688 ప్రయత్నాలు జరిగినట్లు బ్యాంక్ వెల్లడించింది. మోసానికి గురైన కస్టమర్లు ఎలాంటి ఆర్థిక నష్టం ఉండబోదని యెస్ బ్యాంక్ స్పష్టంచేసింది. బ్లాక్ చేసిన కార్డుల స్థానంలో కొత్త ఫారెక్స్ కార్డులు జారీ చేయనున్నట్లు తెలిపింది. మరోవైపు ఈ కార్డుల జారీలో భాగస్వామి అయిన బుక్‌మైఫారెక్స్ మాత్రం తమ వైపు నుంచి ఎలాంటి సమాచార చోరీ జరగలేదని వివరణ ఇచ్చింది. తమవద్ద సీవీవీ వంటి సున్నితమైన డేటా లేదని పేర్కొంది. సీవీవీ డేటా బ్రీచ్‌పై వివరణ ఇవ్వాల్సిందిగా యెస్ బ్యాంక్ ఎగ్జిక్యూటివ్‌లకు ఆర్‌బీఐ సమన్లు జారీ చేసినట్లు ఆంగ్లమీడియా కథనాలు వెల్లడించాయి.

# ట్రంప్ బెదిరింపులతో అమెరికాతో మోదీ ఒప్పందం

## ప్రధాని మోదీపై కాంగ్రెస్‌నేత రాహుల్ విమర్శ



**వయనాడ్:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బెదిరింపులతోనే ఆ దేశంతో ప్రధాని నరేంద్రమోదీ వాణిజ్య ఒప్పందం చేసుకున్నారని కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ విమర్శించారు. కేరళలోని కన్నూర్‌లో గురువారం జరిగిన ఒక కార్యక్రమంలో రాహుల్ గాంధీ ప్రసంగించారు. 'అమెరికా రైతులు భారత దేశంలో సోయాబీన్, మొక్కజొన్న, పండ్లు అమ్మడానికి ఏ భారతీయ ప్రధానమంత్రి అనుమతించరు. భారతదేశ పునాదిని బిజెపి నాశనం చేయబోతోంది. 4 నెలలుగా భారతదేశంఅమెరికా వాణిజ్య ఒప్పందం నిలిచిపోయింది. మోదీ ప్రభుత్వం... అమెరికా కంపెనీలకు మన వ్యవసాయాన్ని తెరవడానికి ఇష్టపడలేదు. కానీ ప్రధానమంత్రి మోదీని ట్రంప్ బెదిరించారు. దీంతో మోదీ లొంగిపోయారు. పార్లమెంటులో రాష్ట్రపతి ప్రసంగంపై ప్రభుత్వం నన్ను మాట్లాడనివ్వలేదు. అమిత్ షా లేచారు. మోదీ నన్ను మాట్లాడనివ్వలేదు. స్పీకర్ కూడా అదే చేశారు. భారత చరిత్రలో మొదటిసారిగా ప్రతిపక్ష నేతను రాష్ట్రపతి ప్రసంగంపై మాట్లాడనివ్వలేదు. వారు నన్ను ఎందుకు ఆపారు? ఎందుకంటే ప్రధాని మోదీ చిక్కుకున్న రెండు సమస్యల గురించి నేను మాట్లాడబోతున్నాను. ఎప్‌స్టీన్ ఫైల్స్, అమెరికాలో అదానీ కేసు గురించి' అని రాహుల్ అన్నారు. 'అదానీ సాధారణ కంపెనీ కాదు. అదానీ బిజెపికి, ప్రధానమంత్రికి ఆర్థిక మౌలిక సదుపాయాలు. మోదీకి ముప్పు చాలా స్పష్టంగా ఉంది' అని రాహుల్ అన్నారు.

**ఇది ఉత్తర కొరియా కాదు**

యూత్ కాంగ్రెస్ నాయకులపై పోలీస్‌ల చర్య పట్ల రాహుల్ గాంధీ తీవ్రంగా స్పందించారు. ఇది ఉత్తర కొరియా కాదు... భారత్ అని గురువారం ఆయన ఎక్స్ మాధ్యమం ద్వారా హెచ్చరించారు. మోదీ ప్రభుత్వం తీరు ఉత్తర కొరియా నిరంకుశ పాలనను తలపిస్తోందని ధ్వజమెత్తారు. శాంతియుతంగా నిరసన తెలపడం ప్రజాస్వామ్యంలో నేరం కాదన్నారు. ప్రపంచంలోని అతి పెద్ద ప్రజాస్వామ్య దేశంలో అసమ్మతిని రాజద్రోహంగా, ప్రశ్నించడాన్ని కుట్రగా పరిగణిస్తున్నారని మోదీ ప్రభుత్వ నియంతృత్వ విధానాలపై మండిపడ్డారు. అధికారంలో ఉన్న వారు ప్రజలను, అసమ్మతి వర్గాన్ని శత్రువులుగా భావించడమే ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమని రాహుల్ వ్యాఖ్యానించారు. దేశ రాజధాని వదిన ప్రధాని పాలనలో ఉండిన, శాంతియుతంగా నిరసనలు తెలపడాన్ని పెద్ద నేరంగా చూస్తున్నారని విమర్శించారు. అధికారంలో ఉన్న వారిపై గొంతెత్తితే లాఠీలు, జైళ్లు తప్పడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 'పేపర్ లీకేజీ అయిందని ఢిల్లీ వేదికగా గొంతెత్తిన యువకులపైనా లాఠీ చార్జీ చేస్తున్నారు. ఇటీవల పలు సందర్భాల్లో జరిగిన సంఘటనలను రాహుల్ గాంధీ ఉటంకిస్తూ మోదీ నిరంకుశ పాలనపై దుమ్మెత్తి పోశారు. యువజన కాంగ్రెస్ నాయకులు అమెరికాతో జరిగిన వాణిజ్య ఒప్పందంపై నిరసనలు తెలపడాన్ని, రైతులు వారి హక్కుల కోసం చేస్తున్న పోరాటాన్ని దేశద్రోహం అని జాతి వ్యతిరేకమని ముద్ర వేశారని నిలదీశారు.

# నేడు ప్రచండ్‌లో రాష్ట్రపతి ప్రయాణం

**న్యూఢిల్లీ:** రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శుక్రవారం రాజస్థాన్‌లో పర్యటించనున్నారు. దీనిలో భాగంగా ఆమె జైసల్మేర్ ఎయిర్‌ఫోర్స్ స్టేషన్‌ను సందర్శించనున్నారు. స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తేలికపాటి యుద్ధ హెలికాప్టర్ 'ప్రచండ్' లో గగన విహారం చేయనున్నారు. అనంతరం భారత్ పాకిస్థాన్ సరిహద్దు సమీపంలోని పోఖ్రాన్‌లో వైమానిక దళం అధ్వర్యంలో 'వాయు శక్తి' పేరిట నిర్వహించనున్న విన్యాసాలను వీక్షించనున్నారు. ఎల్‌సీహెచ్ 'ప్రచండ్' అనేది స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన తొలి యుద్ధ హెలికాప్టర్. హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ ఈ యుద్ధ హెలికాప్టర్‌ను తయారుచేసింది. 2022, అక్టోబర్‌లో దీన్ని వాయుసేనలోకి ప్రవేశపెట్టారు. ఎడారుల నుంచి పర్వతాల వరకు విభిన్న ప్రాంతాల్లో దీన్ని నడపవచ్చు. ఈ హెలికాప్టర్ 5,000 మీటర్ల పైన ఎత్తులోనూ ఎగరగలదు. ముఖ్యంగా పర్వత ప్రాంత సరిహద్దుల వెంట మోహరింపునకు ఇది అనుకూలంగా ఉంటుంది.



# అసెంబ్లీలో భార్యాభర్తల వాగ్యుద్ధం

**షిల్లాంగ్:** భర్త ముఖ్యమంత్రి, భార్య ఎమ్మెల్యే. వ్యక్తిగత బంధాలు వదిలేసి ఇద్దరూ అసెంబ్లీలో సమస్యలపై చర్చించారు. అలాంటి ఘటన తాజాగా మేఘాలయ అసెంబ్లీలో చోటు చేసుకుంది. అధికార పక్షానికి చెందిన ఎమ్మెల్యే మెహతాబ్ చండి అగిటోక్ సంగ్మా , ముఖ్యమంత్రి కాన్రాడ్ కొంగల్ సంగ్మా భార్యాభర్తలు. భార్య మెహతాబ్ చండి పశుసంవర్ధక విద్యాసంస్థల ప్రాజెక్టులపై ముఖ్యమంత్రిని వివరణ కోరారు. ఓ వైపు కుటుంబ సంబంధాలను పక్కన పెట్టి... ప్రజా సమస్యలపై చర్చించారు. ఈ ఘటన సభలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. 2022లో కేబినెట్ ఆమోదించిన వెటర్నరీ కాలేజీ, రెండు ఫిషరీస్ కాలేజీలు, ఒక డెయిరీ కాలేజీ పురోగతి ఏ దశలో ఉందని గాంబెగ్రే నియోజకవర్గ ఎమ్మెల్యే మెహతాబ్ ప్రశ్నించారు. రాష్ట్రంలోని వెటర్నరీ ట్రైనింగ్ సెంటర్లలో సిబ్బంది కొరతపై ఆందోళన వ్యక్తం చేశారు. పశుసంవర్ధక రంగంపై ఆధారపడి జీవనం సాగించే ప్రజలు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఈ విద్యాసంస్థలు అత్యవసరమని స్పష్టం చేశారు. ప్రభుత్వం తరఫున ముఖ్యమంత్రి కాన్రాడ్ సంగ్మా సమాధానం ఇచ్చారు. పశుసంవర్ధక రంగాన్ని బలోపేతం చేయడమే లక్ష్యంగా ఈ కాలేజీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. సిబ్బంది కొరత నిజంగా ఆందోళనకర అంశమేనని అంగీకరిస్తూ, ఖాళీలను త్వరగా భర్తీ చేయడానికి చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నియామకాలను ప్రాధాన్యంగా తీసుకుంటామని సభకు హామీ ఇచ్చారు. ఈ చర్చ కాస్త అసెంబ్లీలో ఎంతో ఆసక్తిగా కొనసాగింది.

# కేరళ స్టోరీ-2 విడుదలపై హైకోర్టు స్టే




**తిరువనంతపురం:** కేరళ స్టోరీ2 సినిమా విడుదలపై కేరళ హైకోర్టు స్టే విధించింది. శుక్రవారం విడుదల కావాల్సిన ఆ సినిమాను నిలిపివేసింది. సెన్సార్ బోర్డు తీరుపై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. సినిమాలో వివాదాస్పద అంశాలు ఉన్నాయని, సినిమా సరిగ్గా చూడకుండానే అనుమతి ఎలా ఇచ్చారంటూ సెన్సార్ బోర్డుపై కోర్టు మండిపడింది. ఫిర్యాదులను సెన్సార్ బోర్డు పరిగణనలోకి తీసుకోవాలని ఆదేశించింది. పిటిషనర్లు ఇంటీరియమ్ అప్లికేషన్ ద్వారా అదనపు డాక్యుమెంట్స్ సమర్పించడానికి అవకాశం కల్పించింది. 30 నిమిషాలకు పైగా వాదోపవాదాలు నడిచాయి. అనంతరం కోర్టు విచారణను వాయిదా వేసింది. సినిమాను మరింత క్షణ్ణంగా రివ్యూ చేసి, బ్యాన్ పిటిషన్లపై నిర్ణయం తీసుకోనుంది. కాగా, సెన్సార్ బోర్డు 16 కోతలతో సినిమాకు యూ/ఏ 16 సర్టిఫికెట్ ఇచ్చింది. అభ్యంతరకర సన్నివేశాల నిడివిని తగ్గించి, కొన్ని డైలాగ్స్‌లో మార్పులు చేయాలని సూచించింది. సినిమా మొదట్లో వచ్చే డిస్క్లైమర్‌ను కొన్ని నిమిషాల పాటు వాయిస్ ఓవర్‌తో కొనసాగించాలని ఆదేశించింది. సినిమాలో నటించిన మైనర్లకు సంబంధించి కన్సెంట్ వెరిఫికేషన్, డాక్యుమెంట్స్ ఇవ్వాలని నిర్మాతలను సెన్సార్ బోర్డు కోరింది. సుదీప్తో సేన్ దర్శకత్వం వహించిన 'ది కేరళ స్టోరీ' 2023లో విడుదలైంది. ఆదా శర్మ ప్రధాన పాత్రలో నటించిన ఈ సినిమా ఎలాంటి అంచనాలూ లేకుండా మే ఐదో తేదీన ప్రేక్షకుల ముందుకు వచ్చి ఘన విజయాన్ని సాధించింది. రూ. 20 కోట్లు పెట్టి తీస్తే రూ.300 కోట్లకు పైగా వసూళ్లు సాధించింది. ఈ సినిమాకు కొనసాగింపుగా 'ది కేరళ స్టోరీ 2' తెరకెక్కింది. సీక్వెల్‌కు కామాఖ్య నారాయణ్ సింగ్ దర్శకత్వం వహించారు. ఉల్కా గుప్త, అతిథి భాటియా ప్రధాన పాత్రల్లో నటించారు.

## అమెరికాతో ఒప్పందంపై

# కాంగ్రెస్ ఎమ్మెల్యేల నిరసన




**జైపూర్:** అమెరికా డీల్‌ను రద్దు చేయాలని కాంగ్రెస్ పార్టీ తన పోరాటాన్ని ముమ్మరం చేసింది. గత నెలలో పార్లమెంట్ సమావేశాల్లో ఆ డీల్ రద్దు చేయాలని కాంగ్రెస్, సీపీఎంలతో పాటు వివిధ పార్టీల ఎంపిలు పార్లమెంట్ మకర ద్వారం ఎదుట ఆందోళన చేశారు. అదే విధంగా ఇటీవల ఢిల్లీ వేదికగా జరిగిన ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్‌లో కూడా కాంగ్రెస్ అనుబంధ విద్యార్థి సంఘం యూత్ కాంగ్రెస్ నాయకులు కూడా అమెరికా డీల్‌ను రద్దు చేయాలని, ట్రంప్ ఒత్తిడి మేరకు మోదీ రాజీపడ్డారని పెద్దఎత్తున నినాదాలు చేస్తూ అర్ధ నగ్న ప్రదర్శన చేపట్టారు. తాజాగా రాజస్థాన్ అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అమెరికా డీల్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఆ రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో గురువారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు. బ్యానర్లు చేతబూని పిఎం మోదీ రాజీపడ్డారని నినాదాలతో హోరెత్తించారు. రైతులను మోసం చేస్తూ అమెరికాకు మోదీ సర్కార్ మేలు చేస్తోందని మండిపడ్డారు. రైతులకు ప్రతికూలమైన అమెరికా డీల్‌ను వెంటనే రద్దు చేయాలని కాంగ్రెస్ ఎమ్మెల్యేలు డిమాండ్ చేశారు.

# కాశీలో పడవపై పెళ్లిచేసుకున్న మెక్సికో జంట



**న్యూఢిల్లీ :** భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను గౌరవించేవాళ్లు ఎంతో మంది భారత్‌లో పర్యటిస్తుంటారు. పర్యాటక ప్రదేశాలు, ఆధ్మాత్మిక క్షేత్రాలను సందర్శించి వాటి గురించి ఆసక్తిగా తెలుసుకుంటారు. ఇక్కడి సంప్రదాయాలు నచ్చడంతో ఎందరో విదేశీ యువతీ యువకులు మన దేశంలో వారణాసి వంటి ఆధ్యాత్మిక క్షేత్రాలవద్ద వివాహబంధంతో ఒక్కటవుతుంటాయి. తాజాగా రూయిజ్ కాబోల్, గొంజాలో మిగ్వెల్ జంట సైతం ఇదే ఆలోచనతో మెక్సికో నుంచి వారణాసికి వచ్చింది. అస్సీ ఘాట్ వద్ద నీటిపై తేలుతున్న పడవలో వేదమంత్రాల నడుమ అగ్నిసాక్షిగా వివాహం చేసుకున్నారు. మెక్సికన్ సంప్రదాయానికి భిన్నంగా విన్నూత రీతిలో ఈ జంట వివాహం జరిగింది. వరుడు ధోవతి, కుర్తా వేసుకుని తలపాగా ధరించగా... వధువు బనారస్ చీరలో మెరిసిపోయింది. ఆచార్య దీపక్ పాండే పెళ్లి మంత్రాలు చదివారు. దేశ విదేశీ పర్యాటకులు ఘాట్ వద్ద గుమికూడి ఈ వేడుకను ఆసక్తిగా తిలకించారు. కొత్తజంటపై పలువురు పూల వర్షం కురిపించారు. ఈ అద్భుతమైన క్షణాలు భిన్న సంస్కృతుల సంగమం అంటూ పలువురు ప్రశంసించారు.

## పాలస్తీనియన్ల ఆకలిని బలవంతంగా చంపిన పాలనను...


# భారతదేశం ఎలా సమర్థిస్తుంది?

## ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనపై కాంగ్రెస్‌నేత ఆనంద్‌శర్మ ధ్వజం



**న్యూఢిల్లీ :** ప్రధానమంత్రి నరేంద్రమోదీ ఇజ్రాయెల్ పర్యటనపై కాంగ్రెస్ నేత ఆనంద్ శర్మ గురువారం ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. గాజాలో మారణహోమానికి పాల్పడి, వేలాది మంది నిస్సహాయ పాలస్తీనియన్ల ఆకలిని బలవంతంగా చంపిన పాలనగా భారతదేశం సమర్థిస్తున్నట్లుగా ఉండకూడదని మాజీ కేంద్ర మంత్రి ఆనంద్‌శర్మ తన వరుస 'ఎక్స్'పోస్ట్‌ల్లో ధ్వజమెత్తారు. 'జాతిపిత మహాత్మాగాంధీ మనకు స్ఫూర్తిగా నిలిచారు. భారతదేశం, న్యాయం, సమానత్వం పట్ల భాతరదేశం తన నిబద్ధతకు సార్వత్రిక గౌరవాన్ని పొందింది. భారతదేశం ఎల్లప్పుడూ ఒక పాలసీగా ఉగ్రవాదం, హింసను దాని అన్ని వ్యక్తీకరణలలో వ్యతిరేకించింది' అని శర్మ పేర్కొన్నారు. అక్టోబర్ 7న జరిగిన హమాస్ దాడిని, ఇజ్రాయెల్ పౌరులను దారుణంగా చంపడాన్ని కూడా కాంగ్రెస్ నిర్ద్వందంగా ఖండించిందన్నారు. కాబట్టి గాజాలో మారణహోమానికి పాల్పడి, వేలాదిమంది నిస్సహాయ పాలస్తీనియన్ పౌరులను, ముఖ్యంగా పిల్లలు, మహిళలు, వృద్ధులను బలవంతంగా ఆకలితో చంపిన ఇజ్రాయెల్‌లోని పాలనను భారతదేశం సమర్థిస్తున్నట్లుగా ఎట్టి పరిస్థితుల్లో చూడకూడదన్నారు. ఐక్యరాజ్యసమితి దీనిని మానవత్వానికి వ్యతిరేకంగా చేసిన నేరంగా ఖండించిందని ఆనంద్‌శర్మ తెలిపారు. సురక్షితమైన, నిర్వచించబడిన హద్దులలో స్వతంత్ర, సార్వభౌమ పాలస్తీనా రాజ్యస్థాపనపై భారతదేశం తన ప్రకటిత వైఖరికి దృఢంగా కట్టుబడి ఉండాలని శర్మ అన్నారు.

# బంగారం రవాణా కేసులో రన్యారావుకు బిగుస్తున్న ఉచ్చు




**న్యూఢిల్లీ :** బంగారం అక్రమ రవాణా కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావు చిక్కుల్లో పడింది. మొత్తం రూ.102 కోట్ల బంగారం స్మగ్లింగ్ కేసులో ఆమెపై ఆరోపణలు రాగా తాజాగా ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) దాఖలు చేసిన ఛార్జ్‌షీట్‌లో ఆమె పేరు కూడా ఉంది. స్మగ్లింగ్ ముఠా ఏడాదిలో 127 కిలోల బంగారాన్ని భారత్‌కు అక్రమంగా రవాణా చేసిందని ఆరోపణలు వచ్చాయి. ముఠా సభ్యులు, ఆభరణాల వ్యాపారులు దానిని దేశీయ మార్కెట్‌లోకి చొప్పించారని ఇడి దర్యాప్తులో గుర్తించింది. దాంతో బెంగళూరులోని పిఎంఎల్‌ఏ కోర్టులో ఇడి ఛార్జ్‌షీట్ దాఖలు చేసింది. దానిలో రన్యారావు పేరుతోపాటు ఆమె సహాయకుడిగా భావిస్తోన్న తరుణ్ కొండూరు, బళ్లారికి చెందిన గోల్డ్ డీలర్ సాహిల్ జైన్ పేర్లను చేర్చింది. దుబాయ్ నుంచి బంగారాన్ని అక్రమంగా తరలిస్తూ రన్యారావు గత ఏడాది బెంగళూరు విమానాశ్రయంలో దొరికిపోయారు. ఆమె నుంచి 14.7 కిలోల బంగారాన్ని డిఆర్‌ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. అక్రమ రవాణాలో కొన్నేళ్లుగా ఆమె ప్రధానపాత్ర పోషించినట్లు దర్యాప్తులో అధికారులు గుర్తించారు. దుబాయ్ నుంచి బెంగళూరుకు బంగారం అక్రమ రవాణా చేసేందుకు రన్యారావు భారీ మొత్తంలో కమీషన్ తీసుకునేదని అధికారులు తెలిపారు. ఈ కేసులో ఆమెకు ఏడాది జైలుశిక్ష పడింది.

# అది నకిలీ నోటీసు

## జామియా మిలియా వర్సిటీ వివరణ




**న్యూఢిల్లీ :** సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న ఒక నోటీసుపై నగరంలోని జామియా మిలియా ఇస్లామియా విశ్వవిద్యాలయం స్పష్టత ఇచ్చింది. ఆ నోటీసులో పవిత్ర రమజాన్ నెలలో విద్యార్థులపై కొన్ని పరిమితులు విధించారని తెలిపింది. ప్రధానంగా యూనివర్సిటీ క్యాంపస్‌లో అమ్మాయిఅబ్బాయి కనిపిస్తే పెళ్లి చేసేస్తామంటూ సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న నోటీసుపై స్పష్టత ఇచ్చింది. అది నిజం కాదని, ఆ నోటీసు నకిలీదని పేర్కొంది. తాము ఎలాంటి ఆదేశాలు జారీ చేయలేదని, ఇది తప్పుడు ప్రచారమని స్పష్టం చేసింది. ఈ నోటీసుతో ప్రజల్లో గందరగోళం సష్టించే యత్నం చేశారని, దీనిపై సైబర్ విభాగానికి అధికారిక ఫిర్యాదు ఇచ్చినట్లు వర్సిటీ అధికారులు తెలిపారు. క్యాంపస్‌లో అమ్మాయిఅబ్బాయి కలిసి ఉన్నందుకు ఎలాంటి పరిమితులు విధించలేదని స్పష్టం చేసింది. ఈ క్రమంలోనే జామియా మిలియా ఇస్లామియా ప్రతినిధులు ఒక విన్నపాన్ని ప్రజల ముందుకు తీసుకొచ్చారు. 'కేవలం అధికారిక వెబ్‌సైట్ లేదా విశ్వ విద్యాలయం నుండి విడుదలైన ప్రకటనలే నమ్మాలి. సోషల్ మీడియాలో వచ్చే తప్పుడు సమాచారం వల్ల తప్పుదారి పట్టవద్దు' అని సూచించారు.

# భారత్-ఇజ్రాయెల్ మధ్య కీలక ఒప్పందాలు



**న్యూఢిల్లీ :** ఇజ్రాయెల్‌తో భారత్ పలు కీలక ఒప్పందాలు చేసుకుంది. పిటిఐ కథకం ప్రకారం పలు ఒప్పందాలపై నరేంద్ర మోదీనెతన్యాహు సంతకాలు చేసుకున్నారు. ఇజ్రాయెల్ ప్రధానితో నరేంద్ర మోదీ కీలక సమావేశం నిర్వహించారు. ద్వైపాక్షిక చర్చలు జరిపారు. భారత్‌లో పర్యటించాలని నెతన్యాహును ప్రధాని మోదీ ఆహ్వానించారు. రక్షణ, వ్యాపార, వాణిజ్య రంగాల్లో ఇరుదేశాల మధ్య కీలక ఒప్పందాలు జరిగాయి. విద్య, వ్యవసాయం, వాణిజ్యం, సైబర్ సెక్యూరిటీ, సర్వీస్ సెక్టార్, సైన్స్ అండ్ టెక్నాలజీ, ఆవిష్కరణల రంగంలో అవగాహన ఒప్పందం కుదిరింది. ఇజ్రాయెల్‌లో యూపీఐ వాడకంపైనా భారత్ ఒప్పందం కుదుర్చుకుంది. రక్షణ రంగంలో పరస్పర సహకారానికి భారత్ఇజ్రాయెల్ నిర్ణయించాయి. వ్యవసాయం నుంచి ఏఐ వరకు పలు ఎంవోయూలపై ఇరుదేశాలు సంతకాలు చేశాయి. 16 ఎంవోయూలపై భారత్??ఇజ్రాయెల్ సంతకాలు చేసుకున్నాయి. 11 కీలక ప్రకటనలు చేశాయి. టెక్నాలజీ కేంద్రంగా భవిష్యత్ సంబంధాలు ఉంటాయని ప్రధాని మోదీ పేర్కొన్నారు. ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌కు త్వరలోనే తుదిరూపు ఇస్తామన్నారు. పశ్చిమాసియాలో శాంతిస్థాపనకు మోదీ పిలుపునిచ్చారు. సంఘర్షణల్లో మానవత్వం బాధితురాలు కాకూడదన్నారు.

**ఇజ్రాయెల్‌తో త్వరలో వాణిజ్య ఒప్పందం: ప్రధాని మోదీ**

ఇజ్రాయిల్ భారత్ మధ్య త్వరలోనే వాణిజ్య ఒప్పందం జరగనుందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. రెండు దేశాల మధ్య కీలక రంగాల్లో ఒప్పందాలు జరిగాయని, ఇజ్రాయిల్‌లోనూ ఇక యూపీఐ సేవలు వినియోగించుకోవచ్చని తెలిపారు. మరోవైపు గజాపై భారత్ వైఖరిని ప్రధాని మోదీ మరోసారి స్పష్టం చేశారు. మానవత్వం ఎప్పుడూ ఘర్షణకు బలి కాకూడదన్నారు. ప్రస్తుతం శాంతి ప్రణాళిక ద్వారా ఓ ముందడుగు పడిందని, ఈ ప్రయత్నాలకు భారత్ పూర్తి మద్దతిస్తుందన్నారు. ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనలో భాగంగా ఇరుదేశాల మధ్య కీలక ఒప్పందాలపై సంతకాలు జరిగాయి. ఏఐ, వ్యవసాయం, యూపీఏ చెల్లింపులు తదితర రంగాల్లో ఒప్పందాలు కుదిరాయి. మొత్తంగా 27 రంగాల్లో పరస్పర సహకారానికి ఇరుదేశాలు అంగీకరించాయి. రెండు దేశాల మధ్య త్వరలోనే వాణిజ్య ఒప్పందం జరగనున్నట్లు సంయుక్త ప్రకటనలో దేశాధినేతలు వెల్లడించారు. ఈ సందర్భంగా భారత్‌లో పర్యటించాలని నెతన్యాహును ప్రధాని మోదీ ఆహ్వానించారు. అనంతరం నెతన్యాహు (దీవఅఎఱఅ చీవ్‌అఠ్ణ) మాట్లాడుతూ.. తమ పార్లమెంటులో ప్రధాని మోదీ చేసిన ప్రసంగం ప్రతి ఒక్కరినీ కదిలించిందన్నారు. భారత్‌కు రుణపడి ఉన్నామని చెప్పారు.

# ఆడుకుంటూ కుప్పకూలిన బాలిక

## కార్డియాక్ అరెస్ట్ అంటూ వైద్యుల నిర్ధారణ

**జైపూర్:** రాజస్థాన్‌లోని నాగౌర్ జిల్లాలో ఓ బాలిక (9) పాఠశాలలో ఆడుకుంటూ కార్డియాక్ అరెస్ట్‌తో కుప్పకూలిపోయింది. కార్డియాక్ అరెస్ట్ కారణంగానే ఆ బాలిక చనిపోయినట్టు వైద్యులు ధృవీకరించారు. ఆ బాలిక అన్న కూడా కొన్ని నెలల కిందట కార్డియాక్ అరెస్ట్ కారణంగానే ప్రాణాలు కోల్పోయాడు. రాజేంద్ర బపేడియా కుమార్తె దివ్య స్థానికంగా ఉన్న ఓ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఐదో తరగతి చదువుతోంది. ఈ నెల 23వ తేదీన ఎప్పటిలాగానే దివ్య స్కూల్‌కు వెళ్లింది. ఉదయం ప్రేయర్ సమయానికి ముందు తోటి పిల్లలతో కలిసి స్కూల్ గ్రౌండ్‌లో ఆడుకుంది. ఆ సమయంలో ఉన్నట్టుండి దివ్య కుప్పకూలిపోయింది. పాఠశాల సిబ్బంది వెంటనే ఆ బాలికను ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రికి చేరుకునే సమయానికే ఆ బాలిక ప్రాణాలు కోల్పోయింది. బాలిక శరీరంపై ఎలాంటి గాయాలూ లేవు. దీంతో ఆ బాలిక కార్డియాక్ అరెస్ట్ కారణంగానే చనిపోయి ఉంటుందని వైద్యులు తెలిపారు. దివ్య అన్న అభిషేక్ కూడా కొన్ని నెలల కిందట ఇంట్లో ఆడుకుంటూ కుప్పకూలిపోయాడు. హాస్పిటల్‌కు తీసుకెళ్లే సరికే ప్రాణాలు కోల్పోయాడు. నెలల వ్యవధిలోనే ఇద్దరు పిల్లలను కోల్పోవడంతో రాజేంద్ర కుటుంబం విషాదంలో మునిగిపోయింది.

# ఇండోర్‌లో రైతుల నిరసన



**ఇండోర్:** ఈస్టర్న్ ఔటర్ రింగ్ రోడ్ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ, గురువారం వందలాది మంది రైతులు ఇండోర్‌లో నిరసన వ్యక్తం చేశారు. అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. ఈ ప్రాజెక్టు కోసం చేపట్టిన భూ సేకరణ పనులను తక్షణమే నిలిపివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ ఔటర్ రింగ్ రోడ్డు కోసం సుమారు 2,400 ఎకరాల వ్యవసాయ భూమిని సేకరించడానికి అధికారులు చర్యలు చేపట్టారు. 44 గ్రామాల రైతులు తమ భూములను కోల్పోవాల్సి వస్తున్నది. 85 కిలోమీటర్ల పొడవుగల ఈ రింగ్ రోడ్డు ఇండోర్, దెవాస్ జిలాల్లల మీదుగా వెళుతుంది. అయితే, భూములు కోల్పోతున్న రైతులు ఈ ప్రాజెక్టుకు వ్యతిరేకంగా జిల్లా మెజిస్ట్రేట్ కార్యాలయం ముందు నిరసనకు దిగారు. రోడ్డు పనులను వెంటనే నిలిపివేయాలని కోరుతూ ప్రదర్శన నిర్వహించారు.

# ప్రపంచ సంక్షోభంగా మారుతున్న ఇరాన్–అమెరికా ఉద్రిక్తతలు

**న్యూఢిల్లీ :** ఇరాన్ అమెరికా మధ్యలో ఉద్రిక్తతలు పతాక స్థాయికి చేరుకున్న నేపథ్యంలో ఏ క్షణమైనా ఇరాన్ పై దాడి జరిగే అవకాశం ఉన్నందున భారత్ ప్రభుత్వం అక్కడ నివసిస్తున్న భారతీయ ప్రజలు, విద్యార్థులు, వ్యాపారవేత్తలు, పర్యాటకులు అందుబాటులో ఉన్న రవాణా సౌకర్యాలను ఉపయోగించుకుని స్వదేశానికి తిరిగి రావాల్సిందిగా కోరడమైనది.2025 డిసెంబర్ నుండి ఇరాన్ లో పౌర సమాజం గౌరవప్రదమైన జీవితం, స్వేచ్ఛ, సమానత్వం, స్వాతంత్ర్యం, చట్టబద్ధమైన ఆకాంక్షల కోసం ధైర్యంగా పోరాడుతుంటే అక్కడి అధికార గణం, సైన్యం, పోలీసు వ్యవస్థలు ప్రజలను దారుణంగా అణచివేస్తున్నందుకు కెనడా మరియు G7 దేశాలు సైతం ప్రస్తుత ఇరాన్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రకటన చేశాయి.ఆహార ధరలు, కరెన్సీ తరుగుదల, ద్రవ్యోల్బణం వంటి సమస్యలతో నిరాశ చెందిన ప్రజలు ప్రభుత్వ వ్యతిరేక నిరసనలు చేపట్టారు. తర్వాత జరిగిన పరిణామక్రమాలలో ఇస్లామిక్ ప్రభుత్వాన్నే అంతం చేయాలని తీవ్రమైన ఆందోళనలు మొదలయ్యాయి.ఇరాన్లో అంతర్గత పరిస్థితులు కూడా అంతంత మాత్రంగానే ఉన్నట్లు తెలుస్తుంది. 21–02–2026 కొత్త విద్యా సంవత్సరం ప్రారంభమైన వెంటనే ఇరాన్ అత్యున్నత నేత అయోతొల్లా అలీ ఖోమేని పరిపాలనకు వ్యతిరేకంగా అనేక విశ్వవిద్యాలయాలలో నిరసనలు జరిగాయి. గత నెలల్లో ప్రభుత్వ వ్యతిరేక నిరసనలలో పాల్గొని భద్రత దళాల చే తిలో హతమైన ప్రజలను స్మరించుకుంటూ ఆ ఒందోళనలు జరిగినట్టు తెలుస్తుంది. స్తుంది లోని షరీఫ్ సాంకేతిక విశ్వవిద్యాలయ విద్యార్థులు అ యోతొల్ల అలీ ఖోమేని అత్యంత క్రూరమైన నా యకుడనే నినాదాలతో నిరసన తెలుపుతూ ఇరాన్ మాజీ రాజు షా కుమారుడైన రెజా పహ్లావి ఇరాన్ అత్యుత్తమ నేత పదవి అలంకరించాలని విద్యార్థులు నినాదాలు చేశారు. మద్దతుదారులైన 'బసీజ్ ' స్వచ్ఛంద మద్దతుదారులు) వివిధ ప్రదేశాలలో నిరసన చేస్తున్న విద్యార్థులతో గొడవపడ్డారు.

# పరీక్ష రాస్తూ పదో తరగతి విద్యార్థిని ప్రసవం

**భోపాల్ :** మధ్యప్రదేశ్‌లో 10వ తరగతి విద్యార్థిని పరీక్ష కేంద్రం వాష్‌రూమ్‌లో ప్రసవించటం అందర్నీ షాక్‌కు గురిచేసింది. ఇండోర్ జిల్లా బెత్మా ప్రాంతానికి చెందిన బాలిక ధార్ జిల్లా పిథాంపూర్‌లో గణితం పేపర్ పరీక్ష రాసేందుకు వచ్చింది. విద్యార్థినికి మధ్యలో తీవ్రమైన కడుపునొప్పి రావటంతో ఇన్విజిలేటర్ అనుమతితో వాష్‌రూమ్‌లోకి వెళ్లింది. అయితే, చాలా సేపటికి తిరిగి రాకపోవడంతోపాటు లోపలి నుంచి పసికందు ఏడుపు వినిపించటంతో సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. తలుపులు తెరిచి చూడగా, విద్యార్థిని బిడ్డను ప్రసవించి ఉండటం నిశ్చేష్టులయ్యారు. తల్లీబిడ్డను హుటాహుటిన ఆసుపత్రికి తరలించారు.

# ఇజ్రాయెల్‌కు అంటకాగేలా మోదీ ప్రసంగం!

ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రెండు రోజుల ఇజ్రాయెల్ పర్యటన సందర్భంగా భారతదేశ విధానంలో స్పష్టమైన మార్పు కొట్టొచ్చినట్లు కనపడుతోంది. పాలస్తీనా ఉద్యమానికి స్వాతంత్ర్య పూర్వం నుంచి భారతదేశ ప్రజలు, వరుస ప్రభుత్వాలు అండగా నిలిచాయి. ఆ వైఖరి నుంచి ఇప్పుడు మన దేశాన్ని పూర్తిగా ఇజ్రాయెల్‌కు అంటకాగేలా మార్చేసారు ప్రధాని మోదీ. ఈ మార్పును ఆయన ఇజ్రాయెల్ పార్లమెంటు నెస్సెట్ సాక్షిగా బుధవారం చేసిన ప్రసంగంలో స్పష్టమైంది. తన ప్రసంగంలో 2023 అక్టోబర్ 7న జరిగిన హమాస్ దాడిని ప్రస్తావిస్తూ చేసిన వ్యాఖ్యలు ఇందుకు నిదర్శనం. 'మీ బాధను నేను అర్థం చేసుకోగలను. మీ ఆవేదనను పంచుకోగలను. ఈ కష్టకాలంలో భారతదేశం బలంగా, పూర్తి నిబద్ధతతో ఇజ్రాయెల్‌కు అండగా నిలబడుతుంది. కారణమేదైనా పౌరుల హత్యలను సమర్థించుకోలేరు. ఉగ్రవాదాన్ని ఏ విధంగానూ సమర్థించలేరు' అనే మోదీ వ్యాఖ్యలు వినేందుకు బాగానే ఉన్నాయి. అదే నోటితో పాలస్తీనీయులపై ఇజ్రాయెల్ రెండున్నరేళ్ళుగా సాగిస్తున్న మారణహోమాన్ని లేశమాత్రం కూడా ప్రస్తావించలేదు. పైగా భారతదేశంలో 2008లో జరిగిన ముంబయి దాడులను, ఇజ్రాయెల్‌పై జరిగిన దాడులతో పోల్చి, తాము సైతం ఉగ్రవాద పీడితులమేనని ప్రధాని మోదీ చెప్పారు. ఇక్కడ కూడా ఆయన రాజకీయమే చేశారు. 2008లో కాంగ్రెస్ నేతృత్వంలోని యుపిఎ హయాంలో జరిగిన ఉగ్రదాడిని ప్రస్తావించారే తప్ప, తాజాగా ఎన్‌డిఎ హయాంలో కశ్మీర్‌లోని పెహల్గామ్‌లో ఒక విదేశీ పౌరుడు సహా 26 మందిని బలిగొన్న ఉగ్రదాడి గురించి మాట్లాడలేదు.

యూదు దేశ దాష్టీకంలో గాజా ప్రాంతంలోనే 20 వేల మంది అమాయక చిన్నారులు సహా 60 వేల మంది పాలస్తీనా పౌరులు బలైపోయారు. వైమానిక బాంబు దాడులతో గాజా ప్రాంతంలోని నగరాలు శిథిలాలుగా మారాయి. వందలాది మంది చికిత్స పొందుతున్న ఆసుపత్రులపై ఇజ్రాయెల్ సేనలు బాంబుల వర్షం కురిపించాయి. వివిధ ప్రపంచ దేశాలు పంపిన ఆహార, ఔషధ సహాయాన్ని సైతం నిలిపివేసి అత్యంత ఆటవికంగా ప్రవర్తించింది ఇజ్రాయెల్. ఆహార కేంద్రాలకు వచ్చే ఆకలిగొన్న పాలస్తీనీయులను దగ్గర వరకు రాగానే కాల్పులు జరిపి, అనాగరికంగా వ్యవహరించిన ఉదంతాలెన్నో. ఇలాంటి ఇజ్రాయెల్ అమానవీయ చర్యలు నెస్సెట్ ప్రసంగం సందర్భంగా ప్రధాని మోదీకి గుర్తుకు రాకపోవడం శోచనీయం. అంతర్జాతీయ న్యాయస్థానం ఆ దేశ ప్రధాని బెంజామిన్ నెతన్యాహూ అరెస్టుకు వారెంటు జారీ చేసినా, స్వదేశంలో పలువురు ఇజ్రాయిలీలు మానవహననాన్ని వ్యతిరేకించినా ఆ యుద్ధపిపాసి రక్తదాహం చల్లారలేదు. ఈ ఏడాది జరిగే ఎన్నికల్లో ప్రజల ముందు తన యుద్ధ విన్యాసాలకు ప్రపంచ దేశాల మద్దతును ప్రదర్శించడంలో భాగంగానే మోదీ పర్యటనను నెతన్యాహూ ఉపయోగించుకుంటున్నారనే విశ్లేషణలు వస్తున్నాయి. అందుకు ఆయనను 'గ్రేట్ ఫ్రెండ్ ఆఫ్ ఇజ్రాయెల్' అంటూ పొగడ్తల్లో ముంచెత్తారు. అలాగే 'స్పీకర్ ఆఫ్ ద నెస్సెట్ మెడల్' తో సత్కరించా రు. అంతేగాక, విమానాశ్రయంలో మోదీకి నెతన్యాహూ స్వాగతం పలికినప్పుడు, తన సతీమణి కాషాయ రంగు కోటు ధరించారని చూపించారు. మరో ముఖ్య అంశం ఈ పర్యటనలో ఇజ్రాయెల్‌తో ఆయుధాల కొనుగోలు బంధం మరింత పెనవేసుకునేలా భారత్ అవగాహన ఒప్పందాలను కూడా కుదుర్చుకుంటున్నది.

దేశంలో సమస్యలు, ప్రతిపక్షాల ప్రశ్నలకు సమాధానాలను తప్పించుకునేందుకు మోదీ విదేశీ పర్యటనలను ఆశ్రయిస్తారని ప్రతీతి. అత్యున్నతమైన పార్లమెంటు సమావేశాలు జరిగే సమయాలలో కూడా ఆయన మధ్యలో విదేశాలకు వెళ్ళి వస్తుంటారు. పార్లమెంటుకు మాత్రం జవాబుదారీగా ఉండరు. విదేశీ పర్యటనలలో దేశాధినేతలతో మోదీ ఆలింగనాలు, ముచ్చట్ల ఫోటోలు, విడియోలను బిజెపి బృందాలు సోషల్ మీడియాలో జొప్పిస్తాయి. తద్వారా ప్రధానికి దేశాధినేతలతో గాఢమైన వ్యక్తిగత సంబంధాలు ఉన్నాయనే భ్రమలను వ్యాపింపచేస్తారు. అక్కరకు రాని చుట్టం తరహాలో, పాకిస్తాన్ ఉగ్రదాడులు, ఆపరేషన్ సింధూర్ సమయాలలో ఏ దేశమూ మనకు ప్రత్యక్షంగా అండగా నిలవలేదు. పొడిపొడి మాటలతో, పడికట్టు పదాలతో ఉగ్రవాదాన్ని ఖండించడం వరకే పరిమితమయ్యాయి.

ఇక పాలస్తీనా విషయానికి వస్తే గాంధీ కాలం నుంచి వారికి మన దేశం మద్దతుగా నిలిచింది. పాలస్తీనా విమోచనోద్యమ నేత యాసర్ అరాఫత్ మన దేశాన్ని ఆత్మీయ మిత్రుడిగా చూసేవారు. అన్ని అంతర్జాతీయ వేదికల్లో పాలస్తీనా ప్రత్యేక దేశం డిమాండ్‌కు అండగా నిలబడడమే కాకుండా, ఐక్యరాజ్యసమితిలో ఆ అంశానికి సంబంధించి అనేక సందర్భాలలో అనుకూలంగా ఓటు వేసింది. 2014లో స్పష్టమైన ఆధిక్యతతో బిజెపి ప్రభుత్వం కేంద్రంలో అధికారంలోకి వచ్చిన తరువాత పాలస్తీనాపై వైఖరి మారుతూ వచ్చింది. క్రమంగా ఇజ్రాయెల్‌కు సన్నిహితంగా వ్యవహరిస్తోంది. ఆ దేశం నుంచి పెద్ద ఎత్తున ఆయుధాలను కొనుగోలు చేయడమే కాకుండా, తాజా పర్యటనలో ఆ పరిణామాన్ని పెంచనుంది. ఇరాన్‌పై రేపో మాపో యుద్ధం చేస్తామని రంకెలు వేస్తున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌కు పూర్తి స్థాయిలో ఇజ్రాయెల్ అండగా నిలిస్తోంది. ఇలాంటి సందర్భంలో ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటనకు వెళ్ళి, నెస్సెట్‌లో ఆ దేశానికి మద్దతుగా నిలుస్తామనడం ద్వారా ఏమి సంకేతాలిస్తున్నారు? పాలస్తీనాకు దూరం జరుగుతూ ఇజ్రాయెల్‌కు మరింత సన్నిహితంగా వ్యవహరించే వైఖరిని ప్రధాని ఎవరితో చర్చించి తీసుకున్నారు? ఈ అంశంపై మార్చి 9 నుంచి పునః ప్రారంభం కానున్న పార్లమెంటు బడ్జెట్ సమావేశాలలోనైనా చర్చించేందుకు అధికార పక్షం సుముఖంగా ఉంటుందా? పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న సమయంలోనే ఎలాంటి సమాచారమివ్వకుండా అమెరికాతో ద్వైపాక్షిక ఒప్పందం కుదుర్చుకున్న ఈ ప్రభుత్వం నుంచి ఆ విధంగా కోరుకోవడం అత్యాశే అవుతుంది. ●



## ఎన్‌సిఇఆర్‌టి వ్యూహాత్మక కుట్ర

న్యాయ వ్యవస్థలో అవినీతి పేరుతో పాఠాన్ని 8వ తరగతి సామాజిక శాస్త్రంలో చేర్చిన ఎన్‌సిఇఆర్‌టి బలవంతంగా క్షమాపణ చెప్పినట్టు కనిపిస్తున్నది. ప్రజలు న్యాయ వ్యవస్థపై నమ్మకం కోల్పోయే విధంగా ఉన్న ఆ పాఠ్యాంశంతో కూడిన పుస్తకాన్ని తక్షణమే ఉపసంహరించుకోవాలి. వాటితోపాటు, డిజిటల్ ప్రతులను కూడా వెంటనే స్వాధీనం చేసుకోవాలి. ఎన్‌సిఇఆర్‌టి కోర్టుకు క్షమాపణ చెప్పడం చాలా కృతకంగా ఉంది. ఒక రకంగా ఆ పాఠ్యాంశాన్ని సమర్థించుకునే రీతిలో ఎన్‌సిఇఆర్‌టి ప్రకటన కనిపిస్తున్నది. ఈ తతంగం మొత్తం చూస్తుంటే, రాజ్యాంగ వ్యవస్థను దెబ్బతీయడానికి జరుగుతున్న వ్యూహాత్మక కుట్రగా కనిపిస్తున్నది.

- జస్టిస్ సూర్యకాంత్
సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి




# దేశ సవాళ్లను అధిగమించే యజ్ఞంలో స్వచ్ఛంద సంస్థలు

సామాజిక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న లాభాపేక్ష లేని నిస్వార్థ స్వచ్ఛంద పౌర సమూహాలను ప్రభుత్వేతర సంస్థలు లేదా నాన్‌గవర్నమెంటల్ ఆర్గనైజేషన్స్ (ఎన్జీవోస్) అని పిలుస్తారు. సమాజాన్ని పట్టి పీడిస్తున్న పేదరికం, అసమానతలు, పరివారం కాలుష్యం, మానవీయ సమస్యలకు తగు పరిష్కారాలు చూపడానికి, సమాజాభివృద్ధి, సానుకూల మార్పులకు కృషి చేయడం, మానవ హక్కుల పరిరక్షణ, ఎన్జీవోల పట్ల అవగాహన పెంచడం లాంటి కార్యక్రమాలను నిర్వహించడానికి ప్రభుత్వేతర సంస్థలు ప్రపంచవ్యాప్తంగా నిరంతరం కృషి చేస్తున్నాయి. మెరుగైన పౌరసమాజ నిర్మాణానికి ఎన్జీవోలు చేస్తున్న కృషిని ఏకరువు పెట్టడానికి, వాటి పట్ల ప్రజలకు అవగాహన కల్పించడానికి సామాజిక కార్యకర్త మార్కస్ లియర్స్ స్కద్మనిస్ నేతృత్వంలో 2009 నుంచి ప్రతి ఏట 27 ఫిబ్రవరి రోజున ప్రపంచ ప్రభుత్వేతర సంస్థల దినోత్సవం (వరల్డ్ ఎన్జీవో డే) వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నారు.

**ప్రపంచ ఎన్జీవోల దినోత్సవం-2026 ఇతివృత్తం:**

ప్రతి వ్యక్తి తమకు తోచినట్లుగా విరాళాలు, శ్రమదానాలు, నిధులు సమకూర్చుకునే కార్యకలాపాలు, చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు రావాలని ఈ వేదిక కోరుకుంటున్నది. ప్రపంచ ఎన్జీవోల దినోత్సవం–2026 ఇతివృత్తంగా సమ్మిళిత మూలసూత్రంతో సుస్థిరాభివృద్ధి అనే అంశాన్ని తీసుకొని ప్రచారాలు నిర్వహించడం జరుగుతున్నది. ఈ రోజున ఎన్జీవోల ప్రాధాన్యాన్ని వివరించడానికి, ప్రోత్సహించడానికి తగు సదస్సులు, వెబినార్స్, కార్యశాలలు, శిక్షణ కార్యక్రమాలు, అవార్డుల ప్రదానాలు, క్షేత్రస్థాయి కార్యక్రమాలు, సంఘటిత కార్యక్రమాలు, పాలసీ వివరణలు, నిధుల సేకరణలు, సామాజిక మాధ్యమాల్లో ప్రచారాలు లాంటివి నిర్వహించవచ్చు.

**భారత్‌లో ఎన్జీవోల ఉద్యమాలు:**

నేటి ప్రజా సమస్యల సకారాత్మక పరిష్కారానికి ప్రభుత్వాలు చేస్తున్న కృషితో పాటు ప్రభుత్వేతర సంస్థల సహాయ సహకారాలు కూడా దోహదపడుతున్నాయి. ఆర్య సమాజ్, నేషనల్ కౌన్సిల్ ఫర్ వుమెన్, సంకల్ప్ తరు ఫౌండేషన్ లాంటి స్వచ్ఛంద సంస్థల రాకతో భారత్‌లో ఎన్జీఒల ఉద్యమాలు ఊపందుకున్నాయి. గ్రామీణాభివృద్ధి, మహిళా సాధికారత, బాలల సంక్షేమం, ప్రజారోగ్యం, విపత్తుల నిర్వహణ, మానవ హక్కుల పరిరక్షణ, పర్యావరణ పరిరక్షణ లాంటి సమస్యలను ఎన్జీవోలు పరిష్కరించడానికి ప్రయత్నాలు చేయడం కొనసాగుతున్నది. నిధుల కొరత, సుస్థిరత, జవాబుదారీతనం, ప్రభుత్వ నిర్లక్ష్యం లాంటి సవాళ్లను ఎదుర్కొంటున్న ఎన్జీవోల ఉద్యమాలు కొనసాగుతున్నాయి. గివ్ ఇండియా, స్మైల్ ఫౌండేషన్, గూంజ్, హెల్పేజ్ ఇండియా, ఆక్షన్ ఎయిడ్, చైల్డ్ ఇండియా ఫౌండేషన్ లాంటి ప్రముఖ ఎన్జీవోలు భారత దేశాభివృద్ధికి నిస్వార్థంగా సేవలు అందిస్తున్నాయి.

ప్రపంచవ్యాప్తంగా దాదాపు 10 మిలియన్ల ఎన్జీవోల ద్వారా 50 మిలియన్ల స్వచ్ఛంద కార్యకర్తలు సేవలు అందిస్తున్నారు. ఇలాంటి ఎన్జీవో సంస్థలతో మనం కూడా కలిసి నిర్భాగ్యుల ముఖాల్లో ఆనంద భాష్పాలను చూద్దాం, బాధలే లేని భారతిని నిర్మిద్దాం.

*(27 ఫిబ్రవరి ప్రపంచ ప్రభుత్వేతర సంస్థల దినోత్సవం సందర్భంగా)*

# అందరూ హిందువులే అయితే.. ఘర్ వాపసీ ఏమిటి?



డాక్టర్ రామ్ పునియానీ

భారత రాజ్యాంగం కింద మతాన్ని ఎంచుకోవడం పౌరుల సామాజిక, చట్టపరమైన హక్కు. అయినప్పటికీ, మతం ముసుగులో రాజకీయాలు చేసే సంస్థలు దీనిని అంగీకరించవు. ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్‌చాలక్ డాక్టర్ మోహన్ భాగవత్ ఒక వైపు ఈ దేశంలో నివసించే వారందరూ హిందువులే అని చెబుతూనే, మరోవైపు హిందూ జనాభా తగ్గుతోందని, వారిలో చాలామంది ఇస్లాం, క్రైస్తవ మతంలోకి మారుతున్నారని అంటారు. దీంతోపాటు దేశంలో హిందువుల జనాభా తగ్గడం ఆందోళనకరంగా ఉన్నందున హిందూ దంపతులు ముగ్గురు పిల్లలను కనాలని ఆయన అన్నారు.

ఒక వైపు వీరు ప్రతి ఒక్కరినీ హిందువులుగా పిలుస్తూనే, మరోవైపు వీరు ఘర్ వాపసీ పేరుతో హిందూ మతంలోకి పిలవడం వైరుధ్యం. భారతదేశంలోని అన్ని వర్గాల డిఎన్ఎ నిర్మాణం ఒకేలా ఉందని వారిలో చాలా మంది నొక్కి చెబుతున్నారు. జనాభా జన్యుశాస్త్రం విషయానికొస్తే ఇది ఒకరి మతానికి సూచిక కాదు. నిజానికి భౌగోళిక వలసలు చోటుచేసుకోవడంతో, వివిధ మతాల మధ్య డిఎన్ఎ సారూప్యతను ఇది నిర్ధారిస్తుంది. డిఎన్ఎ అధ్యయనాలు అనేక సారూప్యతలను వెల్లడిస్తున్నందున, ఒకరి వారసత్వంగా వచ్చిన మతాన్ని వదలటం లేదా ఆ మతాన్ని వీడి మెజారిటీ మత సమాజం లో విలీనం కావడం అనేది ఈ వాదనకు సరిపోదు.



భారతదేశంలో మొట్టమొదటి ముస్లిం జనాభా కేరళలోని మలబార్ తీరంలో అభివృద్ధి చెందిన కారణంగా రాజుల ఖడ్గ బలంతో భారతదేశంలో ఇస్లాం వ్యాపించిందనే వాదన నిలబడదు. ఇస్లాం వ్యాప్తి రాజు ఖడ్గం వల్ల జరిగింది కాదు. ఎందుకంటే 15వ శతాబ్దంలో టిప్పు సుల్తాన్ కేరళను స్వాధీనం చేసుకునే వరకు కేరళలో ముస్లిం రాజు లేడు. భారతదేశంలో మొట్టమొదటగా 7వ శతాబ్దంలోనే చెరమాన్ జుమా మసీదులు ఏర్పడ్డాయి. తరువాత బలవంతం లేదా ప్రలోభం కారణంగా ఇస్లాంలోకి కొన్ని మార్పిడులు జరిగి ఉండవచ్చు. వాటిలో కుల వ్యవస్థ నిరంకుశత్వం నుండి తప్పించుకోవడానికి ఇస్లాంలోకి ప్రధాన మార్పిడులు జరిగాయి. ఇస్లాంలోకి మత మార్పిడి చేసినది రాజులు కాదు, సూఫీ సాధువుల మానవతావాద దృక్పథం ప్రభావంతో చాలా మంది ఇస్లాంలోకి మారారు.

స్వామి వివేకానంద చెప్పినట్లుగా భారతదేశంలోని తక్కువ కులాలకు ఇస్లాం ఒక విముక్తి శక్తిగా గోచరించింది. అనేకమంది పరాజిత హిందూ రాజులు ఇస్లాం మతాన్ని అంగీకరిస్తే, గెలిచిన ఇస్లాం రాజులు వారికి క్షమాభిక్ష కల్పించారు. ఇది చాలా తక్కువ. మతం మారిన వారిలో మతం మారడం వల్ల ఆరాధన పద్ధతి మాత్రమే మారిందని చెప్పడం సత్యానికి విరుద్ధం. ముస్లింలకు వారి స్వంత ప్రార్థనా స్థలాలు, తీర్థయాత్రలు, పవిత్ర గ్రంథాలు, అస్థిత్వం ఉన్నాయి. ప్రస్తుత హిందూత్వ సిద్ధాంతకర్తల వాదనలు హిందూ జాతీయవాదానికి మూలపురుషుడు సావర్కర్‌తో విభేదిస్తున్నాయి. ఆయన ఉద్దేశ్యంలో ముస్లింలు వేరే జాతి.

క్రైస్తవ మతం విషయానికొస్తే, అది క్రీ.శ.52లో సెయింట్ థామస్ మలబార్ తీరంలో చర్చిలను స్థాపించడంతో భారతదేశంలోకి ప్రవేశించింది. నేడు వారి శాతం (జనాభా లెక్కలు 2011) 2.30. మారుమూల ఆదివాసీ ప్రాంతాలలో వారు చేసిన పనుల ద్వారానే ఆదివాసీలు మతమార్పిడి చేసుకున్నారు. కానీ దాదాపు రెండు వేల సంవత్సరాల కాలంలో మొత్తం 2.3% సంఖ్య అనేది ఎలాంటి ఆకర్షణ లేదా బలప్రయోగాన్ని సూచించడం లేదు. కచ్చితంగా క్రైస్తవ మతంలోని కొన్ని చిన్న వర్గాలు తాము మతం మారాలనుకుంటున్నామని చెప్పుకుంటాయి. కానీ, వ్యక్తి స్వచ్ఛందంగా ఎంచుకుంటే తప్ప అందులోని ప్రధాన వర్గాలు మతం మారవు.

భారతదేశంలో మత రాజకీయాలు పెరగడంతో, మొదట్లో ఆర్యసమాజ్ ద్వారా ముస్లింలను హిందూమతంలోకి మార్చడం జరిగింది. ఆర్యసమాజ్ శుద్ధిని ప్రారంభించింది. అదే సమయంలో తబ్లిగీ జమాత్ ఉత్తర భారతదేశంలో తన్‌జీమ్ (సంస్థ), తబ్లిగీ (ప్రచారం/మత మార్పిడి) ఉద్యమాన్ని ప్రారంభించింది. ఇస్లాం మతంలోకి మారిన వారు అపవిత్రులయ్యారని, వారిని తిరిగి తీసుకురావాలని, పవిత్రీకరణ ఆచారాలు నిర్వహించాలని శుద్ధి విధానం భావించేది. కొంతమంది ముస్లింలు ఇస్లామిక్ నిబంధనలను మరచిపోయారని, వారికి ఇది నేర్పించాల్సిన అవసరం ఉందని తన్‌జీమ్ భావించింది.

ప్రస్తుత ఘర్ వాపసీ ప్రచారం నాలుగు దశాబ్దాల క్రితం ప్రధానంగా ఆదివాసీ/దళిత ప్రాంతాలలో మొదలైంది. ఇది మురికివాడలలో కూడా జరిగింది. ముస్లింలను హిందూ మతంలోకి మార్చడం లక్ష్యంగా పెట్టుకుంది. ఆదివాసీ ప్రాంతాలలో వేడి నీటి బుగ్గలలో స్నానం చేయించడం, హవనాలు (హిందూ ఆచారాలు) చేయడం వంటి మతపరమైన ఆచారాలు నిర్వహించేవారు. ఆ తర్వాత వారు ఆ వ్యక్తి హిందువుగా మారినట్లుగా ప్రకటించేవారు. దీనికి ఒక ఉదాహరణ 2014లో ఆగ్రాలోని వేదనగర్‌లో వెలుగులోకి వచ్చింది. ప్రధానంగా చెత్త ఏరుకునేవారు, రోడ్డు పక్కన జీవించే దాదాపు 350 మంది ముస్లింలను (వారిలో అధికులు చెత్త ఏరుకునేవారు, నిరాశ్రయులు) స్నానం చేసి రావాలని చెప్పారు. వారికి బిపిఎల్ కార్డులు, రేషన్ కార్డులు ఇస్తామని వాగ్దానం చేశారు. వారు స్నానం చేసి వచ్చిన తరువాత, వారిని హవనంలో పాల్గొనమని బలవంతం చేశారు. ఆ తర్వాత వారిని హిందువులుగా ప్రకటించారు. దీనిని ఆర్‌ఎస్‌ఎస్‌కు అనుబంధంగా ఉండే భజరంగ్ దళ్, హిందూ జన జాగృతి సమితి నిర్వహించాయి. ముస్లింలు, క్రైస్తవులలో పేద వర్గాన్ని దీనికోసం లక్ష్యంగా చేసుకుంటున్నారు.

ఈ దిశలోనే అనేక రాష్ట్రాలు 'మత స్వేచ్ఛ' చట్టాలను ప్రవేశపెట్టాయి. ఇవి ప్రజలు తమ మతాన్ని ఎంచుకోలేకుండా చేస్తాయి. ఈ చర్యలలో చాలా వరకు కలెక్టర్ల అనుమతి అవసరం. మతమార్పిడి చేస్తున్నారనే ఆరోపణతో చాలామంది పాస్టర్లు, పూజారులను కొట్టారు. క్రిస్మస్ సందర్భంగా రోడ్డుపక్కన క్రిస్మస్ సామాగ్రిని విక్రయించే చాలామంది వ్యాపారులను మతమార్పిడి పనులు చేస్తున్నారనే ఆరోపణతో కొట్టారు. ఒరిస్సాలోని కియోంఝర్‌లో పాస్టర్ స్టెయిన్స్‌ను, ఆయన ఇద్దరు మైనర్ కుమారులతో సజీవ దహనం చేయడం అత్యంత భయంకరమైన చర్య.

ఘర్ వాపసిపై దృష్టి కేంద్రీకరించటం అనేది మత సంస్థలు, దాని అనుబంధ సంస్థలు ఆడుతున్న విభజన ఆట పునరుద్ధరణ. ఘర్ వాపసి అనేది బెదిరింపుల ద్వారా చేసే బలవంతపు మత మార్పిడి. జమాత్ –ఎ–హింద్ మౌలానా మదాని ఈ చర్యను తీవ్రంగా ఖండిస్తూ వారు ముస్లింలు, ముస్లింలుగానే ఉంటారు అన్నారు. ఇదే తరహాలో లవ్ జిహాద్ ప్రచారం జరుగుతోంది. ఈ దిశలో ప్రచారం కోసం అత్యంత మత ప్రచార సినీమా కేరళ స్టోరీ 2 ట్రైలర్‌లో హిందూ అమ్మాయిలను బుట్టలో వేసుకొని వివాహం చేసుకొని, వారిని మతం మార్పించేందుకు ముస్లిం యువతను ప్రోత్సహించే ఒక వ్యవస్థీకృత ప్రయత్నం జరుగుతున్నట్లు చిత్రించారు. కేరళ పోలీసుల దర్యాప్తులో అది అబద్ధమని తేలింది. ట్రైలర్ దీనంతటిని దారుణంగా వక్రీకరించిన, ద్వేషపూరిత శైలిలో చూపిస్తుంది. ఈ కేరళ స్టోరీ 2 ప్రచార ప్రయోజనాల కోసం నిర్మించిన మరో చిత్రం. దాని క్రూరత్వం చాలా నీచమైనది. ఇంతకు ముందు వచ్చిన కేరళ స్టోరీ లాగే ఇది కూడా వాస్తవికతకు దూరంగా ఊహాత్మక సమాచారం ఆధారంగా రూపొందించబడింది. హదియా (ఇస్లాం మతంలోకి మారిన అఖిల) కేసు ముస్లిం యువత హిందూ అమ్మాయిలను ప్రలోభపెట్టే కథనం ఎంత బూటకమో చూపించింది. అది ఆమె స్వేచ్ఛాయుతమైన ఎంపిక అని చెప్పింది.

ఈ చిత్రం ఆధిపత్య మత సంస్థ విభజన రాజకీయాలకు అదనంగా, అది మన దేశ సౌభ్రాతృత్వ ప్రాథమిక సూత్రాలను ఉల్లంఘిస్తూ, అత్యంత స్వేచ్ఛారహిత సమాజం వైపు ఏ విధంగా తీసుకువెళ్తున్నదో చూపిస్తుంది. 'ఘర్ వాపసి' కోసం పిలుపులు, ఇలాంటి సినిమాలు భారత రాజ్యాంగ విలువలను, భారతదేశ భావోద్వేగ ఐక్యతకు ఆధారమైన సర్వామోద సంస్కృతితో కూడిన భారతీయ ప్రత్యేక స్వభావాన్ని పూర్తిగా ఉల్లంఘిస్తున్నాయి.

*(ఐపిఎ సర్వీస్)*

# ఎవరు జాతిపిత?



ఎస్.బాబు
సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు
9951801191

నోబెల్ శాంతి బహుమతి, డాక్టరేట్, పరమవీరచక్ర, పద్మశ్రీలు రావాలంటే ఆయా రంగాలలో నిష్ణాతులై ఉండాలి. దానితోపాటు అవి పొందటానికి కొన్ని అర్హతలు, నియమ నిబంధనలుంటాయి. అపుడు మాత్రమే వాటిని అందుకోగలం. 2025లో నోబెల్ శాంతి బహుమతి తనకే కావాలని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ చేయని ప్రయత్నం లేదు. ఆయన చాలా యుద్ధాలు ఆపానని, ప్రపంచశాంతి కోసం ప్రయత్నించానని, నోబెల్ శాంతి బహుమతి తనకు రాకపోతే అమెరికాకే అవమానమని తన కోరికను దేశానికి రుద్దే ప్రయత్నం చేశారు. ఆయన పేరు ఈ బహుమతికి పరిగణించడం లేదని, ధైర్యం, విశ్వసనీయత లాంటి లక్షణాలు కలిగినవారు మాత్రమే దీనికి అర్హులని ఆ కమిటీ ఛైర్మన్ స్పష్టం చేయడంతో పాటు ట్రంప్ పేరును అర్హతల లిస్టులో కూడా తీసుకోలేదు. అమెరికా మొదటి అధ్యక్షుడు జార్జ్ వాషింగ్టన్‌ను ఆ దేశ ప్రజలు జాతిపిత అని సంబోధిస్తారు. ఇకనుండి తననే అమెరికా జాతిపిత అని పిలవాలని ట్రంప్ ఆదేశాలు ఇచ్చినా ఆశ్చర్యం లేదు.

మనందరికీ తెలిసిన జాతిపిత మహాత్మా గాంధీ. మహాత్మ అనే బిరుదును 1915లో రవీంద్రనాథ్ టాగూర్ ఇచ్చారు. ఇది బ్రిటిష్ వారు ఇచ్చింది కాదు. 06.07.1944లో సుభాష్ చంద్రబోస్ ఒక రేడియో ప్రసంగంలో గాంధీని జాతిపిత అనడం జరిగింది. ఇది కూడా ప్రభుత్వం ఇచ్చింది కాదు. అప్పటికి దేశానికి స్వతంత్రం కూడా రాలేదు. జాతీయంగా, అంతర్జాతీయంగా గాంధీ చేసిన ఉద్యమాలకు, ఆయన అనుసరించిన జీవనవిధానం, ఆయన వ్యక్తిత్వం, నిరాడంబరత, అహింసా పరమో ధర్మ అనే సిద్ధాంతం వల్ల ప్రజలు ఆయన్ని జాతిపితగా ఆమోదించారు. గాంధీ పుట్టిన రోజు అక్టోబర్ 2 ను అంతర్జాతీయ అహింసా దినోత్సవంగా ప్రకటించి ప్రపంచం ఆయన్ను గౌరవించింది. ఆయన జీవితం తెరచిన పుస్తకం. గాంధీజీ భావాలను చెప్పే 3 కోతులు చెడు వినకు, చూడకు, మాట్లాడకు మనకు ఆదర్శం కావాలి.

మనకు జాతిపిత మహాత్మా గాంధీ అయినట్లుగానే, దక్షిణాఫ్రికా స్వేచ్ఛ, సమానత్వం కోసం పోరాడిన నెల్సన్ మండేలా కూడా ఆ దేశ జాతిపితగా పిలవబడ్డారు. ధైర్యం, దయ, న్యాయం పట్ల అంకితభావం ఉన్న ఈ 6 అడుగుల నీలి మేఘం ప్రపంచాన్ని ప్రేరేపించిన నాయకుడు. 27 సంవత్సరాలు జైలు చీకటి గదిలో పడరాని కష్టాలు పడ్డారు. 1993లో నోబెల్ శాంతి బహుమతి గ్రహీత కూడా. వీటితో పాటు ఆయనపై ఎటువంటి అవినీతి ఆరోపణలు లేవు. ఆయన జీవన విధానంపై మరకలు లేకపోవడం కూడా దక్షిణాఫ్రికా ప్రజలు ఆయన్ను జాతిపితగా గౌరవించడానికి కారణం. వీరే కాకుండా బంగ్లాదేశ్ జాతిపిత షేక్ ముజిబుర్ రహమాన్, పాకిస్తాన్ జాతిపిత మహమ్మద్ ఆలీ జిన్నా ఆ దేశాలకు జాతి పితలుగా పిలువబడుతున్నారు.

అలాగే బి.ఆర్.ఎస్ నాయకుడికి తెలంగాణ జాతిపిత అనే బిరుదు ఇవ్వాలని మొదటగా ఆయన కుమార్తె జాగృతి కార్యాలయం ప్రారం భం చేస్తున్నప్పుడు అన్నారు. తరువాత ఆ కుటుంబంలోని హరీష్ రావు, కెటిఆర్ దీన్ని ప్రోమోలో పెట్టి మౌఖిక ప్రచారం మొదలు పెట్టారు. కెసిఆర్ కు జాతిపిత ఏమిటని తెలంగాణలో పెద్ద రచ్చ జరిగింది. మునిసిపల్ ఎన్నికల సందర్భంగా తెలంగాణ జాతిపిత అనేది బాగా ప్రాచుర్యంలోకి వచ్చింది. ముఖ్యమంత్రేమో 'ఎవరు జాతిపిత – ఎవరికి జాతిపిత' అంటూ ఆయన శైలిలో విరుచుకుపడ్డారు. కెసిఆర్ కూడా దీన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఎప్పుడూ ఒక్క ప్రకటన ఇవ్వకపోగా "సావు నోట్లో తలకాయ పెట్టి తెలంగాణ తెచ్చిన" అని ఎన్నోసార్లు మీడియాలో సన్నాయి నొక్కులు నొక్కారు. ఆయన సావు నోట్లో తలకాయ పెట్టాడో లేదో కానీ శ్రీకాంతచారి ఏకంగా సావునే ఆహ్వానించి అమరుడైనాడు. మరి శ్రీకాంతచారి ఆ రేసులో ఉన్నట్లేనా? ప్రొఫెసర్ కోదండరామ్ కూడా పొలిటికల్ జెఎసిని నడిపిన ఉద్యమకారుడే. మరి జాతిపిత అనే బిరుదుకు ఈయన అర్హుడు కాదా? వీళ్ళ కంటే ముందే తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ "నీళ్ళు, నిధులు, నియామకాలు" స్లోగన్ తో తెలంగాణ ఉద్యమాన్ని ఉధ్రుతలూగించిన మహనీయుడు. కానీ ఏనాడూ పదవిని ఆశించలేదు.

తెలంగాణ స్వేచ్ఛకోసం తన వ్యక్తిగత జీవితాన్ని కూడా త్యాగంచేసి ఆజన్మాంతం బ్రహ్మచారిగానే ఉండిపోయారు. ఆయనకు తెలంగాణ జాతిపిత ఇవ్వాలని ముఖ్యమంత్రికి బిసి జెఎసి నాయకులు ప్రతిపాదనలు కూడా సమర్పించారు. ఈ అందరికంటే ముందే 1969లో కొండా లక్ష్మ ణ్ బాపూజీ తొలి తెలంగాణ ఉద్యమంలో పోరాడి ఆ ఉద్యమానికి మద్దతుగా తన మంత్రి పదవిని త్యాగంచేసిన తెలంగాణ స్వాప్నికుడు. మరి ఆయన అర్హుడు కాదా? బుల్లెట్ దెబ్బలు తిని, గుండు కెదురుగా గుండె నిలిపిన నిరంత ర ఉద్యమకారుడు మన గద్దరన్న అర్హుడు కాదా? కానీ వీరిలో ఎవరూ తమకు తెలంగాణ జాతిపిత కావాలని అడగలేదు, ఒక్క బిఆర్ఎస్ నాయకులు తప్ప. తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) ను భారత రాష్ట్ర సమితి (బిఆర్ఎస్) గా మార్చుకున్నవారు తెలంగాణ జాతిపిత బిరుదు కావాలనడం హాస్యాస్పదం. అయినా ఈ బిరుదులు ప్రభుత్వాలు ఇచ్చేవి కావు.

కాళేశ్వరం ప్రాజెక్టులో జరిగిన అవినీతి కత్తి బిఆర్ఎస్ నాయకుడి మెడపై ఉంది. ఆ ప్రాజెక్టులో పనిచేసిన ఇద్దరు ఇంజనీర్లు 400 కోట్ల అవినీతికి పాల్పడినట్లు రుజువైంది. దోచుకోవడం, దాచుకోవడమే వారి ప్రవృత్తిగా మారిందని ప్రజాభిప్రాయం. గాంధీ సంతానం గురించి ప్రజలకు పెద్దగా తెలియదు. కానీ బిఆర్ఎస్ కుటుంబ సారా కుంభకోణం, కార్ల కుంభకోణం, ఫోన్ టాపింగ్ కుంభకోణాలలో మునిగి తేలుతున్నారని ఎల్‌కెజి పిల్లవాణ్ణి అడిగినా రైమింగ్‌లో చెప్పగలడు. ఫోన్ టాపింగ్ కేసులో బిఆర్ఎస్ నాయకుడి ఇంటికి నోటీసులు పంపితే, జాతిపితకు నోటీసులిస్తారా, ఇది తెలంగాణకే అవమానం అని బిఆర్ఎస్ నాయకులు అనడం చూస్తుంటే ట్రంప్ గుర్తుకొస్తాడు. ఆయన కూడా నోబెల్ శాంతి బహుమతి తనకు రాకపోతే అమెరికాను అవమానించినట్లే అన్నాడు. దేశ, రాష్ట్ర ప్రజల సమస్యలు వీరికి పట్టవు. కాని వీరి సమస్యలను మాత్రం యూనివర్సల్ చెయ్యాలని చూస్తారు. బిఆర్ఎస్ నాయకుడికి పదవీకాంక్ష ఎక్కువ. త్యాగంచేసే గుణం తక్కువ. ఎందుకంటే తెలంగాణ రాష్ట్రానికి మొదటి ముఖ్యమంత్రిగా దళితుడిని చేస్తా అని, తానే సిఎం పీఠం ఎక్కి కూర్చున్నారు. కనీసం రెండవసారి అవకాశం వచ్చినప్పుడు కూడా ఆయన మాట నిలుపుకోవడం కోసం దళితులకో, బిసిలకో ఆ అవకాశం ఇవ్వకపోగా "దళితుడిని ముఖ్యమంత్రి చేస్తాను అన్న మాట EXPIRD MEDICINE" అని సార్ అంటున్నారు. జాతిపిత బిరుదు పొందేవారు పదవులను ఆశించకూడదు. ప్రజలే వారిని పీఠంపై కూర్చోపెట్టాలి. ఏ పదవులు ఆశించి భగత్ సింగ్, రాజగురు సుఖదేవ్ దేశ స్వాతంత్ర్యంకోసం పోరాడారు? ఏ బిరుదుల కోసం వారు ఉరికొయ్యలను ముద్దాడారు? లాల్, బాల్, పాల్ స్వాతంత్ర్యోద్యమంలో మడమ తిప్పని పోరాటాలు చేశారే తప్ప బిరుదులు, పదవులు ఆశించలేదు.

తమ నాయకుడికి జాతిపిత కోసం ఇంత రాద్ధాంతం చేస్తున్న బిఆర్ఎస్ భజనపరులకు భారత రాజ్యాంగం గురించి తెలియదని నేననుకోవడం లేదు. రాజ్యాంగంలోని 18వ అధికరణ బిరుదులను పూర్తిగా రద్దు చేసింది. మిలిటరీకి సంబంధించిన శౌర్యచక్ర, మహావీరచక్ర, పరమవీరచక్ర లాంటివి, విద్యకు సంబంధించిన డాక్టరేట్లు తప్ప ఇతర బిరుదులు ఇవ్వకూడదు. తీసుకోకూడదు. అలా తీసుకోవాలంటే రాష్ట్రపతి అనుమతి తప్పనిసరి అని రాజ్యాంగం చెప్తోంది. ప్రజలలో శాశ్వతమైన హెచ్చుతగ్గులు తెచ్చిపెట్టే ఈ బిరుదులు ఫ్యూడల్ భావజాలంగాను, బ్రిటిష్ సామ్రాజ్యం అవశేషంగా భావించి రాజ్యాంగ నిర్మాతలు ఈ బిరుదు ప్రదానాలను ఎత్తివేశారు. ఈ నేపథ్యంలో మహాత్మా గాంధీ ఒక్కడిని దీనికి మినహాయించి "జాతిపిత" అని ప్రభుత్వం ఇవ్వాల్సిన అవసరం లేదు. అలాచేస్తే అది రాజ్యాంగ విరుద్ధం అవుతుంది. ఇచ్చినా కోర్టులు కొట్టివేస్తాయి.

గాంధీజీని జాతిపిత అని కొందరంటే అనవచ్చు. అది వారి వ్యక్తిగత అభిప్రాయం అవుతుందే తప్ప, ప్రభుత్వం అధికారికంగా ఇచ్చే హోదా కాదు. ఇకపోతే పాఠకులకు ఇక్కడ అనుమానం వస్తుంది. మరి భారతరత్న, పద్మశ్రీ లెందుకిస్తున్నారు? ఇది రాజ్యాంగ విరుద్ధం కాదా? అని. కానేకాదు. ఎందుకంటే భారతరత్న, పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ మొదలైనవి బిరుదులు కాదు. అవార్డులు. వీటిని బిరుదుల్లా పేరుముందు పెట్టుకుని వాడటం చట్ట విరుద్ధం. అలా చేస్తే, ఆ పురస్కారాన్ని ప్రభుత్వం తిరిగి వెనక్కి తీసుకునే అవకాశం ఉంది. కాబట్టి బిఆర్ఎస్ జాతి రత్నాలు వారి నాయకుడికి తెలంగాణ జాతిపిత అనే బిరుదుకు అర్హుడో కాదో పునరాలోచించుకుంటారని ఆశిద్దాం.

# యాదాద్రి జిల్లా కలెక్టర్‌గా అనురాగ్ జయంతి



**ప్రజాపక్షం/యాదాద్రి** : 2015 ఐఎఎస్ బ్యాచ్‌కి చెందిన అనురాగ్ జయంతి యాదాద్రి భువనగిరి జిల్లా నూతన కలెక్టర్‌గా గురువారం పదవి బాధ్యతలు స్వీకరించారు. అనురాగ్ జయంతి గతంలో భోధన్, ఖమ్మం జిల్లాలో సబ్ కలెక్టర్‌గా, రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టర్‌గా, జిహెచ్ఎంసి పరిధిలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్‌గా పని చేశారు. ప్రస్తుతం జిహెచ్ఎంసి రాజేంద్ర నగర్‌లో జోనల్ కమిషనర్‌గా విధులు నిర్వహిస్తున్న అనురాగ్ జయంతి బదిలీపై యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టారు. విద్యా, వైద్య రంగాలతో పాటు అభివృద్ధి, సంక్షేమ ఫలాలు అట్టడుగు ప్రజలకు ప్రాధాన్యత ఇవ్వడం ద్వారా సమగ్ర అభివృద్ధి దిశగా జిల్లా ముందుకు సాగుతుందని యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి అన్నారు.

# 'ఉపాధి' పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్

ఉపాధి పనుల మీద కేంద్ర బృందానికి వివరించిన కలెక్టర్



**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పేరును కేంద్ర ప్రభుత్వం విబిజి రామ్ జీ గా మారుస్తున్న తరుణంలో కేంద్ర గ్రామీణాభివృద్ధి సంస్థ కేంద్ర బృందం సభ్యులు సంజయ్ కుమార్ నేతృత్వంలో తేది.26.02.2026 నుండి 28.06.2026 వరకు సూర్యాపేట జిల్లాలో పర్యటన సందర్భంగా గురువారం జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో సమావేశమయ్యారు. ఇట్టి సమావేశంలో సూర్యాపేట జిల్లాలో జరిగిన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బృంద సభ్యులకు వివరించారు. అనంతరం ఇజిఎస్ పథకాల పనులపై జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్ ప్రదర్శనను కేంద్ర బృందం, కలెక్టర్ తిలకించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కె సీతారామారావు, డిప్యూటి సిఇఓ శిరీష, కేంద్ర బృందం సభ్యులు పాల్గొన్నారు.

# ప్రమోషన్‌తోపాటు బాధ్యతల పెరుగుదల



**ప్రజాపక్షం/సూర్యాపేట టౌన్** : ఉద్యోగోన్నతితో పాటుగా బాధ్యతలు పెరుగుతాయని జిల్లా ఎస్‌పి కె నరసింహ అన్నారు. కోదాడ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నందు కానిస్టేబుల్‌గా పని చేస్తున్న కె. విద్యాసాగర్ హెడ్‌కానిస్టేబుల్‌గా పదోన్నతి పొందిన సందర్భంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా ఎస్‌పి చేతుల మీదుగా ప్రమోషన్ ఉత్తర్వులను అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బాధ్యతలకు అనుగుణంగా విధుల నిర్వహణలో అప్రమత్తంగా ఉండి ప్రజలకు ఉత్తమ సేవలు అందించి ప్రజల మన్ననలు పొందాలన్నారు. పోలీసు శాఖకు మంచిపేరు తేవాలని సూచించారు. క్రమశిక్షణతో మెలగాలని, తోటి సిబ్బందిని గౌరవించాలని సమన్వయంతో ముందుకెళ్లాలన్నారు. ఈ కార్యక్రమంలో పోలీసు సంఘం అధ్యక్షులు రామచందర్ గౌడ్ సిబ్బంది ఉన్నారు.

# ఇఫ్తార్ విందుకు విస్తృత ఏర్పాట్లు

అధికారులతో ఎమ్మెల్యే వేముల వీరేశం సమీక్ష



**ప్రజాపక్షం/నకిరేకల్** : పవిత్ర రంజాన్ మాసం సందర్భంగా ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించనున్న ఇఫ్తార్ విందు కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని ఎమ్మెల్యే వేముల వీరేశం అధికారులను ఆదేశించారు.గురువారం నకిరేకల్ పటణంలోని క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గ పరిధిలోని సంబంధిత శాఖల అధికారులతో పాటు ముస్లిం మత పెద్దలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్తార్ విందు కార్యక్రమం శాంతియుత వాతావరణంలో సజావుగా సాగేందుకు ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు.ముస్లిం సోదర సోదరీమణుల ఆధ్యాత్మిక భావాలను గౌరవిస్తూ తాగునీరు,విద్యుత్,పారిశుద్ధం,భద్రత తదితర అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు.హాజరయ్యే ప్రతి ఒక్కరికీ ఎటువంటి అసౌకర్యం కలగకుండా చూడాలని అధికారులను ఆదేశించారు.ఈకార్యక్రమంలో ఎంపిడిఓలు వెంకటేశ్వరరావు,నాగలక్ష్మి,జ్ఞాన ప్రకాష్ రావు, ఉమేష్, ఎంపీఓ కోటేష్,హాశీల్దార్ యాదగిరి,పుష్పలత మరి కొంతమంది అధికారులు ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

# ఇంటర్మీడియట్ పరీక్ష కేంద్రాల తనిఖీ



**ప్రజాపక్షం/యాదాద్రి** : భువనగిరిలోని టైమ్స్ కళాశాల మరియు భువనగిరిలోని శ్రీ చైతన్య కళాశాలలో జరుగుతున్న ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాలను అదనపు కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలు ప్రశాంత వాతావరణంలో కొనసాగుతున్నాయా అనే అంశంపై అదనపు కలెక్టర్ పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ, విద్యార్థులకు కల్పించిన సౌకర్యాలు, భద్రతా ఏర్పాట్లు, ప్రశ్నాపత్రాల పంపిణీ విధానం తదితర అంశాలను పరిశీలించారు. పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాల పని తీరు, తాగునీరు, విద్యుత్, కూర్చునే ఏర్పాట్లు సక్రమంగా ఉన్నాయా అని అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఇన్విజిలేటర్లు విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి మాల్ప్రాక్టీస్ జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

# 245 మంది ఇంటర్ పరీక్షకు గైర్హాజరు

**ప్రజాపక్షం/సూర్యాపేట కలెక్టరేట్** : రెండవ రోజు గురువారం తెలుగు, సాంస్కృతం, ఉర్దూ ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు జిల్లావ్యాప్తంగా ప్రశాంతంగా జరిగాయి. మొత్తం విద్యార్థులు 7,312 మంది పరీక్షలకు హాజరు కావల్సి ఉంది. ఇందులో జనరల్ 5,861, ఒకేషనల్ 1,451 మంది కాగా జనరల్‌లో 145, ఒకేషనల్‌లో 100 మంది మొత్తం 245 మంది పరీక్షకు డుమ్మా కొట్టారు. దీంతో జనరల్‌లో 5,716, ఒకేషనల్‌లో 1,351 పరీక్షలకు హాజరు కాగా 96.64 శాతం హాజరైన్నట్లు జిల్లా ఇంటర్ బోర్డు అధికారి వి. భాను నాయక్ అధికారికంగా ప్రకటించారు.

# డాక్టర్లు తెల్ల కోటుకు పరిమితం కావొద్దు

పేదలకు మెరుగైన వైద్యం అందించాలి

నల్లగొండ మెడికల్ కళాశాలను రాష్ట్రంలో నెంబర్-1చేస్తా

ప్రభుత్వ వైద్య కళాశాల వార్షికోత్సవం అద్వితీ-2026లో మంత్రి కోమటిరెడ్డి హామీ



**ప్రజాపక్షం/నల్లగొండ** : డాక్టర్లు తెల్ల కోటుకు మాత్రమే పరిమితం కాకుండా,మానవతా దృక్పథంతో పేద ప్రజలకు వైద్య సేవలు అందించాలని రాష్ట్ర రోడ్లు,భవనాలు,సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండ ప్రభుత్వ వైద్య కళాశాలలో నిర్వహించిన వార్షికోత్సవం అద్వితీ-2026 కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరై మంత్రి మాట్లాడుతూ వైద్య వృత్తి అన్ని వృత్తుల కంటే పవిత్రమైందని పేర్కొన్నారు.వైద్య విద్యార్థులు సబ్జెక్టులతో పాటు మానవత్వాన్ని కూడా నేర్చుకోవాలని,తెల్ల కోటు బాధ్యతకు ప్రతీక అని అన్నారు. కళాశాలలో ఏవైనా సమస్యలు ఉంటే పరిష్కరించేందుకు సిద్ధంగా ఉన్నానని హామీ ఇచ్చారు.విద్యార్థుల సౌకర్యార్థం రెండు ఏసీ బస్సులను మంజూరు చేస్తున్నట్లు ప్రకటించి, నెలలోపు అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ఇటీవలే ఏఐజి ఆసుపత్రి డాక్టర్ నాగేశ్వరరెడ్డిని ప్రభుత్వ వైద్య కళాశాలకు ఆహ్వానించినట్లు వెల్లడించారు. అలాగే పీజీ విద్యార్థులను పరిశోధన కోసం ప్రతి సంవత్సరం 45 మందిని తమ ఆసుపత్రిలో తీసుకునేందుకు అంగీకరించినట్లు, దీనికి సంబంధించిన అవగాహన ఒప్పందం త్వరలో కుదుర్చుకుంటామని చెప్పారు. విద్యాభివృద్ధికి ప్రాధాన్యం అన్నారు. పేద విద్యార్థుల చదువుకు అవసరమైన సహాయం అందిస్తామని,బొట్టుగూడా ప్రభుత్వ పాఠశాలలు,ప్రతీక్ ప్రభుత్వ జూనియర్ కళాశాల అభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేసినట్లు తెలిపారు. పట్టణంలోని మరికొన్ని పాఠశాలలను కార్పొరేట్ తరహాలో తీర్చిదిద్దుతామని పేర్కొన్నారు.రూ.900 కోట్లతో అవుటర్ రింగ్ రోడ్ నిర్మాణం చేపట్టినట్లు,భవిష్యత్తులో నల్లగొండను స్మార్ట్ సిటీగా,మోడల్ సిటీగా అభివృద్ధి చేస్తామని మంత్రి వెల్లడించారు.ఈ కార్యక్రమంలో మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి,రెవిన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ అమీర్ అశ్రఫ్ అలీ,కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.అనంతరం వివిధ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మంత్రి బహుమతులు అందజేశారు.

# భువనగిరి అభివృద్ధికి నిధుల వరద తెస్తాం

ఎంపి చామల కిరణ్ కుమార్ రెడ్డి



**ప్రజాపక్షం/యాదాద్రి** : తెలంగాణ రాష్ట్రంలోనే భువనగిరి పట్టణానికి ఒక ప్రత్యేక గుర్తింపు ఉందని, పట్టణ సర్వతోముఖాభివృద్ధికి ప్రజాప్రతినిధులంతా సమన్వయంతో పనిచేయాలని భువనగిరి పార్లమెంట్ సభ్యులు చామల కిరణ్ కుమార్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం భువనగిరి మున్సిపల్ కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన మున్సిపల్ చైర్మన్ తంగెళ్లపల్లి శ్రీవాణి రవి కుమార్ పదవీ బాధ్యతల స్వీకరణ కార్యక్రమం అధికారికంగా, అత్యంత ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డితో కలిసి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భువనగిరి మున్సిపాలిటీపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడంలో కీలక పాత్ర పోషించిన ఎమ్మెల్యే అనిల్ రెడ్డిని, ఇందుకు కృషి చేసిన నాయకులను, కార్యకర్తలను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. మున్సిపల్ శాఖ స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వద్దే ఉన్నందున, ప్రజాప్రతినిధులమంతా కలిసి సమన్వయంతో పనిచేసి భువనగిరి పట్టణానికి గరిష్టంగా నిధులు మంజూరు చేయిస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్ర నిధులతో పాటు కేంద్ర ప్రభుత్వం నుండి పట్టణ అభివృద్ధికి వచ్చే నిధులను కూడా పెద్ద ఎత్తున తీసుకురావడానికి కృషి చేస్తానని ఆయన స్పష్టం చేశారు. నూతనంగా ఎన్నికైన చైర్మన్, కౌన్సిల్ సభ్యులందరినీ కలుపుకుని పారదర్శకంగా పాలన అందిస్తూ ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని సూచించారు. అనంతరం ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ భువనగిరి పట్టణాన్ని సుందరీకరించేందుకు ప్రత్యేక శ్రద్ధ చూపుతామని భరోసా ఇచ్చారు. పట్టణంలోని అన్ని రోడ్లను పూర్తిగా అభివృద్ధి చేస్తామని, ముఖ్యంగా భువనగిరి కోట అభివృద్ధి కోసం వచ్చిన నిధులను సక్రమంగా వినియోగించి పర్యాటక రంగంలో పట్టణాన్ని తీర్చిదిద్దుతామన్నారు. భువనగిరిని ఒక ఆదర్శ నగరంగా మార్చడానికి మున్సిపల్ పాలకవర్గం కంకణబద్ధులై పనిచేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మన్ అవేస్ చిస్తీ, మున్సిపల్ వైస్ చైర్మన్ మంజుల, మార్కెట్ కమిటీ చైర్ పర్సన్ రేఖ బాబురావు, మున్సిపల్ కౌన్సిల్ సభ్యులు, కాంగ్రెస్ ముఖ్య నేతలు, కార్యకర్తలు , మున్సిపల్ సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొని నూతన చైర్మన్, వైస్ చైర్మన్లకు శుభాకాంక్షలు తెలిపారు.

# విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దాలి

కేంద్ర సాంస్కృతిక శాఖ, పిఎం శ్రీ పాఠశాలల జాయింట్ సెక్రటరీ,నోడల్ అధికారి కమలేష్ కుమార్ మిశ్రా




**ప్రజాపక్షం/నల్లగొండ:** సమాజానికి రాబోయే తరాలను తయారు చేసే గురుతర బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని కేంద్ర సాంస్కృతిక శాఖ, పీఎం శ్రీ పాఠశాలల జాయింట్ సెక్రటరీ,నోడల్ అధికారి కమలేష్ కుమార్ మిశ్రా అన్నారు. జిల్లాలో పిఎం శ్రీ పాఠశాలల అధ్యయనం నిమిత్తం రెండు రోజుల పర్యటనకు వచ్చిన ఆయనకు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ కలెక్టర్ కార్యాలయంలో పూలమొక్క అందజేసి స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమీక్ష సమావేశంలో మాట్లాడుతూ సమాజంలో గురువులకు ఉన్న గౌరవం అపారమని, అదే సమయంలో భవిష్యత్ తరాలను తీర్చిదిద్దే బాధ్యత కూడా వారిపైనే ఉందన్నారు.ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీ,సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతున్నఈ కాలంలో పీఎం శ్రీ పాఠశాలల ద్వారా అందుతున్న సౌకర్యాలను సద్వినియోగం చేసుకొని విద్యార్థులను ఎప్పటికప్పుడు అప్‌డేట్‌గా ఉంచాలని సూచించారు. కంప్యూటర్లు, టింకరింగ్ ల్యాబ్‌లను సమర్థవంతంగా వినియోగించాలని, ముందుగా ఉపాధ్యాయులు కంప్యూటర్ పరిజ్ఞానం పెంపొందించుకోవాలని తెలిపారు.జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ మాట్లాడుతూ పీఎం శ్రీ పాఠశాలల కింద మంజూరైన నిధులతో అదనపు తరగతి గదులు, కంప్యూటర్ ల్యాబ్‌లు,సైన్స్ ల్యాబ్‌లు,వాననీటి నిల్వ కట్టడాలు,టాయిలెట్ బ్లాక్‌లు నిర్మాణంలో ఉన్నాయని తెలిపారు. జిల్లాకు మంజూరైన 98 పనుల్లో 20 పూర్తి కాగా, మిగతావి త్వరలో పూర్తిచేస్తామని చెప్పారు.జిల్లాలోని 43 పీఎం శ్రీ పాఠశాలల్లో చేపట్టిన కార్యక్రమాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు తెలియజేశారు.ఈ సమావేశంలో రాష్ట్ర విద్యాశాఖ ప్రతినిధి ఉషారాణి,డీఈఓ బిక్షపతి, జెడ్పిసిఈఓ శ్రీనివాసరావు,పీఎం శ్రీ పాఠశాలల ప్రిన్సిపాళ్లు పాల్గొన్నారు.

# నాగార్జున సాగర్‌కు టూరిజం టచ్..



సమగ్ర అభివృద్ధికి ప్రభుత్వ గ్రీన్ సిగ్నల్

**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** నాగార్జున సాగర్ ప్రాంతాన్ని రాష్ట్రంలో ప్రముఖ ప్రత్యేక పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయడానికి ప్రభుత్వం సమగ్ర కార్యచరణ చేపట్టినట్లు అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్ తెలిపారు. గురువారం కలెక్టర్ కార్యాలయంలో టూరిజం,ఆర్కియాలజీ, రెవెన్యూ,అటవీ శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో ప్రకృతి,ఆధ్యాత్మిక,వారసత్వ సంపదలు సమృద్ధిగా ఉన్నాయని పేర్కొంటూ బుద్ధవనం,ఛాయా సోమేశ్వరాలయం, పచ్చల సోమేశ్వరాలయం,దేవరకొండ కోట,ఫణిగిరి బౌద్ధ స్థలం,నక్కలగండి ప్రాజెక్ట్,ఏలేశ్వర ఆలయం వంటి కేంద్రాలను అభివృద్ధి చేయనున్నట్లు తెలిపారు. దేవాలయ ఉత్సవాలు,జాతరలు,బతుకమ్మ,బోనాలు వంటి పండుగల రద్దీ వివరాలు సేకరిస్తూ, ఒగ్గుకథ, తోలుబొమ్మలాట వంటి జానపద కళారూపాలను పర్యాటకంతో అనుసంధానం చేయనున్నారు.ఈ సమావేశంలో రాఘవేంద్ర (బుద్ధిష్ట్ సర్క్యూట్ టూరిజం కన్సలెంట్),ఓం ప్రకాష్,ఏఎస్‌పి రమేష్, ఆర్‌డిఓలు అశోక్ రెడ్డి,శ్రీదేవి,రమణారెడ్డి, జిల్లా యువజన,టూరిజం,క్రీడల అధికారి అక్బర్ అలీ తదితర అధికారులు పాల్గొన్నారు.

# నేటికీ శ్రమదోపిడీకి గురవుతున్న ఆసుపత్రి కార్మికులు

మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి




**ప్రజాపక్షం/నల్లగొండ టౌన్:** ఈనెల 28వ తేదీన వరంగల్ లో జరుగుతున్న ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న శానిటేషన్ పేషెంట్ కేర్ సెక్యూరిటీ గార్డ్ కార్మికుల రాష్ట్ర మహాసభను జయప్రదం చేయాలని మెడికల్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(ఎఐటియుసి) రాష్ట్ర కార్యదర్శి పల్లా దేవేందర్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం నల్లగొండలోని జిల్లా కేంద్ర ఆస్పత్రిలో రాష్ట్ర మహాసభ వాల్ పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి ప్రభుత్వ ఆసుపత్రిలో కార్మికులుగా పనిచేస్తున్న కార్మికులు పర్మినెంట్‌కు నోచుకోలేదని నేటికీ శ్రమదోపిడికి గురవుతున్నారని కావున ఆసుపత్రి కార్మికులను వెంటనే రెగ్యులర్ చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం అందించాలని సుప్రీంకోర్టు తీర్పు ఇచ్చి దశాబ్దాలు గడుస్తున్న కోర్టు తీర్పులను కూడ అమలు చేయకపోవడం ఎంతో బాధాకరమని అన్నారు.ప్రస్తుతం ప్రభుత్వ వైద్యరంగంలో ఏజెన్సీల విధానం ద్వారా కాంట్రాక్టు ఔట్సోర్సింగ్ సిబ్బంది వేతనాలు అందిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం ఏజెన్సీల విధానం రద్దుచేసి తక్షణమే కార్పొరేషన్ ద్వారా నేరుగా కార్మికులకు జీతభత్యాల అందే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో యూనియన్‌నాయకులు ఎం. యాదగిరి,పిఎల్లమ్మ,పద్మ,అన్నపూర్ణ,లింగస్వామి,మధు. లక్ష్మణ్,భాగ్యమ్మ,అనూష,లక్ష్మీ,సబిత,అలివేలు పాల్గొన్నారు.

# 'మహావిష్ణువు'గా నరసింహుడు

**ప్రజాపక్షం/యాదగిరిగుట్ట** : యాదాద్రి శ్రీ లక్ష్మీ నరసింహస్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు అత్యంత కనులపండువగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం స్వామివారు శ్రీమహావిష్ణువు అలంకారంలో గరుడ వాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయంలో నిత్యారాధనల అనంతరం, శ్రీ పాంచరాత్రాగమ శాస్త్రానుసారముగా అర్చక బృందం ఈ వేడుకను నిర్వహించారు.శ్రీమహావిష్ణువు అలంకారంలో మెరిసిపోతున్న స్వామివారిని వేద స్వరూపుడైన గరుత్మంతునిపై అధిష్టింపజేసి తిరువీధులలో ఊరేగించారు. భక్త రక్షణార్థం యోగనిద్రలో ఉండి జగత్తును కాపాడే ఆ శ్రీమన్నారాయణుడే, లోక కంటకులైన దానవులను సంహరించే మహావిష్ణువుగా ఇక్కడ కొలువుదీరారని పురాణాలు చెబుతున్నాయి. భగవంతుడి తత్త్వాన్ని భక్తుల వద్దకు చేరవేసే గరుడ వాహన సేవను దర్శించుకునేందుకు భక్తులు భారీగా తరలివచ్చారు. ఈ వేడుకల్లో పలువురు ఉన్నతాధికారులు మరియు ప్రముఖులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈవో భవానీశంకర్ కార్యనిర్వహణాధికారి, బి.నరసింహామూర్తి ఆలయ అనువంశిక ధర్మకర్త, ఎమ్.హనుమంతరావు జిల్లా కలెక్టర్ యాదాద్రి భువనగిరి, ఇరిగేషన్ కమీషనర్ వీరితో పాటు ఉప కార్యనిర్వహణాధికారులు, సహాయ కార్యనిర్వహణాధికారులు, పర్యవేక్షకులు మరియు ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



# ఇందిరమ్మ ఇండ్ల పనులను వేగిరం చేయండి

మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

వచ్చేనెలలో ప్రారంభించేందుకు ఏర్పాట్లు పూర్తి చేయాలి

రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా 2,160 ఇండ్లను ఒకేచోట నిర్మాణం

మార్చి మొదటి వారంలో సిఎం చేతుల మీదుగా ప్రారంభోత్సవం

ప్రతీ బ్లాక్‌నూ సందర్శించి పనుల పురోగతి పరిశీలన



**ప్రజాపక్షం/హుజూర్‌నగర్:** రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఐదు లక్షల ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయించి, రూ.22,500 కోట్ల బడ్జెట్‌తో పనులు వివిధ దశల్లో ఉన్నాయని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం హుజూర్‌నగర్‌లోని రామస్వామి గుట్ట వద్ద 110 ఎకరాలలో 125 కోట్ల రూపాయలతో నిర్మిస్తున్న 2160 ఇందిరమ్మ ఇండ్ల ప్లాట్ల పెండింగ్ పనుల పురోగతిపై జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్‌తో కలిసి ప్రతి బ్లాక్ కాలినడకన తిరుగుతూ అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, ఎలక్ట్రిసిటి, మొక్కలు నాటడం, వైట్ వాస్ పనులను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నాడు గృహ నిర్మాణ శాఖ మంత్రిగా ఉన్న సమయంలో హుజూర్‌నగర్ నియోజకవర్గంలో నిరుపేదలు, వ్యవసాయ కూలీలు, రైస్ మిల్లుల్లో పనిచేసే వారికి ఆశ్రయం కల్పించాలన్న లక్ష్యంతో 110 ఎకరాల దేవాలయ భూములను మార్కెట్ రేట్‌కు కొనుగోలు చేసి పనులు ప్రారంభించడం జరిగిందని, కాని రాష్ట్ర విభజన తర్వాత ఆనాటి ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మధ్యలోనే నిలిపివేసి డంపింగ్‌యార్డు మాదిరిగా మార్చిందని మండిపడ్డారు. తిరిగి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక 14 సంవత్సరాల నా పట్టుదల, కృషి ఆకాంక్షలతో తిరిగి పనులను ప్రారంభించి ప్రాజెక్టును పూర్తి చేసి పేద ప్రజలకు అందించడం నా చిరకాల స్వప్నం నెరవేరుతుందని అన్నారు. దీనిని నా అదృష్టంగా భావిస్తున్నానని, ఒక ప్లాట్‌కు రూ. 6లక్షలు ఖర్చు చేయడం జరిగిందని, భూమి ప్లాట్‌తో కలిపి పది లక్షలు ఖర్చు అవుతుందని ఒక ప్లాట్ విస్తీర్ణం 325 స్క్వేర్ ఫీట్ ఉంటుందని వివరించారు. రూ.75 కోట్లతో అంతర్గత రోడ్డు, ఎలక్ట్రసిటి, తాగునీరు, డ్రైనేజీ వ్యవస్థ కోసం ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించి పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నట్లు, అవసరమైతే రాత్రి, పగలు కూడా ఎక్కువ పనివారిని పెట్టి మార్చి మొదటి వారం కల్లా పెండింగ్ పనులు పూర్తి చేయడం జరుగుతుందని వెల్లడించారు. మార్చి మొదటివారంలో రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా మొదటి విడతలో హుజూర్‌నగర్ లోకల్‌లో ఇండ్లు లేని వారికి నిరుపేదలు, తెల్లరేషన్‌కార్డు కలిగిన 1000 మంది లబ్ధిదారులకు పంపిణీ చేయుటకు ఏర్పాట్లు చేస్తున్నామని ప్రకటించారు. రెండవ విడతలో హుజూర్‌నగర్ నియోజకవర్గంలోని పేదలకు అందించడం జరుగుతుందని ఎంపిక ప్రక్రియలో ఆర్డీవో, మున్సిపల్ కమిషనర్, ఎంపిడివో, తహసిల్దార్ లు పారదర్శకంగా నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని ఆదేశించారు. ఎంపిక విషయంలో ఎలాంటి అవినీతికి అవకతవకలకు పాల్పడిన కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని మంత్రి తెలిపారు. ఈ విలేకరుల సమావేశంలో జిల్లా ఎస్‌పి కె.నర్సింహా, మున్సిపల్ చైర్మన్ దొంతగాని శ్రీనివాస గౌడ్, వైస్ చైర్మన్ తన్నీరు మల్లిఖార్జున్‌రావు, మార్కెట్ కమిటి చైర్మన్, హౌజింగ్ పిడి సిద్దార్థం, అర్టికల్చర్ పిడి నాగయ్య, ఇతర జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# క్రీడలతోనే ఉల్లాసం

**ప్రజాపక్షం/దేవరకొండ:** దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్, మేరా భారత్ నల్గొండ వారి ఆధ్వర్యంలో గురువారం జిల్లా స్థాయి స్పోర్ట్స్ మీట్ ను దేవరకొండ స్పోర్ట్స్ అసోసియేషన్ భవనంలో కబడ్డీ, షటిల్, రన్నింగ్ క్రీడలను నిర్వహించారు. ముఖ్య అతిథులుగా దేవరకొండ ఎంఎల్‌ఏ బాలు నాయక్ హాజరై క్రీడలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఎంఎల్‌ఏ బాలునాయక్ మాట్లాడుతూ క్రీడాకారులు క్రీడా స్ఫూర్తితో మెలగాలని క్రీడాకారుల స్టేడియాలకై కృషి చేస్తానని, అతి త్వరలో స్టేడియాలు నిర్మాణం చేపడతానని ఆయన తెలిపారు. అనంతరం బహుమతి ప్రధానోత్సవానికి దేవరకొండ మున్సిపల్ చైర్మన్ పున్న శైలజ వెంకటేశ్వర్లు, డిఎస్పి శ్రీనివాస్‌రావు, అధ్యక్షులు ఎన్‌విటి, ప్రధాన కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, ఆలంపల్లి నర్సింహా, మేరా భారత్ నల్గొండ జిల్లా అధికారి రాజేష్‌లు క్రీడాకారులకు బహుమతులు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈకార్యక్రమంలో రాజకుమార్‌రెడ్డి, రమేష్, మై భారత్ నల్గొండ స్టాప్ కొండల్, వెంకటేశ్వర్లు, గోపి, వినోద్, రాధాకృష్ణ, పిఈటిలు రజిత, మహేశ్వరి, అనూష, రామ్‌చందర్, వెంకన్న, క్రీడాకారులు, కళాకారులు పాల్గొన్నారు.





## మున్సిపల్ చైర్‌పర్సన్‌కు పారామెడిక్స్ అసోసియేషన్ సభ్యుల సన్మానం

**ప్రజాపక్షం/కల్వకుర్తి :** కల్వకుర్తి మున్సిపాలిటీ చైర్‌పర్సన్‌గా బ్యాంగి రత్న మాల ఆనంద్‌కుమార్ పదవీ బాధ్యతలు చేపట్టడంతో గురువారం కల్వకుర్తి పారామెడిక్స్ అసోసియేషన్ సభ్యులు పూలమాల శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో కమిటీ పారామెడిక్స్ అసోసియేషన్ సభ్యులు స్వామి, చారి, శ్యాంబాబు, కాంగ్రెస్ నాయకులు గోపిరెడ్డి, రాంరెడ్డి పాల్గొన్నారు.



## ఘనంగా వీరసావర్కర్ వర్ధంతి వేడుకలు

**ప్రజాపక్షం/నారాయణపేట :** హిందుత్వ సిద్ధాంతాన్ని ప్రచారం చేసిన ప్రముఖ వ్యక్తి వీర సావర్కర్ అని విశ్వహిందూపరిషత్ జిల్లా కార్యదర్శి కన్న శివకుమార్ అన్నారు. గురువారం నారాయణపేట జిల్లా కేంద్రంలో పాత బస్టాండు చౌరస్తాలో వీరసావర్కర్ వర్ధంతి వేడుకలను విశ్వహిందూ పరిషత్, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. చౌరస్తాలో ఉన్న సావర్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ వీర సావర్కర్ 1883 సంవత్సరం నాసిక్ సమీపంలోని భాగూర్ గ్రామంలో జన్మించాడన్నారు. వీర సావర్కర్ భారత స్వాతంత్ర్య సమరయోధుడు, రచయిత, రాజకీయ నాయకుడన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా విప్లవ కార్యకలాపాలు చేశాడని తెలిపారు. అభినవ భారత్ అనే విప్లవ సంస్థను స్థాపించాడనీ పేర్కొన్నారు. బ్రిటిష్‌కు వ్యతిరేకంగా పోరాడి జైలు జీవితాన్ని కూడా గడిపాడని తెలిపారు. వీర సావర్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మురళిభట్టడ్, రవికుమార్ గౌడ్, అరవింద్, కడుదాస్, ప్రవీణ్, శ్రావణ్, మ్యాతరి ఆకాశ్, చక్రి, భోగం అన్వేష్, గిరీష్, బాలరాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.



## విద్యార్థులే.. ఉపాధ్యాయులైన వేళ

**ప్రజాపక్షం/పెద్దకొత్తపల్లి :** మండలంలోని కల్వకోల్, సాతాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు ఉపాధ్యాయులైన వేళ సందడి గురువారం నెలకొంది. విద్యార్థిని విద్యార్థులు ఉపాధ్యాయులై విద్యార్థులకు పాఠాలు బోధించి గ్రామప్రజలను ఆకట్టుకున్నారు. వనిత, వాసవిక్లబ్ ఆధ్వర్యంలో తమ ప్రతిభ ఉపాధ్యాయులకు విద్యార్థులు క్లబ్ మండల అధ్యక్షులు సోమిశెట్టి ప్రేమ్‌కుమార్, సోమిశెట్టి లలిత ఎగ్జామ్స్‌ప్యాడ్స్ బహుమతులను అందజేశారు.

## కాలం చెల్లిన జీవో 25ను సవరించాలి

### తపస్ జిల్లా శాఖ డిమాండ్

**ప్రజాపక్షం/మక్తల్ :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో హేతుబద్ధీకరణ చేయ్యాలని ఆలోచించినందున వెంటనే అందుకు అనుగుణంగా కాలం చెల్లిన జీవో 25 ను ప్రస్తుత పరిస్థితులకు అనుగుణంగా సవరించి కొత్త జీవో విడుదల చేయాలని తపస్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు నరసింహ రవీందర్ డిమాండు చేశారు. ప్రతి పాఠశాలలో 20 మంది విద్యార్థులకు ఒక ఉపాధ్యాయుడిని కేటాయించాలని, ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాల ఉండాలి అనే ప్రభుత్వ విధానానికి అనుగుణంగా 1:19 ఇద్దరూ ఉపాధ్యాయులు ఉండాలని పేర్కొన్నారు. సాధ్యమైనంతవరకు ప్రతి ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండేలా చూస్తేనే ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు బలోపేతం అయ్యే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు. ఉపాధ్యాయులు దీర్ఘకాల సెలవులు పెట్టిన సందర్భంలో వారి స్థానంలో అర్హత గల వారిని ప్రత్యేక వాలంటీర్లుగా నియమించాలని దీని వల్ల విద్య బోధనకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉంటుందని తెలిపారు. ప్రాథమికోన్నత పాఠశాలలో కచ్చితంగా పిఈటిలను నియమించాలని పెండింగులో ఉన్న పిఆర్సి డి.ఏ లను త్వరగా ప్రకటించాలని కోరారు.



## గ్రామ నర్సరీలో వెయ్యి మొక్కలు ధ్వంసం

**ప్రజాపక్షం/ధన్వాడ :** ధన్వాడ మండల కొండ్రోన్ పల్లె గ్రామంలోని నర్సరీలోని మొక్కలను ధ్వంసం చేసి అక్కడున్న ఎరువులను ఎత్తుకెళ్లి పోయారని కొండ్రోన్‌పల్లె గ్రామ సర్పంచ్ పి. సుధాకర్ తెలిపారు. కొండ్రోన్ పల్లె గ్రామానికి గతంలో ఊరికి చాలా దూరంలో గుట్ట పై నర్సరీ ఏర్పాటు చేయడం వల్ల తీవ్ర నీటి ఇబ్బందులు తలెత్తడంతో మండల ఎంపీడీవో ఆదేశాల మేరకు మండల రెవెన్యూ అధికారులు గోటూర్ కొండ్రోన్ పల్లె గ్రామాల మధ్యలో ఉన్న రైతు వేదిక పక్కన ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని మండల సర్వేయర్ చూపించడం జరిగింది. అక్కడ ప్రభుత్వ స్థలాన్ని చదును చేసి బుధవారం నాడు దాదాపుగా ఒక వెయ్యి మొక్కల్ని నర్సరీలో పెట్టడం జరిగింది. గురువారం ఉదయం గోటూర్ గ్రామానికి చెందిన గ్రామ సర్పంచ్ తో పాటు ఆమె భర్త చంద్రమౌళి గౌనీ నాగేశ్వర్ రెడ్డి, పల్లమర్రి వెంకట్ రెడ్డి (మాజీ ఉప సర్పంచ్ గోటూర్), వీరితో పాటు దాదాపుగా 60 మంది ఉపాధి హామీ కూలీలను, గ్రామంలోని కొంతమంది వ్యక్తులు వచ్చి మద్యం మత్తులో కొండ్రోన్ పల్లె గ్రామ పంచాయితీ సిబ్బంది పై దాడి చేసి, భయభ్రాంతులకు గురిచేసి, నర్సరీ మొక్కలు ధ్వంసం చేసి, అక్కడ ఉన్న ఎరువులను, ఇతర సామాగ్రిని ఎత్తుకెళ్లి పోయారని సుధాకర్ తెలిపారు. ఈ విషయం పై స్థానిక పోలీసు స్టేషన్ లో ఫిర్యాదు చేయడం జరిగిందని తెలిపారు. బాధ్యుల పై కఠిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

# ఆత్మకూరును ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలి

### క్రీడలు, యువజన శాఖల మంత్రి వాకిటి శ్రీహరి




**ప్రజాపక్షం/అమరచింత :** ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో ఉన్న సమస్యలను యుద్ధ ప్రాతిపదికన పరిష్కరించి ఆదర్శవంతంగా తీర్చిదిద్దాలని, పాలకవర్గానికి, అధికారులకు రాష్ట్ర పశు సంవర్ధక, మత్స్య, క్రీడలు, యువజన శాఖల మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించారు. గురువారం ఆత్మకూరు మున్సిపాలిటీ కార్యాలయ సమావేశం మందిరంలో కొత్తగా ఎంపికైన వార్డు కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది, ఇతర శాఖల అధికారులు సిబ్బందితో మంత్రి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఆత్మకూరు మున్సిపాలిటీ పరిధిలో విద్యుత్ సమస్య, మంచి నీటి సమస్య, పారిశుద్ధ్యం సమస్యలు లేకుండా యుద్ధప్రాతిపదికన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో సాయంత్రం 6 గంటలకు వీధి దీపాలు వెలగాలని, ఉదయం 6 గంటలకు ఆఫ్ కావాలని సూచించారు. మధ్యాహ్నం సమయంలో లేకుండా చూడాలని అందుకు అవసరమైన విద్యుత్ సామాగ్రి అడిగితే వెంటనే మంజూరు చేయిస్తానని మంత్రి అధికారులకు సూచించారు. లో ఓల్టేజ్ ఇబ్బంది ఎక్కడా ఉండకుండా చూసుకోవాలని సూచించారు. ఒక్కో వార్డు ఆఫీసర్‌ను వార్డులో ఉన్న సమస్యలు అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలు ఇచ్చారు. తాగునీరు సమస్య లేకుండా తగిన చర్యలు తీసుకోవాలని, ప్రతి వారం వార్డు ఆఫీసర్లు, కౌన్సిలర్లు సమావేశం ఏర్పాటు చేసుకొని సమస్యల పరిష్కారినికి సమన్వయంతో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. మురుగు కాలువలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయించాలని, పారిశుద్ధ్యం విషయంలో నిర్లక్ష్యం వీడాలని, దోమల బెడద లేకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపాలిటీలో తాగు నీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చేపట్టాలని, అందుకు అవసరమైన విధులు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రజలకు మెరుగైన ప్రభుత్వ వైద్య సేవలు అందించాలని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని వైద్యాధికారులను ఆదేశించారు. ఆత్మకూరులో ఇప్పటికే మంజూరు చేసిన ఇందిరమ్మ ఇళ్లు పూర్తి అయ్యేవిధంగా చర్యలు తీసుకోవాలని, అన్నీ పూర్తి అయితే మరో 152 ఇళ్లు మంజూరు చేస్తానని తెలియజేశారు. అధికారులు అంకితభావంతో పనిచేయాలని ఆదేశించారు. అధికారులకు తమ పనిమీద పట్టు లేకుంటే మాత్రం చర్యలు తప్పవని అధికారులు, సిబ్బందిని హెచ్చరించారు. అదనపు కలెక్టర్ లోకల్ బాడీస్ యాదయ్య, మున్సిపల్ చైర్‌పర్సన్ నాగమణి, వైస్ చైర్‌పర్సన్ శ్రీనివాసులు, మున్సిపల్ కమిషనర్ శశిధర్, కొత్తగా ఎంపికైన మున్సిపల్ కౌన్సిలర్లు, తహసీల్దార్ చాంద్ పాషా, ఎంపిడిఒ, మున్సిపల్ కార్యాలయ సిబ్బంది, ఇతర ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

### ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల

## బందోబస్తును పరిశీలించిన ఎస్పీ డి.జానకి

**ప్రజాపక్షం/మహబూబ్‌నగర్ :** మహబూబ్‌నగర్ జిల్లాలో జరుగుతున్న ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షల సందర్భంగా గురువారం రెండవ సంవత్సరం (సెకండ్ ఇయర్) పరీక్ష నిర్వహణ జరుగుతున్న నేపథ్యంలో, మహబూబ్‌నగర్ టౌన్‌లోని ప్రభుత్వ బాలుర కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్ష కేంద్రాన్ని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ సందర్శించారు. జిల్లా ఎస్పీ పరీక్ష కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన పోలీసు బందోబస్తు, భద్రతా ఏర్పాట్లు, ట్రాఫిక్ నియంత్రణ చర్యలను ప్రత్యక్షంగా పరిశీలించారు. పరీక్షలు ప్రశాంతంగా, పారదర్శకంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు లేకుండా జరిగేలా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పరీక్ష కేంద్ర పరిసర ప్రాంతాలలో 100 మీటర్ల పరిధిలో 144 సెక్షన్ అమలు చేయడం, అనధికార వ్యక్తులు గుంపులుగా గుమికూడకుండా చర్యలు తీసుకోవడం, మొబైల్ ఫోన్లు మరియు ఇతర ఎలక్ట్రానిక్ పరికరాల వినియోగం పై కఠిన నిబంధనలు పాటించేలా పర్యవేక్షణ చేయాలని ఆదేశించారు. అలాగే ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పరీక్ష సమయాల్లో ప్రత్యేక ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టాలని ట్రాఫిక్ అధికారులకు సూచించారు. విద్యార్థులు సమయానికి పరీక్ష కేంద్రానికి చేరుకునేలా సహకరించాలని తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రశాంత వాతావరణాన్ని కాపాడాలని, అపోహలు లేదా రూమార్లు నమ్మవద్దని జిల్లా ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత సర్కిల్ ఇన్స్పెక్టర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ ఇతర పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



## కలెక్టర్‌ను కలిసిన పెబ్బేరు మున్సిపల్ నూతన పాలకవర్గం

**ప్రజాపక్షం/పెబ్బేరు :** వనపర్తి జిల్లా పెబ్బేరు మున్సిపాలిటీకి నూతనంగా ఎన్నికైన పాలకవర్గ సభ్యులు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి తో పాటు జాయింట్ కలెక్టర్లను వారి కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నూతన చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్ నేతృత్వంలో కౌన్సిలర్లు కలెక్టర్ కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతనంగా ఎన్నికైన కౌన్సిలర్లను కలెక్టర్ కు పరిచయం చేశారు. పట్టణంలో గత కొంతకాలంగా నిలిచిపోయిన డ్రైనేజీ పనులు, తాగునీటి పైపులైన్ల విస్తరణ, రోడ్ల వెడల్పు వంటి అంశాలను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజలు మీ పై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పారదర్శకమైన పాలన అందించాలి. ముఖ్యంగా పారిశుద్ధ్యం, వీధి దీపాలు మరియు తాగునీటి సరఫరా వంటి కనీస అవసరాలపై ప్రత్యేక శ్రద్ధ వహించండి. జిల్లా యంత్రాంగం నుండి మీకు పూర్తి సహకారం ఉంటుందని కలెక్టర్ పాలకవర్గానికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ అక్కి శ్రీనివాస్ గౌడ్, వైస్ చైర్మన్ సుమిత్ర, వివిధ వార్డుల కౌన్సిలర్లు, పర్వీన్, జములమ్మ, భాగ్యలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.



## నీటి కష్టాలపై మహిళల ఆగ్రహం.. గద్వాలలో ఖాళీ బిందెలతో నిరసన

**ప్రజాపక్షం/గద్వాల :** జోగులాంబ గద్వాల జిల్లా కేంద్రమైన 9వ వార్డు రాఘవేంద్ర కాలనీలో నీటి సమస్య జటిలమైంది. గత కొన్ని రోజులుగా నల్లా నీరు సక్రమంగా రావడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తూ కాలనీ మహిళలు రోడ్డు పైకి వచ్చి నిరసన చేపట్టారు. ఖాళీ బిందెలతో కాలనీవాసులు తమ నిరసనను వ్యక్తం చేశారు. అధికారుల నిర్లక్ష్యం వల్ల తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. రాఘవేంద్ర కాలనీలో నెలకొన్న తాగునీటి ఎద్దడిని వెంటనే పరిష్కరించాలని, క్రమపద్ధతిలో నీటి సరఫరా జరిగేలా చూడాలని వారు డిమాండు చేశారు.

## గద్వాల్‌లో అతిపెద్ద ఆర్థిక కుంభకోణం

### రూ.210కోట్ల ఐపి దాఖలు

**ప్రజాపక్షం/గద్వాల్ :** జోగులాంబ గద్వాల్ జిల్లాలో రియల్ ఎస్టేట్ రంగం ఒక్కసారిగా ఉలిక్కిపడింది. భారీ లాభాలు, వడ్డీల ఆశచూపి వందలాది మంది నుంచి కోట్లాది రూపాయలు వసూలు చేసిన ఒక ప్రముఖ రియల్ ఎస్టేట్ వ్యాపారి, తాజాగా కోర్టులో దివాలా (ఇన్‌సాల్వెన్సీ) పిటిషన్ దాఖలు చేయడం కలకలం రేపుతోంది. గద్వాల్‌కు చెందిన సదరు వ్యాపారి రియల్ ఎస్టేట్ పేరుతో సుమారు 36% భారీ వడ్డీ ఇస్తానని నమ్మబలికి వందలాది మంది నుంచి పెట్టుబడులు సేకరించారు. అయితే, పెరిగిన అప్పులు, వడ్డీల భారం తట్టుకోలేక, తాను అప్పులు తీర్చలేని స్థితిలో ఉన్నానని పేర్కొంటూ గద్వాల్ కోర్టును ఆశ్రయించారు. అక్షరాల రూ.210,26,29,000 (రెండు వందల పది కోట్లకు పైగా) బకాయిలు ఉన్నాయని, ప్రాథమిక సమాచారం ప్రకారం 266 మంది బాధితులు ఉన్నట్లు గుర్తించారు. కష్టార్జితాన్ని నమ్మి పెట్టుబడిగా పెట్టిన సామాన్యులు, రిటైర్డ్ ఉద్యోగులు ఇప్పుడు రోడ్డున పడే పరిస్థితి వచ్చిందని ఆవేదన వ్యక్తం చేశారు. 266 మంది పేర్లతో కూడిన జాబితా ఇప్పుడు గద్వాల్ వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. ప్రైవేట్ వ్యాపారుల వద్ద పెట్టుబడులు పెట్టేముందు ఒకటికి రెండుసార్లు ఆలోచించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

## శ్రీ జములమ్మ ఆలయానికి రూ.22.85లక్షల ఆదాయం

**ప్రజాపక్షం/గద్వాల రూరల్ :** జోగులాంబ గద్వాల జిల్లా జమ్మిచేడు గ్రామం సమీపంలో వెలసిన నడిగడ్డ భక్తుల ఇలవేల్పు, కోరిన కోరికలు తీర్చే కొంగుబంగారంగా విరాజిల్లుతున్న శ్రీ జములమ్మ పరశురామస్వామి ఆలయానికి రూ.22,85,518 లక్షల ఆదాయం లభించినట్లు ఆలయ ఈఓ పురంధర్ కుమార్ తెలిపారు. గురువారం దేవాదాయ శాఖ గద్వాల డివిజన్ పరిశీలకులు వెంకటేశ్వరి, ఆలయ కార్యనిర్వహణాధికారి ఆర్.పురేందర్ కుమార్, యూనియన్ బ్యాంకు మేనేజర్, సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్తులు, భక్తుల సమక్షంలో శ్రీ జమ్ములమ్మ, పరశు రామస్వామి జాతర 2026 సందర్భంగా అనంతరం నాలుగు వారాలకు సంబంధించి హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. నాలుగు వారములకు మొత్తం హుండీ ఆదాయం రూ.22,85,518 అక్షరాల ఇరవై రెండు లక్షల ఎనభై ఐదు వేలా ఐదువందల పద్దెనిమిది రూపాయల 1 ఆదాయం వచ్చినదన్నారు. హుండీ లెక్కింపు మిశ్రమ వెండి00510000 వచ్చినదని, మిశ్రమబంగారం ఏమి రాలేదని తెలిపారు. ఇదే సందర్భంలో గత సంవత్సరం జాతర 2025 లో ఆరు వారంలకు గాను హుండీ ఆదాయం రూ.27,78,778 లక్షలు వచ్చినదని ఆలయ ఈఓ తెలిపారు.

## అక్రిడిటేషన్ విధివిధానాల నివేదిక ఇవ్వండి

### రాష్ట్రానికి హైకోర్టు ఆదేశం

**హైదరాబాద్:** రాష్ట్రంలో అమలులోకి తీసుకొచ్చిన మీడియా అక్రిడిటేషన్ వి ధానం వివరాలను, విధివిధానాలు సమర్పించాలని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశించింది. ప్రధాన కార్యదర్శి, జిఎడి ముఖ్యకార్యదర్శి, సమాచార శాఖ కమిషనర్, మీడియా అకాడమీ చైర్మన్‌లకు నోటీసులు జారీ చేసింది. కేసు తదుపరి విచారణను ఏప్రిల్ 8కి వాయిదా వేసింది. అక్రిడేషన్ అర్హతలపై ప్రభుత్వం జారీ చేసిన జీవోను హైటెక్ ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా అసోసియేషన్, తెలంగాణ ఉర్దూ వర్కింగ్ జర్నలిస్టు ఫెడరేషన్, క్రియేటివ్ ఇండియా బ్రాడ్‌కాస్టింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వేసిన మూడు పిటిషన్లను చీఫ్ జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ జిఎం మొహియుద్దీన్‌లతో కూడిన డివిజన్ బెంచ్ గురువారం విచారించింది. కేబుల్ డిజిటల్ మీడియా సంస్థలకు నిర్ణయించిన ప్రమాణాలు అన్యాయమని, రాజ్యాంగ హక్కులకు విరుద్ధమని పిటిషనర్ల అడ్వొకేట్ వాదించారు. అక్రిడేషన్ దరఖాస్తుల గడువు ఈ నెల 28తో ముగిస్తుందని, గడువు సమీపిస్తున్నందున జీవో అమలుపై తక్షణం నిలుపుదల చేస్తూ స్టే విధించాలని కోరారు. దీనికి ప్రతిస్పందించిన ప్రభుత్వ న్యాయవాది, ప్రస్తుత అక్రిడేషన్ కార్డుల చెల్లుబాటు రెండు నెలలు పొడిగించినట్లు చెప్పారు కౌంటర్ దాఖలుకు నాలుగు వారాల గడువు ఇచ్చిన కోర్టు, కౌంటర్ తర్వాత పిటిషనర్లు రెండు వారాల్లో తమ రిప్లైలు సమర్పించాలని ఆదేశించింది.

### త్వరలో అంబేద్కర్ టవర్

## ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్ హైదరాబాద్‌లోనే

### దళితులకు ఉన్నత విద్య అందించడమే సర్కార్ లక్ష్యం

### రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లోని లోయర్ ట్యాంక్ బండ్ అంబేద్కర్ భవన్ ప్రాంగణంలో త్వరలోనే అంబేద్కర్ టవర్ నిర్మించడంతో పాటు దానిని మోడర్న్ కోచింగ్ హబ్‌గా అభివృద్ధి చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. దీంతో పాటు కాచిగూడ హాస్టల్ కాంప్లెక్స్‌ను రెసిడెన్షియల్ అకాడమిక్ సెంటర్‌గా మార్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు మంత్రి వివరించారు. దళిత కులాల సంఘాల నాయకులతో కలిసి మంత్రి బుధవారం లోయర్ ట్యాంక్ బండ్‌లోని అంబేద్కర్ భవన్‌తో పాటు కాచిగూడలోని ఎస్‌సి హాస్టల్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ సివిల్స్ కోచింగ్ కోసం తెలంగాణ విద్యార్థులు ఢిల్లీ బాట పట్టాల్సిన పరిస్థితి ఏర్పడిందని, దళిత విద్యార్థులు ఢిల్లీ వంటి ప్రాంతాల్లో కోచింగ్ తీసుకోవడం ఖర్చుతో కూడిన పని కావడంతో, ఢిల్లీ స్థాయి సివిల్స్ కోచింగ్ సౌకర్యాలను హైదరాబాద్‌లో అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామని మంత్రి తెలిపారు. రానున్న రోజుల్లో విద్యార్థుల కోసం కొత్త టెక్నాలజీతో డిజిటల్ లైబ్రరీలు, స్మార్ట్ క్లాస్ రూమ్స్ ఏర్పాటు చేయడంతో పాటు అనుభవజ్ఞులైన ఫ్యాకల్టీ, రిటైర్డ్ సివిల్ సర్వెంట్స్, గెస్ట్ లెక్చర్స్ తీసుకోవడంతో పాటు మాక్ టెస్టులు, ఇంటర్వ్యూ గైడెన్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై ప్రత్యేక శ్రద్ధ పెడతామని తెలిపారు. కోచింగ్ తీసుకునే అభ్యర్థుల కోసం హాస్టల్, మెస్, స్టడీ హాల్స్ వంటి పూర్తి సదుపాయాలు కల్పిస్తామని మంత్రి తెలిపారు. ప్రతిభావంతులైన దళిత విద్యార్థులు అన్ని రంగాల్లో సమానత లభించాలంటే చదువు ఒక్కటే మార్గమని అన్నారు. దళితులకు కార్పొరేట్ స్థాయిలో విద్యను అందించాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లక్ష్యంగా పెట్టుకున్నారని తెలిపారు. కోచింగ్ సెంటర్లను కేవలం హైదరాబాద్‌కు మాత్రమే పరిమితం కాకుండా, తెలంగాణలోని ప్రతి జిల్లాకు విస్తరించేలా దీర్ఘకాలిక ప్రణాళిక చేస్తామని మంత్రి తెలిపారు. కోచింగ్ సెంటర్లను అకాడమిక్ ఎక్సలెన్స్ సెంటర్లుగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నామని అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. మంత్రితో పాటు ఎంఎల్‌సి అద్దంకి దయాకర్, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, వివిధ దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

## గ్రీన్‌లాండ్ నినాదంతో డెన్మార్క్ పార్లమెంటుకు మెరుపు ఎన్నికలు

**నూక్:** డెన్మార్క్‌లో ఆకస్మిక ఎన్నికలు నిర్వహించాలని ఆ దేశ ప్రధాన మంత్రి మెట్టే ఫ్రెడరిక్‌సన్ నిర్ణయించారు. దేశ పార్లమెంటులో గురువారం ఆమె ఈ ప్రకటన చేశారు. ఉత్తర యరప్‌లో నోర్డిక్ దేశమైన డెన్మార్క్ రాజ్యంలో ఫారో ఐలాండ్, గ్రీన్‌లాండ్ స్వయంప్రతిపత్తి ప్రాంతాలు కూడా అంతర్భాంగా ఉన్నాయి.గ్రీన్‌లాండ్‌పై జరుగుతున్న వివాదం నేపథ్యంలో "మనం మన కాళ్ళమీద నిలబడదాం, మన స్వతంత్రతను మనం నిర్ణయించుకుందాం, మన ఖండంలో మనం శాంతిని నిర్ధారించుకోవాలి, మనం ఆయుధాలు సమకూర్చుకోవాలి, యూరప్‌తో కలిసి ఉండాలి, దానిష్‌తో కామన్వెల్త్ భవిష్యత్తును నిర్ధారించుకోవాలి, అమెరికాతో మన సంబంధాలు ఏమిటో, ఎలా ఉండాలో నిర్ణయించుకోవాలంటే ఈ ఎన్నికలు జరగాలి, రాబోయే నాలుగు సంవత్సరాలు మన డెన్మార్క్ రాజ్యానికి అత్యంత కీలకమైన సమయం" అని డెన్మార్క్ ప్రధానమంత్రి ప్రకటించారు. ప్రజలు తమ స్వాతంత్ర్యాన్ని, గౌరవాన్ని నిరూపించుకోవాలని, ఈ మెరుపు ఎన్నికలలో ఎంతమేరకు భారీస్థాయిలో తనకు పూర్తి మెజారిటీ ఇస్తారో ప్రజలే నిర్ణయించుకోవాలని ఆమె పిలుపు ఇచ్చారు. నేను మీ ప్రధానమంత్రిగా కొనసాగుతానో లేదో మీరే తేల్చాలి, సోషల్ డెమోక్రాట్లకు ఎంత మెజార్టీ ఇస్తారో చెప్పండి అని ప్రజలను కోరారు. డెన్మార్క్‌లో ఉన్న సంకీర్ణ ప్రభుత్వంలో ఆమె కీలకభాగస్వామి పార్టీ నేతగా ఉన్నారు. పశ్చిమార్థగోళంలో అమెరికా రక్షణకు కీలక కావలి కేంద్రంగా ట్రంప్ భావిస్తున్న, ప్రపంచంలోనే అతిపెద్దదైన వివాదాస్పద దీవి గ్రీన్‌లాండ్‌ను నయానో భయానో సొంతం చేసుకుంటామని ట్రంప్ ప్రకటించిన తర్వాత పెద్ద వివాదం చెలరేగింది. తోటి నాటో దేశం గ్రీన్‌లాండ్‌పై గడచిన నెల నుండి ట్రంప్ ఒత్తిడి చేయడం, బెదిరింపులకు గురిచేయడం నిలిపివేశారు. చైనా, రష్యాల నుండి అమెరికాకు ప్రమాదం పొంచి ఉందని, అందువల్ల గ్రీన్‌లాండ్‌లో అత్యంత శక్తిమంతమైన ఖండాంతర బాలిస్టిక్ క్షిపణులు, ఇతర బలమైన ఆయుధాలను మోహరిస్తామని, ఈ ప్రయోజనం కోసం గ్రీన్‌లాండ్‌ను తమకు విక్రయించాలని ట్రంప్ మొట్టమొదట బేరం పెట్టారు. ఈ సమస్య చినుకు చినుకు గాలివానగా మారి నాటో కూటమి విచ్ఛిన్నమయే ప్రమాద ఘంటికలు కూడా మోగించడంతో ట్రంప్ వెనక్కు తగ్గారు. రెండో ప్రపంచ యుద్ధ కాలం నుండీ శాశ్వత ప్రాతిపదికపై 100 అమెరికా సైనికుల స్థావరం గ్రీన్‌లాండ్‌లో ఉంది. డేనిష్ ప్రధానమంత్రి మెట్టే పార్లమెంటులో మాట్లాడుతూ, రాబోయే సంవత్సరాల్లో భద్రతే దేశానికి పునాది అన్నారు.

## కుమ్మెర ఘటన కారకులను అరెస్టు చేయాలి

### బిసి జన సభ రాష్ట్ర అధ్యక్షులు రాజారామ్ యాదవ్



**ప్రజాపక్షం/సోమాజిగూడ :** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో మల్లన్న గుడి వద్ద బిసి బిడ్డపై దాడి, రెండు నెలల పాప హత్య ఘటనను బిసి జనసభ రాష్ట్ర అధ్యక్షుడు రాజారామ్ యాదవ్ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన కారకులను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. గురువారం హైదరాబాద్ సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో బిసి జనసభ, యాదవ సంఘాల జెఎసి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. కుమ్మెర ఘటనపై మార్చి 7న చలో కుమ్మెర మల్లన్న స్వామి" కార్యక్రమానికి పిలుపునిచ్చినట్టు చెప్పారు. మార్చి 13న హైదరాబాదులోని ఎండోమెంట్ కార్యాలయం ముందు 'మల్లన్న మాతా స్ఫూర్తి ధర్నా' నిర్వహిస్తామన్నారు. సమావేశంలో అఖిల భారత యాదవ మహాసభ జాతీయ కార్యదర్శి రమేష్ యాదవ్, బీసీ కుల సంఘాల జేఏసీ అధ్యక్షుడు కాటం నరసింహులు, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మేకల కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## వలసలపై ట్రంప్ ఉత్తర్వును స్తంభింపజేసిన అమెరికా కోర్టు

**మసాచ్యుసెట్స్:** అమెరికాకు బ్రతుకుతెరువు కోసం వలస వచ్చిన తృతీయ ప్రపంచదేశాల ప్రజలను దేశం నుండి వెళ్ళగొట్టేందుకు ట్రంప్ తెచ్చిన నిబంధనలు, విధానాలను మసాచ్యుసెట్స్‌లోని జిల్లా న్యాయస్థానం న్యాయమూర్తి తప్పుపట్టారు. ఈ నిబంధనలను తాత్కాలికంగా 15 రోజులు స్తంభింపజేశారు. ప్రభుత్వం తన వాదనను, తన వైఖరిని తెలియజేయడానికి ట్రంప్ యంత్రాంగానికి గడువు విధించారు. దీంతో వలస విధానంపై ట్రంప్ ప్రభుత్వానికి మరో ఎదురుదెబ్బ తగిలినట్లయింది. తృతీయ ప్రపంచదేశాలను బహిష్కరిస్తూ తెచ్చిన ఉత్తర్వులను పక్కనపెట్టాలని, ఇది చట్టవిరుద్ధమని యు.ఎస్.జిలా న్యాయమూర్తి బ్రియాన్ ఇ మర్ఫీ తీర్పు చెప్పారు. ఐతే ఈ వలస ప్రజల తరలింపును వ్యతిరేకిస్తూ ఇప్పటికే అనేక కేసులు సుప్రీంకోర్టులో ఉన్నాయి. గత సంవత్సరం ఈ విషయంలో సుప్రీంకోర్టు ట్రంప్‌కు అనుకూలంగా స్పందించింది యుద్ధంతో ఉన్న సూడాన్‌కు ఆ దేశ ప్రజలను అమెరికా నుండి తరలించేందుకు న్యాయమూర్తి అంగీకరించలేదు. ఆ దేశంతో ఇప్పుడు వారికి సంబంధం లేదన్నారు. సుప్రీంకోర్టు ఉత్తర్వులను తాత్కాలికంగా పాజ్ చేశారు.

# సెమీస్ రేసులో టీమిండియా

చావోరేవో పోరులో భారత జట్టు జూలు విదిల్చింది. టాపార్డర్ ఆకాశమే హద్దుగా చెలరేగి రికార్డు స్కోరందించగా.. జింబాబ్వేపై 72 పరుగులతో జయభేరి మోగించింది టీమిండియా. రికార్డు ఛేదనకు దిగిన ప్రత్యర్థిని వంద లోపే ఆలౌట్ చేస్తుందనకుంటే.. కనీసం వంద పరుగుల తేడాతో అయినా గెలవలేదు. అయితే.. తొలిపోరులో దక్షిణాఫ్రికా చేతితో కంగుతిన్న టీమిండియా ఈ విజయంతో సెమీస్ ఆశలు సజీవంగా ఉంచుకుంది. గ్రూప్ ఏ నుంచి సఫారీ జట్టు సెమీస్కు అర్హత సాధించింది.లీగ్ దశను అజేయంగా ముగించి.. సూపర్ 8ను ఓటమితో ఆరంభించిన భారత్.. కీలకమ్యాచ్‌లో జింబాబ్వేను చిత్తు చేసింది. అహ్మదాబాద్లో దక్షిణాఫ్రికా చేతిలో 76 పరుగుల తేడాతో ఓడిన టీమిండియా.. చెపాక్లో ఆఫ్రికా జట్టుపై 72 పరుగుల తేడాతో గెలుపొందింది. అయితే.. వెస్టిండీస్‌పై 9 వికెట్లతో జయభేరి మోగించిన సఫారీ టీమ్.. గ్రూప్ ఏ నుంచి దర్జాగా సెమీస్‌లో అడుగుపెట్టింది. రికార్డు ఛేదనలో జింబాబ్వే ఇన్నింగ్సు ఓపెనర్లు బ్రియాన్ బెన్నెట్(97 నాటౌట్), మరుమని(20)లు దూకుడుగా ఆరంభించారు. పవర్ ప్లేలో వీరిద్దరూ స్కోర్ 40 దాటించారు.



అయితే.. అక్షర్ పటేల్ ఓవర్లో మరుమని షాట్ ఆడి ఇషాన్ చేతికి చిక్కా డు. కాసేపటికే డియన్ మైయర్స్(6)ను వరుణ్ చక్రవర్తి వెనక్కి పంపాడు.అనంతరం కెప్టెన్ సికిందర్ రజా(31) జతగా బెన్నెట్ పెద్ద షాట్లు ఆడాడు. వీరిద్దరూ సిక్సర్లతో అలరిస్తూ అర్ధ శత కం భాగస్వామ్యం నెలకొల్పారు. రజాను అర్ష్‌దీప్ ఔట్ చేయగా.. మున్యోగా( 11), ముసెకివా(7)లు త్వరగానే పెవిలియన్ చేరారు. ఓవైపు వికెట్లు పడుతున్నా బెన్నెట్ మాత్రం తగ్గేదేలే అన్నట్టు చెలరేగి సెంచరీకి చేరువయ్యాడు. కానీ.. ఓవర్లో సిక్స్, ఫోర్ రావడంతో జింబాబ్వే 184కే పరిమితమైంది. సెమీస్ ఆశలు నిలవాలంటే గెలిచి తీరాల్సిన మ్యాచ్లో భారత క్రికెటర్లు శివాలెత్తిపోయారు. ఓపెనర్ అభిషేక్ శర్మ(55) ఫామ్ చాటుకుంటూ అర్ధశతకంతో రెచ్చిపోగా.. వచ్చినవాళ్లు వచ్చినట్టు వీరంగం సృష్టించారు. జింబాబ్వే బౌలర్లను హడలెత్తిస్తూ కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్(33), తిలక్ వర్మ(44 నాటౌట్)లు కసిదీరా కొట్టగా.. హార్దిక్ పాండ్యా(50 నాటౌట్) తన స్టయిల్ విధ్వంసంతో ఫినిషింగ్ టచ్ ఇచ్చాడు. టాపార్డర్ సహా మిడిల్ మెరుపులతో టీమిండియా పొట్టి ప్రపంచకప్లో 256తో వ్యక్తిగత రికార్డు(గతంలో 220 రన్స్)ను బ్రేక్ చేసింది.

## టీమిండియా ఆశలకు ఊపిరిలూదిన సఫారీలు!

తొలి పొట్టి ప్రపంచకప్ వేటలో దక్షిణాఫ్రికా అజేయంగా దూసుకెళ్తోంది. సూపర్–8 తొలిపోరులో భారత జట్టును 76 పరుగులతో చిత్తుచేసిన సఫారీ టీమ్.. పటిష్టమైన వెస్టిండీస్‌ను అలవోకగా మట్టికరిపించింది. అదిరే ఆటతో ప్రత్యర్థిని కట్టడి చేసిన ప్రొటీస్ జట్టు.. 177 పరుగుల లక్ష్యాన్ని ఉఫ్‌మనిపించింది. ఓపెనర్ ఎడెన్ మర్క్రమ్(82 నాటౌట్), క్వింటన్ డికాక్(47) మంచుముక్కలా కరిగించారు. డికాక్ ఔటయ్యాక.. రియాన్ రికెల్టన్(45 నాటౌట్) జతగా ప్రొటీస్ కెప్టెన్ లాంఛనం ముగించాడు. వరుసగా రెండు విజయాలతో మర్క్రమ్ సేన గ్రూప్–ఎలో అగ్రస్థానానికి దూసుకెళ్లింది.గత సీజన్ ఫైనలిస్ట్ దక్షిణాఫ్రికా పదో సీజన్‌లో రెచ్చిపోతోంది. లీగ్ దశను అజేయంగా ముగించిన ఆ జట్టు సూపర్–8 లోనూ పంజా విసురుతోంది. గురువారం వెస్టిండీస్ నిర్దేశించిన 177 పరుగుల భారీ ఛేదనను ఓపెనర్లు ఎడెన్ మర్క్రమ్(82 నాటౌట్), క్వింటన్ డికాక్(47), దూకుడుగా ఆరంభించారు. తొలి ఓవర్‌లోనే 6,4తో రన్స్ పిండుకున్నారు. ఆ తర్వాత కూడా విధ్వంసక ఆటతో రెచ్చిపోయిన ఈ ద్వయం.. పవర్ ప్లేలోనే 69 రన్స్ రాబట్టింది. ఆ



రంభంలో నెమ్మదిగా ఆడిన డికాక్ గేర్‌మార్చి విజృంభించగా.. విండీస్ బౌలర్లు బిక్కమొహం వేశారు. తొలి వికెట్‌కు 95 రన్స్ జోడించిన ద్వయాన్ని ఎట్టకేలకు రోస్టన్ ఛేజ్ విడదీశాడు.డికాక్ ఔటైనా.. మర్క్రమ్ జోరు తగ్గించలేదు. రియాన్ రికెల్టన్ (45 నాటౌట్) జతగా సఫారీ సారథి చెలరేగాడు. ఛేజ్ వేసిన 14వ ఓవర్లో మర్క్రమ్ రెండు.. రియాన్ ఒక సిక్సర్ బాదగా స్కోర్ 150 దాటింది. జేసన్ హోల్డర్ వేసిన తొలి బంతినే స్ట్రెయిట్ బౌండరీకి తరలించాడు. దాంతః.. 9 వికెట్ల తేడాతో ప్రొటీస్ జట్టు జయకేతనం ఎగురవేసి సెమీస్ బెర్తుకు చేరువైంది. ఓడిన విండీస్ రన్‌రేట్ +5 నుంచి+1.791కు పడిపోయింది. తద్వారా భారతజట్టు సెమీస్ అవకాశాలు మెరుగయ్యాయి. సూపర్–8 ఆరంభ మ్యాచ్‌లో భారీవిజయంతో హెచ్చరికలు పంపిన వెస్టిండీస్.. రెండో మ్యాచ్‌లో తడబడినా.. నిలబడింది. నరేంద్ర మోదీ స్టేడియంలో పవర్ ప్లేలోనే దక్షిణాఫ్రికా బౌలర్లు వికెట్ల వేటతో పైచేయి సాధించినా.. ఆఖరి పంచ్ మాత్రం విండీస్ హిట్టర్లదే. కగిసో రబడ(2–22) లుంగి ఎంగడి(3–30)ల విజృంభణతో 83కే ఏడు కీలక వికెట్లు కోల్పోయిన కరీబియన్ జట్టు అనూహ్యం గా.. 170 ప్లస్ కొట్టింది.. మరో 30 పరుగుల్లోపే కుప్పకూలుతుందనుకున్న వేళ.. జేసన్ హోల్డర్ (49), రొమారియో షెఫర్డ్(52 నాటౌట్)లు అసమాన ఆటతో సఫారీ బౌలర్లను బెంబేలెత్తించారు. బౌండరీలే లక్ష్యంగా చెలరేగిన ఈద్వయం.. ఎనిమిదో వికెట్ కు 89రన్స్ జోడించి భారీ స్కోరందించారు.

## పోటీ కోసం జైకే

(గ్రూప్స్‌కు సిద్ధమవుతున్న వారికోసం)

☞శీతలీకరణ బోగీ కలిగిన దేశంలోనే మొట్టమొదటి డెము (డీజిల్ ఎలక్ట్రిక్ మల్టిపుల్ యూనిట్ రైలును ఎక్కడ ప్రారంభించారు?
కొచ్చి
☞ఆస్ట్రోనాట్‌కు కనిపించే విశ్వం ఏ రంగులో ఉంటుంది?
నలుపు
☞టీ, కాఫీల్లో ఉండే ముఖ్యమైన ఉత్ప్రేరకం ఏది?
కెఫిన్
☞న్యూయార్క్ క్రిమినల్ కోర్టు న్యాయమూర్తిగా ఇటీవల నియమితులైన తొలి భారత సంతతి మహిళ ఎవరు?
రాజ రాజేశ్వరి
☞ప్రతిష్ఠాత్మక 'సిల్క్ రోడ్' రహదారుల ప్రాజెక్టు ఏ దేశానికి చెందింది?
చైనా
☞అండర్–20 ఫిఫా ప్రపంచకప్ 2015 విజేత
సెర్బియా
☞అరుదైన 'బౌద్ధ బ్రహ్మ' విగ్రహం ఇటీవల తెలంగాణలోని ఏ జిల్లాలో బయటపడింది?
కరీంనగర్
☞ 'భారత్‌లో సామాజిక వేదికలు 2014' నివేదిక ప్రకారం ఏప్రిల్ 2014 నాటికి వివిధ సామాజిక వేదికల్లో ఖాతాలు కలిగిన భారతీయుల సంఖ్య ఎంత?
14.3కోట్లు
☞2015 ఆగస్టులో పెట్రోలియం పైపైన్‌నిర్మాణం కోసం భారత్ ఏ దేశంతో ఒప్పందం కుదుర్చుకోవడానికి అంగీకరించింది?
నేపాల్
☞ 'రెపా' పురస్కారాన్ని 2015కు గాను ఏ రాష్ట్రం గెలుచుకుంది?
తెలంగాణ
☞'ఎడ్యుకేషన్ ఆఫ్ ముస్లిమ్స్' యాన్ ఇస్లామిక్ పర్స్పెక్టివ్ ఆఫ్ నాలెడ్జ్ అండ్ ఎడ్యుకేషన్ ఇండియన్ కాంటెస్ట్' పుస్తక రచయిత ఎవరు?
జె.ఎస్. రాజుత్
☞న్యూయార్క్‌లోని ప్రతిష్టాత్మక 'మ్యూజియం ఆఫ్ ది మూవింగ్' ఇటీవల ఏ భారతీయ సినీ ప్రముఖుడి గౌరవసూచకంగా ప్రత్యేక చిత్ర ప్రదర్శన ఏర్పాటు చేసింది?
మణిరత్నం
☞మద్యపాన నిషేధాన్ని ప్రప్రథమంగా విధించిన మొగల్ చక్రవర్తి ఎవరు?
జహంగీర్
☞భారత సైన్యం మొదటిసారిగా ఏ దేశంలో ప్రవేశించి అక్కడ తలదాచుకున్న 20 మంది తీవ్రవాదులను హతమార్చింది?
మయన్మార్
☞ప్రాచీన కాలం నుంచి విశేష ప్రాచుర్యం పొందిన హస్తకళ?
చేనేత
☞రాష్ట్ర ముఖ్యమంత్రిని ఎవరు నియమిస్తారు?
గవర్నర్
☞కేంద్ర ప్రభుత్వం ఈపర్యాటక వీసా పథకాన్ని ఇటీవల ఏ దేశానికి విస్తరించింది?
చైనా, హాంకాంగ్, మకావు
☞2015 జూన్‌లో ఏ దేశం 'అంగారకుడిపైకి వ్యోమనౌకను దించడానికి ఉద్దేశించిన ల్యాండింగ్ వ్యవస్థ' పరీక్ష విఫమైంది?
అమెరికా
☞భారత ప్రధాన సమాచార కమిషనర్ (సిఐసి) గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
విజయ్ శర్మ
☞'ఫ్రెంచ్ ఓపెన్ 2015' పురుషుల టైటిల్ విజేత ఎవరు?
స్టానిస్లాస్ వావ్రింకా
☞'బంగ భవన్' ఏ దేశాధ్యక్షుడి అధికారిక నివాసం?
బంగ్లాదేశ్
☞మాస్టర్ కార్డ్ సెంటర్ ఫర్ ఇన్ క్లూజివ్ గ్రోత్ రూపొందించిన ఆసియా పసిఫిక్ ప్రాంతంలో అంతర్జాతీయ పర్యాటకులను అత్యధికంగా ఆకర్షిస్తున్న తొలి పది నగరాల జాబితాలో అగ్రస్థానంలో నిలిచిన నగరం ఏది?
బ్యాంకాక్
☞భారత రాజ్యాంగంలో 10వ షెడ్యూలును ఎన్నో సవరణ ద్వారా కలిపారు?
52వ
☞భారత రాష్ట్రపతి తన రాజీనామా పత్రాన్ని ఎవరికి సమర్పిస్తాడు?
ఉపరాష్ట్రపతి
☞చలికాలంలో చెట్లు ఆకులను ఎందుకు రాలుస్తాయి?
వేడిని నిలుపుకోవడానికి
☞ప్లాసీ యుద్ధంలో రాబర్ట్ క్లైను, కుట్రదారులకు మధ్య రహస్య ఒప్పందాన్ని కుదిర్చిన వ్యక్తి ఎవరు?
అమీనచంద్
☞కిందివారిలో 'ఇసా అవార్డ్ ఫర్ సర్వీస్ టు హ్యుమానిటీ' పురస్కారాన్ని గెలుచుకున్న వ్యక్తిని గుర్తించండి.
అచ్యుత సమంత
☞రెండో మైసూరు యుద్ధం ఏ సంధితో ముగిసింది?
మంగళూరు
☞ప్రపంచ వాతావరణ సంస్థ (డబ్ల్యూఎంవో) సెక్రటరీ జనరల్ గా నియమితులైన పెట్టెరి టాలస్ ఏ దేశస్థుడు?
ఫిన్లాండ్
☞జీఎస్ఎల్వీ మాక్ 3 ప్రాజెక్ట్ డైరెక్టర్ గా ఇటీవల ఎవరు నియమితులయ్యారు?
జి.అయ్యప్పన్
☞ టిప్పు సుల్తాన్ ఎప్పుడు మరణించాడు?
1799
☞ఇటీవల మృతి చెందిన 'టిఫానీ టూ' అనేది ప్రపంచంలోనే అత్యంత వయసు కలిగిన పిల్లి
☞ చర్మం రంగు దేని వల్ల ఏర్పడుతుంది?
మెలనిన్
☞కిందివాటిలో అరుదైన లోహమేది?
రేడియం

## ప్రాచీన కాలం నుంచి విశేష ప్రాచుర్యం పొందిన హస్తకళ ఏంటీ?





### పెండింగ్ ప్రాజెక్టులు త్వరగా పూర్తి చేసి

# రైతాంగానికి సాగునీరందించాలి

సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి

**ప్రజాపక్షం/చౌటుప్పల్ :** ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పెండింగ్‌లో ఉన్న ఎస్‌సి చర్లగూడెం రిజర్వాయర్‌ను త్వరితగతిన పూర్తి చేసి రైతులకు సాగు నీరు అందించాలని సిపిఐ జాతీయ కార్యదర్శి పల్లా వెంకట్‌రెడ్డి డిమాండ్ చేశారు. గురువారం యాదాద్రి జిల్లా చౌటుప్పల్‌లో ఓ శుభకార్యానికి ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యంతో కలిసి హాజరైన సందర్భంగా పల్లా వెంకట్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ ఈ ప్రాంత ప్రజల చిరకాల కోరిక అయిన డిండి ప్రాజెక్టులో భాగంగా నిర్మించ తలపెట్టిన చర్లగూడెం రిజర్వాయర్ పూర్తయితే వేలాది ఎకరాల భూములు సస్యశ్యామలం అవుతాయని, రాచకొండలో ఎత్తిపోతల ప్రాజెక్టు ఏర్పాటు ద్వారా నారాయణపురం, చౌటుప్పల్ మండలాల,



రైతులకు అనేక గ్రామాలకు సాగునీరు అందించవచ్చని, భూగర్భ జలాలు పెరిగి దీర్ఘకాలిక ప్రయోజనాలు కలుగుతాయన్నారు. ఫ్లోరిన్ పీడిత ప్రాంతాలైన మునుగోడు, దేవరకొండ నియోజకవర్గలకు సాగు, తాగు నీటిని అందించడం కలగ మార్చవద్దని, ఎన్నో ఏళ్లుగా ఈ ప్రాంత ప్రజలు ఉద్యమాలు నిర్వహించడం జరుగుతుందన్నారు. ప్రభుత్వాలు ఏదో నామమాత్రపు నిధులు కేటాయిస్తున్నారని, అలా కాకుండా వచ్చే బడ్జెట్‌లో ప్రాజెక్టు పూర్తయ్యేందుకు సరిపడా నిధులని మంజూరు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆయన కోరారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం, ఉమ్మడి జిల్లా మంత్రులు జిల్లాలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తయ్యేందుకు ప్రత్యేక చొరవ చూపాలని కోరు. ప్రాజెక్టుల సాధన కోసం గతంలో సిపిఐ పెద్దఎత్తున పోరాటాలు నిర్వహించడం జరిగిందని, మళ్ళీ ప్రజా పోరాటాలకు కూడా వెనకాడబోమని ఉమ్మడి నల్లగొండ జిల్లాకు సాగునీరందించే వరకు విడతల వారీగా పోరాటాలు నిర్వహిస్తామన్నారు. సమావేశంలో సిపిఐ యాదాద్రి జిల్లా కార్యదర్శి యానాల దామోదర్‌రెడ్డి, తెలంగాణ ప్రజానాట్యమండలి రాష్ట్ర అధ్యక్షుడు కురిమిద్దె శ్రీనివాస్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పల్లె శేఖర్‌రెడ్డి, పగిల్ల మోహన్‌రెడ్డి, ఉడుత రామలింగం, పొట్ట శంకరయ్య, రొండి నర్సింహా, టంగుటూరి రాములు, నర్సింహా, భాస్కర్, దాసరి మనోహర్, బోయ మంకులు తదితరులు ఉన్నారు.

## మార్కపురి తిరుపతి ఆశయాలు కొనసాగిద్దాం



సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం

**ప్రజాపక్షం/పెద్దపల్లి :** ప్రజా ఉద్యమ నాయకుడు మాజీ కౌన్సిలర్ తన ఇంటి పేరుని సిపిఐగా మార్చుకొని అనేక ఉద్యమాలకు నాయకత్వం వహించిన మార్కపురి తిరుపతి 10వ వర్ధంతి సభ స్థానిక ఎల్‌బినగర్‌లోని సిపిఐ జెండా వద్ద శాఖ కార్యదర్శి మార్కపురి సూర్య అధ్యక్షతన జరిగింది. కార్యక్రమంలో సిపిఐ పెద్దపల్లి జిల్లా కార్యదర్శి తాండ్ర సదానందం, రాష్ట్ర సమితి సభ్యులు గౌతం గోవర్ధన్, సిపిఐ నగర కార్యదర్శి కె.కనకరాజ్, యూనియన్ బ్రాంచి కార్యదర్శి ఆరేల్లి పోషం హాజరై తిరుపతి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ "నిరంతరం ప్రజా సమస్యల కోసం పోరాడుతూ కమ్యూనిస్టు పార్టీ పక్షాన మొదటిసారి కౌన్సిలర్‌గా ఎన్నికైన వ్యక్తి తిరుపతని కొనియాడారు. తన పేరు మార్కపూరి తిరుపతి అయినప్పటికీ తను చేసిన పోరాటాలతో పార్టీలో పనిచేసిన నిబద్ధతతో సిపిఐ తన ఇంటి పేరుగా మారి సిపిఐ తిరుపతిగాఈ ప్రాంతంలో తనకంటూ ఒక ప్రత్యేక గుర్తింపును పొందారన్నారు కార్యక్రమంలో సిపిఐ ప్రజా సంఘాల నాయకులు రేణిగుంట్ల ప్రీతం, తోడుపునూరి రమేష్, ఎం.ఎ.గౌస్, ఆరేపల్లి మానస్ కుమార్, పడాల కనకరాజు, జీదుల లక్ష్మీ నారాయణ, రాణవేణి సుదీ,ర్ ఆసాల నవీన్, తాళ్ళపెల్లి సురేందర్, దుబాసీ రేణుక, సాదుల శివ, మార్క్కాపురి భగత్, తిలక్, జగన్, రొంటాల లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులుగా అంగన్‌వాడీ టీచర్స్

ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి విలాస్

ప్రజాపక్షం/ఆదిలాబాద్ : తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ అసోసియేషన్ (ఎఐటియుసి) ఆధ్వర్యంలో ఏప్రిల్ 23న నిర్వహించనున్న చలో ఢిల్లీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎఐటియుసి రాష్ట్ర కార్యదర్శి ఎస్.విలాస్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షులు దరాడే ఛాయ అధ్యక్షతన యూనియన్ సమావేశంలో విలాస్ మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్స్‌లను కేంద్రప్రభుత్వం ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. కార్యక్రమంలో ఎఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి సిర్ర దేవేందర్, యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎ.చంద్రకళ, ఆర్.దుర్గ, ఇందుమతి, హేమలత, స్వప్న పాల్గొన్నారు.

## కడవరకూ కమ్యూనిస్టుగానే చక్రపాణి

**ప్రజాపక్షం/ఖమ్మంరూరల్ :** నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు పోరాడిన చక్రపాణి ధన్య జీవని సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ అన్నారు. గురువారం ఖమ్మంరూరల్ మండలంలో దారేడుగ్రామంలోని స్మారక స్థూపం వద్ద 7వ వర్ధంతిని నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పుచ్చకాయల కమలాకర్, జిల్లా సమితి సభ్యులు బత్తిని సీతరాములు, సర్పంచ్ బత్తిని వెంకటేశ్వర్లు, గ్రామ సహాయకార్యదర్శి నూర్‌పాషా, జిలానీ, మీరా పాల్గొన్నారు.



### సిపిఐ సీనియర్ సభ్యురాలు అన్నపూర్ణమ్మ మృతి



ఏదులాపురం మున్సిపాలిటీ పరిధిలోని 29వ డివిజన్‌కు చెందిన సిపిఐ సీనియర్ సభ్యురాలు వెంపటి అన్నపూర్ణమ్మ(95) అనారోగ్యంతో గురువారం ఇంటివద్ద మృతి చెందింది. విషయం తెలుసుకున్న సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. అన్నపూర్ణమ్మకు కొడుకు, కుమార్తెలు ఉన్నారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మిడకంటి చిన్న వెంకట్‌రెడ్డి, 28వ వార్డు కౌన్సిలర్ దండి రంగారావు ఉన్నారు.

# తమిళ గాంధీ నల్లకన్ను మరణం తీరనిలోటు

సిపిఐ జిల్లా కార్యదర్శి దండి సురేష్

నల్లకన్నుకు ఘన నివాళి

**ప్రజాపక్షం/ఖమ్మం :** స్వాతంత్ర్య సమరయోధుడు, కమ్యూనిస్టు ఉద్యమ నాయకుడు నల్లకన్ను మృతితో ఓ ధిక్కార స్వరం మూగబోయిందని సిపిఐ ఖమ్మం జిల్లా కార్యదర్శి దండి సురేష్ తెలిపారు. సిపిఐ కేంద్ర కార్యదర్శివర్గ మాజీ సభ్యులు, తమిళనాడు గాంధీగా పేరొందిన నల్లకన్ను (101) బుధవారం మృతిచెందిన విషయం విధితమే. గురువారం స్థానిక గిరిప్రసాద్ భవన్‌లో నల్లకన్ను చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ యుక్త వయస్సులో దేశ స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొన్న నల్లకన్ను ఆ తర్వాత కాలంలో కమ్యూనిస్టు పార్టీలో చేరి అనేక పోరాటాలకు నాయకత్వం వహించారని తెలిపారు. తమిళనాడులో కమ్యూనిస్టు పార్టీని ఒక బలమైన రాజకీయ శక్తిగా మల్చడంతో పాటు పేదల హక్కుల కోసం అనేక మార్లు ఆయన జైలుకు వెళ్లారన్నారు. అసామాన్య పోరాటాలతో తమిళనాడు గాంధీగా ఆయన వినతికెక్కారని సురేష్ తెలిపారు. ప్రజా పోరాటాల కొనసాగింపే నల్లకన్నుకు సరైన నివాళి అని దండి సురేష్ తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు శింగు నర్సింహారావు, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, పుచ్చకాయల కమలాకర్, సిహెచ్ సీతామహలక్ష్మి , మేకల శ్రీనివాసరావు, యానాలి సాంబశివరెడ్డి, వివిధ ప్రజా సంఘాల నాయకులు తాటి నిర్మల, గాదె



లక్ష్మి నారాయణ, చింతల రమేష్, ఎస్‌కె సైదా, చానా తదితరులు ఉన్నారు.

**నిజాంపేట్ :** స్వాతంత్ర సమరయోధుడు, సీనియర్ కమ్యూనిస్టు పార్టీ నాయకులు, తమిళ గాంధీ నల్ల కన్ను మరణించడం తమిళ ప్రజలకే కాకుండా అట్టడుగు వర్గాల వారికి తీరనిలోటని వారి మృతికి జోహార్లు అర్పిస్తూ సిపిఐ కుత్బుల్లాపూర్ మండల ఆధ్వర్యంలో షాపూర్ నగర్ కార్యాలయం వద్ద నల్ల కన్ను చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండలం కార్యదర్శి కె.స్వామి అధ్యక్షత జరిగిన కార్యక్రమం లో సిపిఐ మేడ్చల్ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్ మండల కార్యదర్శి కె.స్వామి సహాయ కార్యదర్శులు వి.హరినాథ్‌రావు, డి.రాములు, ఎఐటియుసి జిల్లా కార్యదర్శి శ్రీనివాస్, ప్రజాసంఘాల నాయకులు బాబు, సంతోష్, నరసింహారెడ్డి, మహేందర్, శ్రీనివాస్, భీమేష్, గుర్రప్ప పాలొన్నారు.

**నాగర్‌కర్నూల్ :** స్వాతంత్ర్య సమరయోధుడు, దేశంలోనే అత్యంత సిపిఐ సీనియర్ నాయకుడు సిపిఐ అగ్రనాయకుడు నల్లకన్ను మృతి దురదృష్టకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గసభ్యుడు ఎం.బాల్‌నర్సింహ్మ అన్నారు. సిపిఐ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన నివాళి సభలో నల్లకన్ను చిత్రపటానికి పూలమాలలువేసి శ్రద్ధాంజలి ఘటించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్ఎండి ఫయాజ్, సిపిఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ సభ్యులు హెచ్.ఆనంద్‌జి, ఎఐటియూసి జిల్లాప్రధాన కార్యదర్శి శివశంకర్, జిల్లా ఉపాధ్యక్షులు బాలపీరు, సిపిఐ పట్టణ సహాయ కార్యదర్శి కొత్త రామస్వామి, సహాయ కార్యదర్శి కొౖటశేఖర్, సిపిఐ నాయకులు అనంత శ్రీనివాసులు, శివకుమార్ నివాళులర్పించిన వారిలో ఉన్నారు.





# విద్యార్థులకు పదవ తరగతి తొలిమెట్టు

### మంత్రి పొన్నం ప్రభాకర్



**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** విద్యార్థులకు పదవ తరగతి జీవితంలో తొలిమెట్టు అని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి, రాష్ట్ర రవాణా, బీసి సంక్షేమశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. విద్యాశాఖ, సంకల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గురువారం స్టాన్లీ పాఠశాల ఆడిటోరియంలో పదవ తరగతి పరీక్షల సన్నద్ధతపై ప్రేరణాత్మక (మోటివేషన్) శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మంత్రి పొన్నం ప్రభాకర్, జిల్లా కలెక్టర్ హరిచందన దాసరితో కలిసి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ విద్యార్థులు మానసిక ఒత్తిడి, భయం వీడి ప్రశాంత వాతావరణంలో పరీక్షలకు హాజరుకావాలన్నారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల విద్యార్థుల్లో మానసిక ఒత్తిడి, భయాందోళనలు తగ్గుతాయని చెప్పారు. సంకల్ప్ ఫౌండేషన్‌తో కలిసి ఇలాంటి మోటివేషన్ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడంపై జిల్లా కలెక్టర్‌ను ఆయన అభినందించారు. తాను, ముఖ్యమంత్రి కూడా ప్రభుత్వ పాఠశాలల్లో చదివి వచ్చిన వారమేనన్నారు. సిలబస్ అనంతరం ప్రాక్టీస్ ముఖ్యమైందని తెలిపారు. రివిజన్‌పై దృష్టి పెట్టి పరీక్షలు బాగా రాసి మంచి ఫలితాలు సాధించాలని విద్యార్థులకు సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత ఇస్తుందన్నారు. చదువుకు ఎంతో ప్రాధాన్యం ఇవ్వాలని, నిర్లక్ష్యం చేయవద్దన్నారు. అప్పుడే మీతల్లి దండ్రులు, మీగ్రామం, మీ స్నేహితులు సంతోషిస్తారని చెప్పారు. మీరు కూడా భవిష్యత్ సమాజానికి ఆదర్శంగా నిలుస్తారన్నారు. అంతకు ముందు వందశాతం హాజరు ఉన్న పాఠశాలలకు, ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు మంత్రి నగదు బహుమతి అందచేశారు. కార్యక్రమంలో డిఇఒ రోహిణి, క్రీడాకారిణి సైనా జైస్వాల్, సంకల్ప్ ఫౌండేషన్ ప్రతినిధి రోజి, మోటివేషన్ స్పీకర్, ఉపాధ్యాయులు, జిల్లాలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

## నల్లకన్ను మృతి అట్టడుగువర్గాలకు తీరనిలోటు

### సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి నర్సింగరావు

**ప్రజాపక్షం/రంగారెడ్డి:** తమిళ గాంధీ నల్లకన్ను మరణం అట్టడుగువర్గాలకు తీరనిలోటు అని సిపిఐ రంగారెడ్డి జిల్లా మాజీ కార్యదర్శి పుస్తకాల నర్సింగరావు అన్నారు. నల్లకన్నుమృతికి జోహార్లు అర్పిస్తూ సిపిఐ రాజేంద్రనగర్ మండల సమితి ఆధ్వర్యంలో సిపిఐ రాజేంద్రనగర్ ఏఆర్ దేవరాజ్ భవన్ లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజేంద్రనగర్ మండల సమి తి కార్యదర్శి కన్యగారి నర్సింహ్మారెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పుస్తకాల నర్సింగరావు మాట్లాడుతూ నిరుపేద కుటుంబంలో జన్మించి అనేక అవమానాలకు గురై తన 17వ ఏటలో సిపిఐ సభ్యత్వాన్ని తీసుకొని స్వతంత్ర ఉద్యమంలో పాల్గొన్నారని గుర్తు చేశారు. ప్రజల కోసమే నిత్యం పోరాటం చేశారని, దానికి గుర్తింపుగా తమిళనాడులో ప్రజలు ఆయనను తమిళగాంధీగా పిలుచుకుంటారన్నారు. సిపిఐ మండల కార్యదర్శి కన్నవారి నరసింహారెడ్డి, మహిళా సమాఖ్య రాజేంద్రనగర్ మండల ప్రధాన కార్యదర్శి కన్యగారి లక్ష్మి, ఎఐటియుసి కుక్కునూరు వాణి, సిపిఐ కార్యాలయం కార్యదర్శి జి.సత్యం, ఎర్రబోడు కార్యదర్శి పాండు, కెఎన్, శ్రీను, శంకర్, రాజు, మహేంద్ర, యాదమ్మ పాల్గొన్నారు.

## సంతాన సాఫల్య కేంద్రాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే శంకర్



**ప్రజాపక్షం/షాద్‌నగర్ :** షాద్‌నగర్ పట్టణ కేంద్రంలో గురువారం డాక్టర్ శారద ఫెర్టిలిటీ సంతాన సాఫల్య కేంద్రాన్ని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ షాద్‌నగర్ నియోజకవర్గంలో అందుబాటులో ఉండేవిధంగా అధునాతన సదుపాయాలు కలిగిన ఆసుపత్రిని ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రవణ్ రెడ్డి, డిప్యూటీ డిఎంహెచ్ఒ విజయలక్ష్మి , వైద్య అధికారులు నాగవర్ధన్, చందులాల్ రాథోడ్, విజయ్ కుమార్, కౌన్సిలర్లు దిలీప్, ముభారక్ అలిఖాన్ తదితరులు పాల్గొన్నారు.

## ఇందిరమ్మ ఇంటి కల నెరవేరుస్తున్న ముఖ్యమంత్రి : మధుసూదన్‌రెడ్డి



**ప్రజాపక్షం/షాబాద్:** ఇందిరమ్మ ఇంటి కల నెరవేర్చిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలని జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి అన్నారు. గురువారం మండల పరిధిలోని లక్ష్మ ణరావు గూడ గ్రామంలో చేవెళ్ల సుభాన్ రెడ్డి, మేకల మల్లేష్‌కు ప్రభుత్వం నుంచి మంజురైన ఇందిరమ్మ ఇండ్లను ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ప్రజలకు ఇచ్చిన హమీలను దశల వారిగా అమలు చేస్తున్నట్లు తెలిపారు. షాబాద్ మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలను అభివృద్ధి చేస్తామని వివరించారు. కార్యక్రమంలో గుడి మల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు విష్ణువర్ధన్‌రెడ్డి, సర్పంచ్‌లు ప్రభాకర్‌రెడ్డి, నాయకులు రవీందర్‌నాయక్, మల్లారెడ్డి, ఆంజనేయులు, గౌరీశ్వర్, చెన్నారెడ్డి, మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

## బంజారా సమాజాన్ని ఏకం చేసిన సేవాలాల్ : ఎమ్మెల్సీ శంకర్‌నాయక్



**ప్రజాపక్షం/ఎల్‌బినగర్ :** లంబాడీల్లో జ్ఞానజ్యోతిని వెలిగించిన గొప్ప ఆధ్యాత్మిక గురువు, గిరిజనుల ఆరాధ్యదైవం సంత్ శ్రీ సేవాలాల్ మహరాజ్ అని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ కొనియాడారు. గురువారం హస్తినాపురం డివిజన్‌లోని కాటమ్ పార్వతమ్మ ఎన్‌క్లేవ్ కాలనీలో నిర్వహించిన సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవాలు ఘనంగా ఏర్పాటు చేశారు. ఎల్‌బి నగర్ ఎస్టీ సెల్ అధ్యక్షులు కేతావత్ రమేష్ నాయక్ ఆధ్వర్యంలో జడ్పీ రోడ్డు నుంచి ర్యాలీ నిర్వహించి, భోగ్ బండార్ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగాశంకర్ నాయక్ మాట్లాడుతూ దేశమంతా ఛిన్నాభిన్నంగా ఉన్న బంజారా సమాజాన్ని సేవాలాల్ ఏకం చేశారని గుర్తు చేశారు. ఊరికి దూరంగా అడవిలో స్థిరమైన తండా వ్యవస్థను పటిష్టంగా నిర్మాణం చేశారని ఆయన తెలిపారు. మాజీ ఎంపి ధీరావత్ రవీంద్ర నాయక్ మాట్లాడుతూ బంజారా జాతీ ఔన్నత్యాన్ని ప్రపంచానికి చాటేలా అహింసా సిద్ధాంతానికి పునాదులు వేసిన సేవాలాల్ మహారాజ్ జీవితం యావత్ సమాజానికి ఆదర్శప్రాయం అన్నారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ డైరక్టర్లు మెగావత్ గణేష్ నాయక్, బుడ్డ సత్యనారాయణ, పాశం అశోక్ గౌడ్, దేరంగుల కృష్ణ, సపావత్ హరికృష్ణ నాయక్, ఉత్సవ కమిటీ సభ్యులు జానికిరాంనాయక్, ధన్‌జిలాల్ నాయక్, పాండు నాయక్, వాసురాం, శివ, మణిశ్రీ, కవిత, రాజు, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

## క్షేత్రస్థాయిలో పర్యటించాలి

### చార్మినార్ జెడ్‌సి శ్రీనివాస్‌రెడ్డి




**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** పారిశుధ్య నిర్వహణపై ప్రతిరోజు ఉదయం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని బల్దియా చార్మినార్ జెడ్ సీ సోలిపేట్ శ్రీనివాస్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. ఈ మేరకు గురువారం ఆయన చార్మినార్ సర్కిల్‌కి చెందిన పారిశుధ్య విభాగం నిర్వహణపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని ప్రాంతాల్లో పారిశుధ్య నిర్వహణపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. సమావేశంలో చార్మినార్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ సరిత, ఎస్‌డబ్ల్యూ ఎం డిఇ శ్రీరాములు, సానిటరీ సూపర్వైజర్, జవాన్లు, ఎస్ఎఫ్ఎలు పాల్గొన్నారు.

## యుజిసి నిబంధనలు అమలు చేయాలి

### పలువురు వక్తలు డిమాండ్

**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** యుజిసి కుల వ్యతిరేక సమానత్వపు మార్గదర్శకాలు వెంటనే అమలు చేయాలని పలువురు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎం.మమత అధ్యక్షతన వివిధ విద్యార్థి, అధ్యాపక, ప్రజాసంఘాల ప్రతినిధులతో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో... తెలంగాణ ప్రజా సాంస్కృతిక కేంద్రం గౌరవ అధ్యక్షుడు జి.రాములు, ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి డా.గ్యార నరేష్, ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి టి.నాగరాజు, గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీరామ్ నాయక్‌బ మాట్లాడుతూ రాజ్యాంగం కల్పించిన హక్కులను ఉన్నత విద్యాసంస్థలు అమలు చేయకపోవడం ఆందోళనకరమన్నారు. కుల దురహంకారం, వేధింపులు, స్కాలర్‌షిప్‌లలో వివక్ష, గైడ్‌ల కేటాయింపులో అసమానతలు వంటి సమస్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు.



## రిటైర్డ్ ఉద్యోగుల సంఘం ఎన్నిక



**ప్రజాపక్షం/చిక్కడపల్లి:** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. కమిటీలో... రాష్ట్ర అధ్యక్షుడు పి.వెంకటరెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎమ్‌సీ లింగన్న, కోశాధికారి పి.ప్రహ్లాద్రావు ఉన్నారు. రాష్ట్ర కౌన్సిల్ సమావేశం సుందరయ్య విజ్ఞాన కేంద్రం లో నిర్వహించారు. 202326లో రిటైర్డ్ ఉద్యోగుల సంఘం చేసిన ఉద్యమాలు, విజయాలు, జమా ఖర్చుల నివేదికను పూర్వ ప్రధాన కార్యదర్శి చిల్వేరి చంద్రశేఖర్ నివేదికను సమర్పించారు. కమిటీలో అసోసియేట్ ప్రెసిడెంట్ ఆర్.సీతారామయ్య, ఉపాధ్యక్షులు జి.శ్రీనివాస్‌రెడ్డి, ఎన్.విష్ణువర్ధన్‌రెడ్డి, కే.యుగందర్‌రెడ్డి, ఎన్.జగదీశ్‌చంద్ర, ఎమ్.శంకర్‌రెడ్డి, బి.భాగ్యలక్ష్మి , కార్యదర్శులు డి.వెంకటేశ్వర్లు, జీవీ మనోహర్ కుమార్, ఏ.లక్ష్మీ నర్సింహారావు తదితరులున్నారు.

## అమర గాయకులకు గీతాంజలి




**ప్రజాపక్షం/త్యాగరాయగానసభ :** అమర గాయకులకు గీతాంజలి జరిగింది. ఈ మేరకు త్యాగరాయ గానసభలో సరిగమలు గలగలలు శీర్షికన సినిమా పాటల విభావరి ఆహుతులనుఆకట్టుకున్నది. గాయనీ, గాయకులు, సమాజ సేవకులను ఈ వేడుకలో సన్మానించారు. అరవింద్ ఆర్ట్స్ అసోసియేషన్ వ్యవస్థపాపకుడు కట్టా రఘువర్‌గౌడ్ ఆధ్వర్యంలో తెలంగాణ భాషా సాంస్కృతిక పర్యాటక సౌజన్యంతో ఈ వేడుక జరిగింది.

## హెచ్ఎంఆర్ఎల్ జాయింట్ ఎండిగా ఐఎఎస్ అధికారి శివేంద్ర ప్రతాప్



**ప్రజాపక్షం/సిటీబ్యూరో :** హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్( హెచ్ఆర్ఎంఎల్) జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్‌గా ఐఎఎస్ అధికారి శివేంద్ర ప్రతాప్ నియమితులయ్యారు. బేగంపేటలోని మెట్రోరైల్ భవన్‌లో గురువారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. మహబూబ్‌నగర్ జిలా అదనపు కలెక్టర్‌గా ఉన్న ఆయనకు ఈ పోస్టింగ్ ఇచ్చారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం హెచ్ఆర్ఎంఎల్ మేనేజింగ్ డైరెక్టర్ సర్ఫరాజ్ అహ్మద్‌ను కలిసారు. ఈ సందర్భంగా శివేంద్ర ప్రతాప్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

## డ్రైవర్లకు ట్రాఫిక్‌పై అవగాహన



**ప్రజాపక్షం/చాంద్రాయణగుట్ట:** ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో గురువారం ఆటో డ్రైవర్లు, క్యాప్ డ్రైవర్లు, ఇతర వాణిజ్య వాహనాలు నడిపే డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనల గురించి అవగాహన కలిగించారు. డ్రైవింగ్‌లో పాటించాల్సిన భద్రత, వృత్తిపరమైన విషయాలపై అవగాహన కల్పించడం జరిగింది. కార్యక్రమంలో చాంద్రాయణగుట్ట ట్రాఫిక్ సీఐ ఎం.దాసు తదితరులు పాల్గొన్నారు.

## రహదారి బురదమయం



**ప్రజాపక్షం/యాకుత్‌పుర:** పొంగుతున్న నాలాతో వాహనదారులు, పాదచారులు ఆందోళన చెందుతున్నారు. ఏకంగా రెండు నియోజకవర్గాల సరిహద్దుగా భావించే ఛత్రినాక చౌరస్తా అటు చాంద్రాయణగుట్టతో పాటు ఇటు యాకుత్‌పురా హద్దుగా ఉంటుంది. ఈ రహదారిలో గడచిన మూడు రోజులుగా నాలా నుంచి పొంగుతున్న నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో బురదమయంగా మారి రాకపోకలకు ఇబ్బంది కలిగిస్తున్నది. ఈ సందర్భంగా ఎంఐఎం కార్యకర్త ధార శ్రీకాంత్ మాట్లాడుతూ ఏండ్లుగా నెలకొన్న సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.

## 'పసి పాప' ఘటనకు బాధ్యులపై కఠిన చర్యలు

### వ్యవసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు అంజయ్య



**ప్రజాపక్షం/యాచారం :** కుమ్మెర జాతరలో మొక్కు తీర్చుకోవడానికి పోతే రెండు నెలల పసికందును బలి తీసుకున్న అగ్ర కులాల పెత్తం దారులను ప్రభుత్వం తక్షణమే అరెస్టు చేసి శిక్షించాలని వ్యసాయ కార్మిక సంఘం రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి.అంజయ్య డిమాండ్ చేశారు. గురువారం మండల పరిధిలోని ధర్మన్నగూడ గ్రామంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్బంగా అంజయ్య మాట్లాడుతూ పసికందును హత్యచేసిన వారిపై హత్యానేరం కింద కేసు నమోదు చేసి ఆ కుటుంబాన్ని అన్ని విధాలుగా అదుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బాల్‌రాజ్, శ్రీమన్నారాయణ, బాషయ్య, పి.రమేశ్, కోఅప్షన్ సభ్యులు గోపాల కృష్ణ, ఎం. రాములు, సత్యనారాయణ, జె హన్మంత్, రాములు, కృష్ణ, ఆనంద్, సత్తయ్య, నర్సింహ్మా తదితరులు పాల్గొన్నారు.

### నందివనపర్తిలో కొవ్వొత్తుల ర్యాలీ

మండల పరిధిలోన నందివనపర్తి గ్రామంలో సర్పంచ్ రాయికంటి విజయ్‌కుమార్, అంబేద్కరు యువజన సంఘం ఆధ్వర్యంలో గ్రామంలో కొవ్వొతుల ర్యాలీ నిర్వహించారు. ఈ సంధర్బంగా సర్పంచ్ విజయ్‌కుమార్, విహెచ్‌పియస్ రాష్ట్ర అధ్యక్షులు కాళ్ళ జంగయ్య మాట్లాడుతూ కుమ్మెర జాతరలో ఘాతుకానికి పాల్పడిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యంజాల అంజయ్య, వార్డుమెంబర్ మహ్మద్ బాబర్, కొండాపురం సంధ్య, జంగయ్య, వెంకటరమణ, దయాకర్, మధుకర్, సతీష్, సాయి, కుమార్, వంశి, నిఖిల్, శ్రీశైలం, నందు తదితరులు పాల్గొన్నారు.

**షాద్‌నగర్ :** పసి పాప మౌనిక హత్యఘటనకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు ఆకాష్ నాయక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం షాద్‌నగర్ పట్టణ కేంద్రంలో విద్యార్థులు ర్యాలీతో జాతీయ రహదారిపై ధర్నా చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆకాష్ నాయక్ మాట్లాడుతూ కుమ్మర ఘటనకు పాల్పడిన వ్యక్తులపై తగిన చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో విద్యార్థి సంఘాల నాయకులు అనిల్ నాయక్, రాజేష్, అశోక్‌చ కార్తీక్, నరేష్ ఉన్నారు.





# 6నుంచి 8వరకు మహిళా దినోత్సవ కార్యక్రమాలు

### కలెక్టర్ హరిచందన దాసరి



**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** హైదరాబాద్ జిల్లా కలక్టరేట్‌లో తెలంగాణ గజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ (టిజిఓ) మహిళా విభాగం ఆధ్వర్యంలో ప్రపంచ మహిళా దినోత్సవం 2026 పోస్టర్‌ను గురువారం జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆవిష్కరించారు. మార్చి 6నుంచి8వ తేది వరకు ఎల్‌బి స్టేడియంలో మహిళా దినోత్సవ కార్యక్రమాలు జరుగుతాయని కలెక్టర్ హరిచందన దాసరి, టిజిఓ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎస్.మంజులారెడ్డి ఈ సందర్భంగా తెలిపారు. టిజిఒ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష్యులు ఎంబి.కృష్ణయాదవ్, కార్యదర్శి ఎంఎ ఖాదిర్, డాక్టర్ సునీతా జోషి, డాక్టర్ అమరావతి, డాక్టర్ సుజాత పాల్గొన్నారు. మహిళా దినోత్సవం కార్యక్రమాల్లో పెద్ద ఎత్తున జిల్లాలోని మహిళలు పాల్గొనాలని జిల్లా కలెక్టర్ కోరారు.

### విద్య, గృహ రుణాలకు ప్రాధాన్యం ఇవ్వాలి

హైదరాబాద్ జిల్లాలో విద్య, గృహ రుణాలకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కలెక్టర్ హరిచందన దాసరి తెలిపారు. కలక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం అదనపు కలెక్టర్ జితేందర్ రెడ్డితో కలిసి డిసిసి/డిఎల్ఆర్‌సి సమావేశంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక సమాజాభివృద్ధిలో అన్ని వర్గాల అభివృద్ధి ముఖ్యమని చెప్పారు. బ్యాంకులు వారికి రుణాలు ఇవ్వడంలో ఆర్థికంగా బలహీనన వర్గాలకు ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ముగియనున్న నేపథ్యంలో బ్యాంకులు టార్గెట్లకు సమానంగా పిఎస్ఎల్, ప్రభుత్వ పథకాల కింద అందిస్తున్న ఆర్థిక సహాయానికి ప్రాధాన్యత ఇవ్వాలని చెప్పారు. ప్రభుత్వ, ప్రైవేటు సెక్టార్ల బ్యాంకులు పోటీతత్వంలో రుణాల మంజూరులో ముందుండాలని తెలిపారు. వివిధ రంగాలలో 2025–26 ఆర్థిక సంవత్సరం మూడవ త్రైమాసికంలో లక్ష్యంలో 87.82 శాతం రుణాలు ఇవ్వడం జరిగిందని ఎల్‌డిఎం మూర్తి ఈ సందర్భంగా వివరించారు. వీటిలో ఎంఎస్ఎంఇ రుణాల లక్ష్యంలో 63.78శాతం, ప్రాధాన్యత రంగాల రుణాల లక్ష్యంలో 72.07శాతం మంజూరు చేశామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఎల్‌డిఓ ఆర్‌బిఐ రెహమాన్, నాబార్డ్ డిడిఎం హర్ష రఘురాం, ఎల్‌డిఎం నరసింహమూర్తి వాణిజ్య బ్యాంకుల అధికారులు, జిల్లా సంక్షేమ శాఖ అధికారులు ఆశన్న, కోటాజి, ప్రవీణ్ కుమార్,పరిశ్రమల శాఖ జిఎం. పవన్‌కుమార్ పాల్గొన్నారు.

### ఇంటర్ పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు

జిల్లాలోని ఇంటర్మీడియట్ పరీక్షా కేంద్రాల్లో మౌలిక వసతులు కల్పించామని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ హరిచందన దాసరి ఆదేశించారు. బంజారాహిల్స్‌లోని పేజ్ జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రాన్ని గురువారం ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షలు రాస్తున్న గదులను పరిశీలించారు. అక్కడ ఏర్పాటు చేసిన తాగునీరు, మెడికల్ సదుపాయం, పరిశుభ్రత వంటి అంశాలను ఆమె తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఏర్పాటు చేసిన 217 పరీక్షా కేంద్రాల్లో ఇంటర్ రెండో సంవత్సరం పరీక్షలు 1,75,271 మంది విద్యార్థులు రాస్తున్నారన్నారు. విద్యార్థులు ప్రశాంత వాతావరణంలో పరీక్షలు రాసేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. పరీక్షా కేంద్రాల్లో ఎలాంటి ఇబ్బందులు, అసౌకర్యం కలగకుండా చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా ఇంటర్మీడియట్ అధికారులను ఆదేశించారు. గురువారం నాటి పరీక్షలో మొత్తం 78, 377 మంది విద్యార్థులు హాజరుకాగా 2824 మంది గైర్హాజరయినట్లు ఇంటర్ అధికారులు వివరించారు. ఆకస్మిక తనిఖీలో కలెక్టర్ వెంట జిల్లా ఇంటర్మీడియట్ అధికారి ఒడ్డెన్న, కళాశాల ప్రిన్సిపాల్ నీతూ కులకర్ణి, డిఇసి సభ్యులు చెన్నయ్య తదితరులు పాల్గొన్నారు.






## అదనపు కలెక్టర్‌గా ఫైజాన్ అహ్మద్
## హరిప్రియకు అదనపు కలెక్టర్‌గా బదిలీ

**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అదనపు కలెక్టర్‌గా (స్థానిక సంస్థలు) ఫైజాన్ అహ్మద్ నియమితులయ్యారు. వెంటనే ఆయన గురువారం కలెక్టరేట్ కార్యాలయానికి వచ్చి పదవీ బాధ్యతలు స్వీకరించగానే జిల్లా కలెక్టర్ మను చౌదరి పూల మొక్క అందించి




స్వాగతించారు. 2021 ఐఏఎస్ బ్యాచ్‌కు చెందిన ఆయన ఇప్పటి వరకు నిర్మల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించారు. ఇప్పటి వరకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు)గా బాధ్యతలు నిర్వహించిన రాధికా గుప్తా గత నెలలో జిహెచ్ఎంసి ఉప్పల్ జోనల్ కమిషనర్‌గా పూర్తి స్థాయిలో నియమితులై బాధ్యతలు నిర్వహిస్తూ అదనపు కలెక్టర్ బాధ్యతలు నిర్వహిస్తూ వచ్చారు. ఫైజాన్ అహ్మద్ తాజాగా అదనపు కలెక్టర్‌గా నియమితులవటంతో ఇప్పటి వరకు అదనపు బాధ్యతలు నిర్వహించిన రాధికా గుప్తా ఇక నుండి జిహెచ్ఎంసి జోనల్ కమిషనర్‌గా పూర్తి స్థాయిలో విధులు నిర్వహిస్తారు. ఇదిలా ఉండగా మేడ్చల్ మల్కాజిగిరి కలెక్టరేట్‌లో డిఆర్ఓగా విధులు నిర్వహిస్తున్న హరిప్రియకు అదనపు కలెక్టరేట్‌గా పదోన్నతి కల్పిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టరేట్‌కు బదిలీ చేయటంతో జిల్లా కలెక్టర్ మనుచౌదరి ఇతర జిల్లా స్థాయి అధికారులతో కల్సి ఆమెకు పూలమొక్కతో సన్మానించారు.



## కాప్రా ప్రెస్‌క్లబ్(ప్రింట్ మీడియా) నూతన కమిటీ ఎన్నిక

**ప్రజాపక్షం/చర్లపల్లి:** కాప్రా ప్రెస్‌క్లబ్ (ప్రింట్ మీడియా సీనియర్ జర్నలిస్టుల సంఘం రిజిస్టర్ నెం.489/2020)నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ప్రెస్‌క్లబ్ భవనంలో ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా జ్యోతిర్మయ చారి(వార్త), ఆదిమూలం శ్రీనివాస్(సాక్షి), కోశాధికారిగా వట్టిపల్లి సురేష్(జనంసాక్షి), సలహాదారులుగా కె.రమేష్, కెసి. మోహన్, చంద్రమౌళి, సత్యనారాయణ, సహదేవచారి, వి. శ్రీనివాస్‌లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా వారిని కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, కుషాయిగూడ సిఐ భాస్కర్‌రెడ్డి, ఎస్ఐ. సుధాకర్‌రెడ్డిలు అభినందించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు బాల్‌రాజ్‌గౌడ్, శ్రీనివాస్, బి విజయ్, శంకర్, బాల్‌రెడ్డి, రుద్రగోని నర్సింగ్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.



## రామచందర్ స్మృతికి సంతాప సభ

**ప్రజాపక్షం/చర్లపల్లి:** లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్ కుషాయిగూడ హాస్పిటల్ ట్రస్ట్ చైర్మన్ లయన్ కొత్త రామారావు ఆధ్వర్యంలో స్వర్గీయ ఎల్ఎన్ రామచందర్ స్మృతికి సంతాప సభ నిర్వహించి ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ చంద్రశేఖర్, రవిశంకర్‌రాజు, పిళ్లై, రాంబాబు, వెంకట్‌రెడ్డి, నర్సింగ్, వెంకటపతి రాజు,పెద్ది శ్రీను, రాజేష్‌వంశరాజ్, వెంకటేశ్వరరావు,మోహన్‌రావు, శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.



## ప్రజా సమస్యల పరిష్కారం కోసమే 'బస్తీ బాట'

**ప్రజాపక్షం/ఉప్పల్ :** ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా బస్తి బాట కార్యక్రమం కొనసాగుతుందని చిలుకనగర్ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ములకలపల్లి రాజేష్ ముదిరాజ్ అన్నారు. బస్తి బాట కార్యక్రమంలో భాగంగా చిలుకనగర్ డివిజన్‌లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ఉప్పల్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి మందముల పరమేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా ఉప్పల్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ రాజును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. అనంతరం డివిజన్ పరిధిలోని వైకుంఠధామంలో కనీస సౌకర్యాల కొరత, పరిశుభ్రత సమస్యలు, తాగునీరు మరియు విద్యుత్ సౌకర్యాల లేమి వంటి అంశాలను క్లుప్తంగా వివరించారు. ఈ విషయమై అధికారులు సానుకూలంగా స్పందించి, వైకుంఠధామంలో అవసరమైన కనీస వసతుల కల్పనకు ప్రత్యేక కార్యాచరణ చేపట్టనున్నట్లు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డివిజన్ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ అక్కిటి ఆగం రెడ్డి, కొంపల్లి బాలరాజు, నల్లవెల్లి మహేందర్, గండికోట గణేష్, దండుగుల శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ కౌన్సిలర్‌లు క్రియాశీలకంగా పనిచేయాలి

**ప్రజాపక్షం/తాండూరు:** తాండూరు మున్సిపల్ బిఆర్ఎస్ పార్టీ ఫ్లోర్ లీడర్ పట్లోళ దీపానర్సిములును నియమించినట్లు తాండూరు మాజీ ఎంఎల్ఎ పైలెట్ రోహిత్‌రెడ్డి తెలిపారు. గురువారం తాండూరులోని బిఆర్ఎస్ క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఎన్నికైన పార్టీ కౌన్సిలర్‌లతో ప్రత్యేకంగా సమావేశమైనారు. ఈ సందర్బంగా పైలెట్ రోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజల సమస్యలపై ఫ్లోర్ లీడర్ దీపా నర్సిములు ఆద్వర్యాన పోరాటం చేయాలని సూచించారు. పలు అంశాలపై వారికి పైలెట్ దిశానిర్దేశం చేశారు. మళ్లి రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని గెలుపొందిన కౌన్సిలర్‌లు వార్డులలో క్రియశీలకంగా పనిచేయలని సూచించారు. ప్రజా సమస్యలపై దీపా నర్సిములు నాయకత్వంలో కౌన్సిలర్‌లు ఐక్యంగా ఉండి కౌన్సిల్‌లో ముందుకు వెళ్ళాలని సూచించారు. అధికార కాంగ్రెస్ పార్టీ అరాచకాలు చేసిన గట్టిపోటి ఇచ్చి 12మంది కౌన్సిలర్‌లను గెలుపొందడంతోపాటు మరో ఐదు స్థానాలలో గట్టి పోటీనిఇచ్చామన్నారు.

## మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలి

### జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి
### ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో వివిధ అంశాల్లో పోటీలు




**ప్రజాపక్షం/కాప్రా :** భగత్ సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌ల 95వ వర్థంతి సందర్భంగా ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో యువజనోత్సవాల గోడ పత్రికలను జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి గురువారం ఆవిష్కరించారు. డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా యువత పోరాడాలని, స్టాప్ డ్రగ్స్ స్టార్ట్ స్పోర్ట్స్ ఉత్సవాల్లో భాగస్వాములు కావాలని ఆయన పిలుపిచ్చారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ధర్మేంద్ర, మేడ్చల్ జిల్లా కార్యదర్శి టి.సత్యప్రసాద్‌లు మాట్లాడుతూ మార్చి ఒకటి నుండి 23 వరకు యువజనోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, వ్యాసరచన, చిత్రలేఖనం, ఉపన్యాసం, తదితర అంశాల్లో పోటీలు నిర్వహిస్తామని, పాల్గొనే వారు తమను 9347279087 సంప్రదించాలని కోరారు. ఎఐవైఎఫ్ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు గిరిబాబు, రాజ్ కుమార్, కనకయ్య తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కుమ్మెర ఘటన హంతకులను కఠినంగా శిక్షించాలి




**ప్రజాపక్షం/కుత్బుల్లాపూర్ :** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన మల్లన్న జాతరలో చాకలి కుటుంబానికి చెందినవారు గుడిలోకి వచ్చి, ఇచ్చిన డబ్బులకు రశీదు అడిగితే.. మమ్మలనే అడుగుతారా అని చెప్పి దాడి చేసి 2 నెలల పాప మౌనిక మరణానికి కారణమయ్యారని, దానికి కారణమైన ముఖ్యమైన వారిని ఇప్పటివరకు అరెస్ట్ చెయ్యకపోవడం దారుణమని అన్నారు. కుల దురహంకారంతో రెచ్చిపోవడం అనాగరికమని, రేవంత్‌రెడ్డి బీసీ బంధువు అని చెప్పి ప్రగల్భాలు పలకడం తప్పా నిజం కాదని అన్నారు. దీనిని నిరూపించుకోవాలంటే వెంటనే అరెస్ట్ చేసి జైలుకు పంపాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

ఈ కార్యక్రమంలో రజక సంఘం నాయకులు విట్టల్, సిపిఐ జిల్లా కార్యదర్శి ఉమా మహేష్, సీనియర్ నాయకులు ఏసురత్నం, నాయకులు భాస్కర్, నాగరాజు, చంద్రమౌళి, సత్యనారాయణ, రాజు, శ్రీనివాస్, సతీష్, మండల సహాయ కార్యదర్శులు హరినాథ్, రాములు, ప్రజానాట్య మండలి అధ్యక్షులు బాబు తదితరులు పాల్గొన్నారు.




**మల్కాజిగిరిలో:** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో జరిగిన మల్లన్న జాతరలో ప్రాణాలు కోల్పోయిన 2 నెలల బేబి మౌనిక ఆత్మకు శాంతి చేకూరాలని అనుటెక్స్ నుండి మల్కాజిగిరి చౌరాస్తా వరకు క్యాండిల్ ర్యాలీ నిర్వహించారు. బిసి కులాల నాయకులు బత్తిని నరసింహగౌడ్, కాసర్ల నాగరాజుల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో కరుణం గోపి, కృష్ణ గౌడ్, రమేష్ గౌడ్, బాలచందర్, నవీన్‌గౌడ్, రామకృష్ణ, బక్క నాగరాజు, నర్సింగరావు, సంపత్, గౌతంరాజు, సత్యనారాయణ, ఎం. శ్రీనివాస్, నరహరి గౌడ్, వీరస్వామి, డి.రాజు, శ్రీనివాస్, దర్శనం తదితరులు పాల్గొని పసి పాప మృతికి కారకులైన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసారు.

## పోలీస్ స్పోర్ట్స్‌మీట్‌లో మల్కాజిగిరి కమిషనరేట్ క్రీడాకారుల సత్తా



**ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి :** తెలంగాణా రాష్ట్ర 4వ పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో మల్కాజిగిరి కమిషనరేట్‌కు చెందిన పోలీసు క్రీడాకారులు 81 పతకాలు సాధించి సత్తా చూపారు. వివిధ క్రీడల్లో 23 బంగారు, 35 రజితం, 23 కాంస్యం పతకాలు వచ్చాయి. రాష్ట్ర వ్యాప్తంగా కమిషనరేట్ పోలీసులు విన్నర్‌గా రెండవ స్థానంలో ఉన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ అవినాష్ మహంతి విజేతలను అభినందించి పతకాలను అందచేసారు. క్రీడలు మానసిక ధృఢత్వాన్ని పెంపొందించటంలో కీలక పాత్ర పోషిస్తాయని, క్రీడల్లో గెలుపోటములు సహజమని, విజేతలు రానున్న జాతీయ స్థాయిలో మెరుగైన ప్రదర్శనలు ఇచ్చేందుకు సన్నిద్ధం కావాలని సూచించారు.

## నిరుపేదలకు గూడు కల్పించడమే సిఎం లక్ష్యం

### అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ శిరీషా కృష్ణారెడ్డి



**ప్రజాపక్షం/శామీర్‌పేట:** ఇల్లులేని ప్రతి నిరుపేదలకు గూడు వసతి కల్పించడమే సిఎం రేవంత్‌రెడ్డి లక్ష్యమని అలియా బాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమటం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. గురువారం అలియాబాద్ మున్సిపాలిటి తుర్కపల్లిలో లలిత నరేష్‌ల నూతన ఇందిరమ్మ గృహాన్ని రిబ్బన్ కట్‌చేసి ప్రారంబించారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్ పర్సన్ శిరీషా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత గూడు లేని ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇళ్లు కట్టిస్తున్నారని చెప్పారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వార ఆర్థికంగా బలహీన వర్గాలకు గృహ వసతి కల్పించడానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. పేదలు ఇట్టి సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్‌టిఏ మెంబర్ బీమిడి జైపాల్ రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ అధ్యక్షుడు తుంకి రమేష్, కౌన్సిలర్లు గురకాల దీప సాయికృష్ణ, కోడూరి మౌనిక దినేష్, ఎఎంసి డైరక్టర్ బిక్షపతి, యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు పప్పుల వేణుగోపాల్‌రెడ్డి, మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు యాదగిరి, వెంకటేష్, భూపాల్, చంద్రారెడ్డి, చాట్లపల్లి నర్సింగరావు, నాగమల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## భారీ వాహన డ్రైవర్లకు కంటి పరీక్షలు

### ట్రాపిక్ ఎసిపి శంకర్‌రాజు




**ప్రజాపక్షం/శామీర్‌పేట :** భారీ వాహనాలను నడిపేవారికి కంటి పరీక్షలు చేయించామని ట్రాఫిక్ ఎసిపి శంకర్‌రాజు అన్నారు. గురువారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో ట్రాపిక్ ఎసిపి శంకర్‌రాజు నేతృత్వంలో ఆరైవ్ అలైవ్ 2026లో బాగంగా శామీర్‌పేట డివిజన్ దొంగలమైసమ్మ, బిట్స్‌పిలాని చౌరస్తాలో డ్రైవర్లకు కంటి పరీక్షలు ఎల్‌వి ప్రసాద్ ఆస్పత్రి వారి సౌజన్యంతో నిర్వహించారు. డైరక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శివధర్‌రెడ్డి, మల్కాజ్‌గిరి కమిషనర్ ఆఫ్ పోలీస్ అవినాష్ మహంతి, డిసిపి రాహుల్‌రెడ్డి అదనపు డిసిపి లక్ష్మి ఆదేశాల మేరకు డ్రైవర్లకు చిత కంటి పరీక్షలు నిర్వహించారు. అనంతరం ట్రాఫిక్ ఎసిపి శంకర్‌రాజు మాట్లాడుతూ రోడ్డు భద్రతపై డ్రైవర్లకు అవగాహన కల్పిస్తున్నామని ఇందులో బాగంగా పెద్ద వాహానాలను నడుపుతున్న డ్రైవర్లను గుర్తించి వారికి కంటి పరీక్షలు నిర్వహించామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎల్‌వి ప్రసాద్ ఇన్సిట్యూట్ విజన్ టెక్నీషియన్ శ్రావణి, ట్రాఫిక్ సిఐ శంకరయ్య, డిటెక్టివ్ ఇన్స్‌పెక్టర్ రాజు, ఎస్ఐలు నవీన్ రెడ్డి, సోమిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



**చర్లపల్లిలో:** అరైవ్ అలైవ్‌లో భాగంగా కుషాయిగూడ పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో హెవీ వెహికల్ డ్రైవర్లకు ప్రత్యేక కంటి పరీక్షలు సోలీస్ ఆసుపత్రి వారు నిర్వహించారు. రోడ్డు భద్రతపై అవగాహన పెంపొందించడం, ప్రమాదాలు తగ్గించడం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టామని భారీ వాహన డ్రైవర్లకు క్రమం తప్పకుండా కంటి పరీక్షలు చేయించుకోవడం అత్యంత అవసరమని అన్నారు. లారీలు, బస్సులు వంటి పెద్ద వాహానాలను నడపడానికి స్పష్టమైన దూరదృష్టి, సరైన లోతు గ్రహింపు అవసరమని అన్నారు. కంటి పరీక్షలు చేయించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించడం, ప్రజల ప్రాణాలను రక్షించడంతో కీలకపాత్ర పోషిస్తాయని అన్నారు.

## సిసి రోడ్ పనులు ప్రారంభం



**ప్రజాపక్షం/మల్కాజిగిరి :** ఈస్ట్ ఆనంద్‌బాగ్ డివిజన్ పరిధిలోని జవహర్ నగర్ లైఫ్ హాస్పిటల్ వద్ద రూ. 30 లక్షల వ్యయమంతో చేపట్టిన సిసి రోడ్ పనులను గురువారం స్థానిక మాజీ కార్పొరేటర్ వై. ప్రేమ్‌కుమార్ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ సభ్యులు నారాయణ, శ్రీనివాస్ రెడ్డి, ముత్యంరెడ్డి, జాన్, కాశిరెడ్డి, ప్రసాద్, పద్మావతి, మల్లేష్, కాంగ్రెస్ శ్రేణులు బా బు, సత్యనారాయణ, సంపత్‌రావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు.



**మచ్చబొల్లారం డివిజన్‌లో:** మచ్చబొల్లారం డివిజన్ భాగ్యనగర్ కాలనీలో రూ. 13 లక్షల వ్యయంతో చేపట్టిన సిసి రోడ్డు పనులను మాజీ కార్పొరేటర్ జితేందర్‌నాథ్ గురువారం ప్రారంభించారు. స్థానికులకు ఎలాంటి ఇబ్బం దులు తలెత్తకుండా నిర్ణీత సమయానికి నాణ్యతతో పనులు పూర్తి చేయాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మల్లారెడ్డి, సాయిరెడ్డి, రవి, శివ, సుధాకర్ రెడ్డి, కాంగ్రెస్ శ్రేణులు సురేందర్‌రెడ్డి, శ్రీశైలం యాదవ్, నవీన్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.




## కామ్రేడ్ నల్లకన్ను మరణం ప్రజా పోరాటాలకు తీరని లోటు

### సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు జి.దామోదర్‌రెడ్డి

**ప్రజాపక్షం/కాప్రా :** కామ్రెడ్ నల్లకన్ను మరణం ప్రజా పోరాటాలకు తీరని లోటని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యులు జి.దామోదర్‌రెడ్డి అన్నారు. సిపిఐ ఉప్పల్ నియోజకవర్గ సమితి ఆధ్వర్యంలో ఈసిఐఎల్‌లోని నీలం రాజశేఖరరెడ్డి భవన్‌లో గురువారం నల్లకన్ను చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అభ్యుదయ ఉద్యమానికి, సామాజిక న్యాయమం, సమానత్వాన్ని విశ్వసించే వారందరికి ఆయన మృతి తీరని లోటన్నారు.

**సిపిఐ కి తీరని లోటు : కృష్ణ**

**కూకట్‌పల్లిలో:** కామ్రేడ్ నల్లకన్ను మరణం సిపిఐ కి తీరిని లోటు అని సిపిఐ కూకట్‌పల్లి మండల కార్యదర్శి జి. కృష్ణ అన్నారు. గురువారం సిపిఐ ఆధ్వర్యంలో శ్రీశ్రీ నగర్ సిపిఐ కార్యాలయంలో కామ్రేడ్ నల్లకన్ను చిత్ర పటాని కి పూలమాల వేసి, ఘన నివాళులు అర్పించారు. అనంతరం కృష్ణ మాట్లాడుతూ నల్లకన్ను మరణించడం సిపిఐ కి తీరనిలోటు అని అన్నారు. ఆయన తమిళ నాడు గాంధీగా పేరు గాంచారని, తమిళనాడు రాష్ట్రంలో పేద ప్రజల, రైతు, కార్మికుల కోసం అనేక పోరాటాలు నిర్వహించారని తెలిపారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు పాటుపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఐ నాయకులు దావీద్, రాములు, చంద్రమ్మ, ఉమారాణి తదితరులు పాల్గొన్నారు.

## వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా దీపక్‌తివారీ



**ప్రజాపక్షం /వికారాబాద్ :** జిల్లా కలెక్టర్‌గా దీపక్ తివారీగా రాష్ట ప్రభుత్వం నియమించింది. వికారాబాద్ కలెక్టర్ విధులు నిర్వహిస్తున్న ప్రతీక్‌జైన్‌ను నారాయణపేట్ జిల్లా కలెక్టర్‌గా బదిలీపై వెళ్లారు. దీపక్ తివారీ ఆసిఫాబాద్ జిల్లా అదనపు కలెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. వికారాబాద్ జిల్లా కలెక్టర్‌గా నియమించారు.

## రైతాంగ సమస్యల పరిష్కారానికి కిసాన్ సంఘ్ నిరంతరం కృషి

### అఖిల భారత అధ్యక్షుడు సాయిరెడ్డి



**ప్రజాపక్షం/ఘట్‌కేసర్:** రైతాంగ సమస్యల పరిష్కారం లాభసాటి ధర సాధనకై భారతీయ కిసాన్ సంఘ్ నిరంతరం కృషి చేస్తుందని అఖిల భారత అధ్యక్షులు సాయిరెడ్డి పిలుపునిచ్చారు. ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం అన్నోజిగూడ ఆర్వీకే పాఠశాల ప్రాగంణంలో కిసాన్ అధ్యక్షుడు కె.సాయిరెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. భారతీయ కిసాన్ సంఘ్ అఖిల భారత సభలు ఈనెల 27నుండి మార్చి 1వరకు మూడు రోజుల పాటు జరగనున్నాయని తెలిపారు. అన్ని రాష్ట్రాలు కేంద్రపాలిత ప్రాతాలకు చెందిన 1000మంది భారతీయ కిసాన్ సంఘ్ ప్రతినిధులు మహాసభలకు తరలి వస్తారని కాశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ఒక్కో రాష్ట్రం నుంచి 30 మంది పైగా ప్రతినిధులు అఖిల భారతీయ మహాసభలకు తరలిరానున్నారని అన్నారు. రైతుల ఆదాయాలు రెట్టింపు చేయాలన్న మోదీ సర్కారు లక్ష్యం మేరకు సహజ, ప్రకృతి, సేంద్రీయ, గో ఆధారిత వ్యవసాయ విధానాలు పెద్ద ఎత్తున రైతుల్లోకి తీసుకెళ్లడం ఆయా ఉత్పత్తులు వినియోగం పట్ల ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆహారంలో ప్రత్యేక దృష్టి సారించినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘ్ అఖిల భారత ప్రధాన కార్యదర్శి మోహిని మోహన్ మిశ్రా, అఖిల భారత సంఘటన కార్యదర్శి దినేష్ కులకర్ణి, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ అంటే మాటల ప్రభుత్వం కాదు...చేతల ప్రభుత్వం

### ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**ప్రజాపక్షం/తాండూరు:** కాంగ్రెస్ అంటే మాటల ప్రభుత్వం కాదని...చేతల ప్రభుత్వమని తాండూరు ఎంఎల్ఎ బుయ్యని మనోహర్‌రెడ్డి అన్నారు. బషీరాబాద్ మండలంలో రూ.99లక్షలతో పలు అభివృద్ధి పనులకు ఎంఎల్ఎ శంఖుస్థాపనలు చేశారు. మైల్వార్ గ్రామంలో రూ.11.20లక్షలతో ప్రహారి గోడ, రూ. 10లక్షల నిధులతో సిసి రోడ్డు, రూ.10లక్షల మహిళ సమాఖ్య భవనం నిర్మాణం పనులకు శంఖుస్థాపన, ఇస్మాయిల్ పూర్ ఏకాంబరి దేవాలయం రూ.20లక్షలతో నూతనంగా నిర్మించే సిసి రోడ్డు పనులకు, రూ.10లక్షతో మహిళ సమాఖ్య భవనానికి శంఖుస్థాపన, ఎక్మాయ్ గ్రామంలో రూ. 10లక్షలతో సిసి రోడ్డు నిర్మాణం పనులకు, రూ.10లక్షల నిధులతో స్కీల్ డెవలప్‌మెంట్ సెంటర్, డిఎంఎఫ్‌టి కింద రూ. 10,15లక్షలతో ప్రభుత్వ పాఠశాల ప్రహారి గోడ నిర్మాణం పనులకు ఎంఎల్ఎ శంఖుస్థానలు గావించారు.ఈ సందర్బంగా ఆయా గ్రామాలలో ఎంఎల్ఎ మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విడుతలవారిగా అమలు చేస్తున్నామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంటే మాటల ప్రభుత్వం కాదని చేతల ప్రభుత్వమని, పేదలకు అండగా నిలుస్తుందన్నారు. నూతనంగా ఎన్నికైన సర్పంచ్‌లు రాజకీయాలకు అతీతంగా గ్రామాలను అభివృద్ధి పర్చుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బషీరాబాద్ ఎఎంసి చైర్మన్ మాధవరెడ్డి, ఆత్మకమిటి చైర్మన్ శంకర్‌రెడ్డి, సీనియర్ నాయకులు అంజయ్ ప్రసాద్, రాకేష్ మహారాజ్, సుధాకర్‌రెడ్డి, వెంకట్రాంరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రామునాయక్, ఎంఎల్ఎ సోదరులు సత్యనారాయణ రెడ్డి, సర్పంచ్‌లు సీమా సుల్తానా, ఖలీద్, పుప్పలి శశికల, మధుసుధన్, నమ్యా నాయక్‌ఏ వివిధ గ్రామాల నాయకులు, అధికారులు పాల్గోన్నారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం

**ప్రజాపక్షం /కోట్‌పల్లి:** వికారాబాద్ నయోజకవర్గంలోని కోట్‌పల్లి మండల పరిధలోని కరీంపూర్ గ్రామంలో గోలిమాలన్ బీ మృతి చెందడంతో మృతుని కుటుంబా సభ్యులకురూ1000వేలు ఆర్థిక సహాయం అందజేసిన మండల పార్టీ అధ్యక్షులు సుందరి అనిల్ గ్రామ సర్పంచు సదట్ పటేల్ , గ్రామ వార్డ సభ్యులు ,గ్రామస్తులు పాల్గోన్నారు.

ప్రజాపక్షం
Telugu National Daily
హైదరాబాద్
శుక్రవారం
27-02-2026
www.prajapaksham.in

"పాన్ ఇండియా స్టార్ విజయ్ దేవరకొండ, పాన్ ఇండియా హీరోయిన్ రష్మిక మందాన ఇద్దరు ఒకటైయ్యారు. గురువారం ఉదయం పదిగంటల పదినిమిషాలు వీరిద్దరి వివాహం అంగ రంగ వైభవంగా జరిగింది. ఇరు కుటుంబాలకు చెందిన దగ్గరి బంధువులు, స్నేహితులు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు."

రీల్

## 'విష్ణు విన్యాసం' ష్యూర్‌గా సూపర్ హిట్

### హీరో శ్రీవిష్ణు ఆశాభావం



శ్రీ విష్ణు 'విష్ణు విన్యాసం'తో అలరించబో తున్నారు. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వం లో, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి నిర్మించిన ఈ చిత్రంలో శ్రీ విష్ణు సరసన నయన్ సారిక హీరోయిన్ గా నటిస్తోంది. ఫిబ్రవరి 27న ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా విడుదల చేయను న్నారు. ఈ సందర్భంగా మేకర్స్ ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ నిర్వహించారు.ప్రీరిలీజ్ ప్రెస్ మీట్ లో శ్రీ విష్ణు మాట్లాడుతూ విష్ణు విన్యాసం సినిమా మొదలవడానికి మొదటి కారణం చారి గారు. ఆయన ద్వారానే మారుతి పరిచయమ య్యారు. కథ చెప్పినప్పుడు నాకు చాలా నచ్చింది.. విష్ణు విన్యాసం ఫస్టాఫ్ అంతా యూత్‌కి బాగా కనెక్ట్ అవుతుంది. సెకండ హాఫ్‌కి సినిమా ఫ్యామిలీ డ్రామాగా మారు తుంది. సినిమా పూర్తి అయ్యేసరికి ఒక మంచి సినిమా చూసిన అనుభూతి కలుగుతుంది. ఇది ష్యూర్ షాట్ సూపర్ హిట్ సినిమా. 27న థియేటర్స్‌లో కలుద్దాం అని అన్నారు. హీరో యిన్ నయన్ సారిక మాట్లాడుతూ నాకు మనీషా క్యారెక్టర్ ఇచ్చిన డైరెక్టర్ మారుతికి థాంక్యూ. ఆయన కెప్టెన్ కూల్. చాలా క్లారి టీతో డైరెక్ట్ చేస్తారు. శ్రీ విష్ణు చాలా సపోర్ట్, గైడ్ చేశారు. శ్రీ విష్ణు నుంచి మీరు ఏవైతే కోరుకుంటున్నారో అన్ని ఎలిమెంట్స్ ఇందులో ఉంటాయి. డైరెక్టర్ మారుతి మాట్లాడుతూ విష్ణు నా మీద చాలా నమ్మకం పెట్టారు. ఈ సినిమా అంత అద్భుతంగా రావడానికి కారణం విష్ణుగారు, అలాగే మా నిర్మాతలకి ప్రత్యేక ధన్యవాదాలు, వారి సపోర్ట్ వల్లే సినిమా ఇంత బెటర్ గా వచ్చింది. ఈ సిని మాకి పనిచేస్తున్న ప్రతి టెక్నీషియన్ కి పేరుపే రునా ధన్యవాదాలు. ఈ సినిమా చూస్తున్నంత సేపు నవ్వుతూనే ఉంటారు. ఈ ప్రెస్ మీట్ లో కేకే రాధా మోహన్, నిర్మాత సుబ్రహ్మణ్యం, నిర్మా త సుమంత్, మ్యూజిక్ డైరెక్టర్ రథన్, బెక్కం వేణుగోపాల్ పాల్గొన్నారు.

## అంబాజీ పేట సినిమా తరువాత భయమేసింది

### సక్సెస్ మీట్‌లో సుహాస్



సుహాస్, శివానీ నాగారం జంటగా రూపొందిన హిలేరియస్ ఎంటర్‌టైనర్ 'హే బల్వంత్'. గోపీ అచ్చర దర్శకత్వంలో త్రిశుల్ విజనరీ స్టూడియోస్ పతాకంపై బి.నరేంద్ర రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మించారు. బన్నీవాస్, వంశీ నందిపాటి ఈ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చారు. ఈ శుక్రవారం ఈనెల 20న ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా ప్రేక్షకుల అభినందనలతో దూసుకపోతుంది.ఈ నేపథ్యంలో చిత్ర బృందం థాంక్యూ మీట్ ఫర్ బ్రేక్ ఈవెన్ డన్ ఈవెంట్‌ను నిర్వ హించింది. ఈ సందర్భంగానిర్మాత బి.నరేంద్ర రెడ్డి మాట్లాడుతూ మా బ్యానర్‌లో వచ్చిన తొలి సక్సెస్ ఇది. చూసిన ప్రతి ఒక్కరూ ఎంతో సంతృప్తి చెందారు. ఓ మంచి సినిమా తీశానని అభినందించారు. కొన్ని థియేటర్స్‌కి వెళ్లి నేను ఆడియన్స్ మధ్యలో సినిమా చూశాను. సినిమాను అందరూ ఎంతగానో ఎంజాయ్ చేస్తున్నారు. నాకు ఇది ఎంతో సంతృప్తి నిచ్చింది. ఓ మంచి సినిమా తీశాననే భావన కలిగింది. తప్పకుండా సినిమా చూడని వాళ్లు అందరూ ఈ సినిమా చూడాలని కోరుకుంటున్నాను' అన్నారు. దర్శకుడు గోపీ అచ్చర మాట్లాడుతూ 'ఈ మూవీ చూసిన అందరూ ప్రశం సలు కురిపిస్తుంటే ఆనందంగా ఉంది. ముఖ్యంగా యూఎస్‌లో ఆడియన్స్ కు కూడా ఈ సినిమా నచ్చింది. ఈ సక్సెస్‌కు కారణమైన అందరికి నా కృతజ్ఞ తలు' అన్నారు. హీరోయిన్ శివానీ నాగారం మాట్లాడుతూ మా కంటెంట్‌ను ఎంకరైజ్ చేసి లవ్ చేసిన అందరికి థ్యాంక్స్. అందరికి నచ్చే కంటెంట్ ఇది. సినిమా చూసిన ప్రతి ఒక్కరూ మంచి సినిమా అంటు న్నారు. సినిమా కోసం టీమ్ అంతా కష్టపడ్డారు' అన్నారు. సుహాస్ మాట్లాడుతూ అంబాజీ పేట సినిమా తరువాత నా సినిమాల కలెక్షన్లు మినిమమ్ నెంబర్లు కూడా కనబడకపోవడంతో భయమేసింది. ఈసినిమా వసూళ్లు చూ సిన ధైర్యం వచ్చింది. ఓవరసీస్‌లో కూడా మంచి కలెక్షన్లు వచా ్చయి. చాలా రోజుల తరువాత నా సినిమా ఓటీటీ కూడా మంచి ఫ్యాన్సీ రేటు వచ్చింది. ఇందుకు కారణమైన నిర్మాత నరేంద్ర రెడ్డి, వంశీ నందిపాటిలకు థ్యాంక్స్' అన్నారు. ఈ సమావేశంలో వంశీ న ందిపాటి స్రవంతి చొక్కారపు, లావణ్యరెడ్డి, మహి రెడ్డి పాల్గొన్నారు.

## 'పద్మశ్రీ' తర్వాత విడుదలయ్యే రాజేంద్రప్రసాద్ తొలిచిత్రం 'పిఠాపురంలో'



అయోధ్య రామయ్య, చెప్పాలని వుంది, జోరుగా హుషారుగా, ఒక్కడే, హనుమంతు, ప్రేయసి రావే, ఆలస్యం అమృతం, రెడ్ అలర్ట్ వంటి చిత్రాలతో దర్శకుడిగా మంచి గుర్తింపు సంపాదించారు మహేష్ చంద్ర . తాజాగా ఆయన దర్శకత్వంలో రూపొందిన చిత్రం 'పిఠాపురంలో'. దీనికి ఉపశీర్షిక 'అలా మొద లైంది'. ఈ చిత్రంలో 'నటకిరీటి' డా. రాజేంద్రప్రసాద్, పృధ్వీరాజ్, కేదార్ శంకర్, మణిచందన, జయవాహిని, అన్నపూర్ణమ్మ ప్రధాన పాత్రల్లో నటించారు. అలాగే దాసరి పద్మ, సన్నీ అఖిల్, విరాట్, సాయి ప్రణీత్, శ్రీలు, ప్రత్యూష, రెహానా, జూనియర్ పవన్ కళ్యాణ్, ప్రసాద్, పాల్ రాము, జబర్దస్త్ శేషు తదితరులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు.మహేష్ చంద్ర సినిమా టీమ్ బ్యానర్‌పై దుండిగల్ల బాలకృష్ణ, ఆకుల సురేష్ పటేల్, ఎఫ్.ఎం. మురళీ (గోదారి కిట్టయ్య) ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. షూటింగ్ పార్ట్ పూర్త యిన ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉంది. త్వరలోనే విడుదల తేదీని ప్రకటించనున్నారు.ఈ సందర్భంగా దర్శకుడు మహేష్ చంద్ర మాట్లా డుతూ, ఇది ముగ్గురు అమ్మా యిల కథలా అనిపించే ముగ్గురు తండ్రుల భావో ద్వేగం. ఈ ఇంటర్ నెట్ తరం తెలుసుకోవాల్సిన అసలైన కథ ఇది. ఈ సినిమా చూస్తుంటే, చుట్టూ ఉన్న సమా జాన్ని, చాలా కుటుంబాల్ని, ఎంతోమంది జీవితాలను చూస్తున్నట్టే ఉంటుంది. అటు యువతని, ఇటు కుటుంబ ప్రేక్షకులను ఆకట్టుకునే అన్ని అంశాలు ఇందులో ఉన్నాయి. ఇటీవల కాలంలో 'పిఠాపురం' పేరు ఎంతలా చర్చల్లో నిలిచిందో అందరికీ తెలుసు. ఆ నేపథ్యాన్ని ఆధా రంగా తీసుకుని ఈ కథను మలిచాం. త్వరలో రిలీజ్ డేట్ ప్రకటిస్తాం అని తెలిపారు.ఈ చిత్రానికి సంగీతాన్ని జేసీ క్రిష్ అందిస్తున్నారు. సినిమాకు సంబంధించిన ఆడియో హక్కులను ప్రముఖ ఆడియో సంస్థ 'ఆదిత్యా మ్యూజిక్' సొంతం చేసుకుంది. గోవా, హైదరాబాద్, సూరంపాలెం లోని ఆదిత్య కాలేజ్ లొకేషన్లలో పాటల చిత్రీకరణ జరి గింది. ఈ చిత్రానికి కథ: ఆకుల సురేష్ పటేల్, ఎడిటర్: సత్యనారాయణ, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: అంజి సంద్రాల.


## అన్నపూర్ణ స్టూడియోలో సాంకేతిక విప్లవం

### 'మోషన్ క్యాప్చర్' ఫెసిలిటీ ప్రారంభం




అన్నపూర్ణ స్టూడియోస్‌లో భారతీయ సినీ పరిశ్రమకు కొత్త అధ్యాయం ప్రారంభమైంది. దేశంలో అత్యాధునిక మోషన్ క్యాప్చర్ సదుపాయాన్ని ఆవిష్కరిస్తూ, భార తీయ సినిమాల సృజనాత్మకతకు, సాంకేతికతకు కొత్త దిశను చూపింది. అక్కినేని నాగార్జున అన్నపూర్ణ స్టూడియోస్, విజనరీ ప్రొడ్యూ సర్ శోభు యార్లగడ్డ స్థాపించిన మిహిరా విజువల్ ల్యాబ్స్ కలిసి ఏర్పాటు చేసిన ఈ ఫెసిలిటీకి ఏ అండ్ ఎం మో క్యాప్ ల్యాబ్ అని పేరు పెట్టారు. హాలీవుడ్‌లో ప్రముఖ మోషన్ క్యాప్చర్ టెక్నాలజీ భాగస్వామి అయిన యానిమె ట్రిక్ ఫిలిమ్స్ డిజైన్ ఈ ల్యాబ్‌కు సాంకేతిక సహకారాన్ని అందిస్తోంది. దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి చేతుల మీదుగా ఈ ఫెసిలిటీ ప్రారంభమైంది. ఈ సందర్భంగా మహేష్ బాబు, ప్రియాంక చోప్రా జోనాస్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న తన కొత్త చిత్రం వారణా సిలో కీలక సన్నివేశాలను ఈ మోషన్ క్యాప్చర్ టెక్నాలజీతో చిత్రీకరించినట్టు ఆయన వెల్లడించారు. ఇప్పటివరకు ప్రపంచ స్థాయి టెక్నాలజీ కోసం విదేశా లపై ఆధారపడాల్సి వచ్చేది. బాహుబలి, ఈగ వంటి సినిమాల సమ యంలో ఈ సదుపాయం భారత్‌లో ఉంటే మరింత మెరుగ్గా తీర్చిదిద్దే వాళ్లమని అనిపిస్తోంది. ఇప్పుడు ఆ లోటు తీరింది అని చెప్పారు.కింగ్ నాగార్జున అక్కినేని మాట్లాడుతూ భారతీయ సినిమా ప్రయాణంలో ఇది ఒక కీలక ఘట్టం. ఇప్పుడు హైదరాబాద్‌లోనే ఈ సదుపాయం అందుబాటులోకి రావడం వల్ల ఎపిక్ అడ్వెంచర్ నుంచి సైన్స్ ఫిక్షన్ డ్రామాల వరకు ఎన్నో కథలను సులభంగా తెరకెక్కించవచ్చు అని చెప్పారు.శోభు యార్లగడ్డ, సి టి ఓ బ్రెట్ ఇనెసన్ , అన్నపూర్ణ స్టూడియోస్ సిటి ఓ సీవీ రావు పాల్గొన్నారు.

## మిథికల్ థ్రిల్లర్ 'వృషకర్మ'



తండేల్ సినిమాతో విజయం అందుకున్న నాగ చైతన్య తాజాగా కొత్త సినిమా 'వృషకర్మ' ను సిద్ధం చేస్తున్నాడు. 'విరూపాక్ష'తో హిట్ కొట్టిన కార్తీక్ దండు ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. మిథికల్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రాన్ని ఎస్ వీ సి సి , సుకుమార్ రైటింగ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నారు. బాపినీడు ఈ ప్రాజెక్ట్‌ను సమర్పిస్తున్నారు. ఈ సినిమాకు సంబధించిన గ్లింప్స్ వృషకర్మ ఆధ్యాత్మిక ప్రపంచంలోకి తీసుకువెళ్ళడానికి మార్చి 5న విడుదల చేయనున్నారు. అనౌన్స్‌మెంట్ పోస్టర్‌లో నాగ చైతన్య ఒక చీకటి గుహలో నిలబడి, పైనుండి దూసుకు వస్తున్న పదునైన కాంతి కిరణాలతో తడిసి ముద్దవుతున్నట్లు కనిపిస్తోంది. అతని కండలు తిరిగిన శరీరం, లుక్ అద్భుతంగా వుంది. నడుముకు కట్టుకున్న క్లైంబింగ్ గేర్, చేతిలో ఉన్న తవ్వే ఆయుధం అతని పాత్ర ఎంత ప్రమాదకర పరిస్థితుల్లోకి వెళ్లిందో సూచిస్తున్నాయి. దర్శకుడు కార్తీక్ దండు తన బ్లాక్‌బస్టర్ డెబ్యూ తర్వాత వస్తున్న ఈ ప్రాజెక్ట్‌పై ఉన్న అంచనాలను దృష్టిలో పెట్టుకుని, వృషకర్మను మరింత ఇమ ర్సివ్‌గా తీర్చిదిద్దడంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నారు.ఈ చిత్రంలో నాగ చైతన్యకు జోడీగా మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా, లాపతా లేడీస్ ఫేమ్ స్పర్శ్ శ్రీవాస్తవ విలన్ పాత్రలో కనిపించనున్నాడు. సినిమాటోగ్రఫీని రాహుల్ డి హెరియన్ నిర్వహిస్తుండగా, అజనీష్ బి లోకనాథ్ సంగీతాన్ని అందిస్తున్నారు. ప్రొడక్షన్ డిజైనర్ శ్రీ నాగేంద్ర తంగాల. నవీన్ నూలి ఎడిటర్‌గా పని చేస్తున్నారు. ఈ చిత్రానికి నిర్మాతలు: బివిఎస్ఎన్ ప్రసాద్, సుకుమార్ బి, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: నరసింహా చారి చెన్నోజు.

## మార్చి 2న 'పెద్ది' పాట విడుదల




రామ్ చరణ్ హీరోగా బుచ్చిబాబు సానా దర్శకత్వంలో తెరకెక్కుతున్న పెద్ది సినిమా షూటింగ్ శరవేగంగా జరుగుతోంది. ఏ ఆర్ రెహ్మాన్ సంగీతం అందిస్తున్నారు. ఈ సినిమాకు సంబధించిన ''రాయ్ రాయ్ రారా రారా' అనే పాటను మార్చి 2వ తేదీన విడుదల చెయ్యడానికి సన్నాలు చేస్తున్నారు. ఇప్పటికే చికిరి చికిరి అనే పాట ప్రపంచ వ్యాప్తంగా పాపులర్ అయింది. ఈ పాటపై అనేక మంది యువత రీల్స్ కుడా చేస్తున్నారు. సోషల్ మీడియాలో ఈ పాట ట్రేండింగ్ లో ఉంది. ఈనేపధ్యంలో మరో పాటను విడుదలకు సిద్ధం చేశారు. ఇప్పటికే భారీ యాక్షన్ సన్నివేశాల చిత్రీకరణ పూర్తయింది. క్లైమాక్స్ సన్నివేశాలను భారీ బడ్జెట్ తో చిత్రీకరించారు. రామ్ చరణ్ సరసన ఈ సినిమాలో దివంగత నటి శ్రీదేవి కుమార్తె జాన్వీ కపూర్ హీరోయిన్ గా నటిస్తోంది. రత్నవేలు సినిమాటోగ్రాఫర్ గా పని చేస్తున్నారు. జగపతి బాబు ఇందులో అత్యంత కీలకమైన పాత్రను పోషిస్తున్నారు. ఈ సినిమాలో జగపతి బాబు గెటప్ చాలా కొత్తగా ఉంటుందని దర్శకుడు బుచ్చిబాబు అంటున్నారు. ఇంతవరకు జగపతి బాబు చేయని పాత్రను ఇందులో చూస్తారని ఆయన చెప్పారు. చిత్రాన్ని సంబధించిన దాదాపు ఎనభై శాతం షూటింగ్ పూర్తయింది. మరో పక్క పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. అన్ని పనులు పూర్తి చేసి ఏప్రిల్ 30వ తేదీన విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. మైత్రి మూవీస్, సుకుమార్ రైటింగ్స్ కలిసి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు.

## ఆకస్మిక దాడి

(మొదటి పేజీ తరువాయి)

11వ వ్యక్తిని కూడా పోలీసులు అరెస్టు చేశారు. అతగాడు దాడి నేరాన్ని అంగీకరించాడు. మధ్యవిల్లా క్లారా ప్రావిన్స్‌లోని కాయో ఫాల్కోన్స్ ప్రాంతంలో ఈ బోటును క్యూబా దళాలు కనుగొన్న తర్వాత తక్షణం కాల్పులు జరిగాయి. క్యూ బా అంతర్గత వ్యవహారాల మంత్రిత్వశాఖ ఈ మేరకు ఒక ప్రకటన చేసింది. బోటును క్యూబా దళాలు స్వాధీనం చేసుకున్నాయి. ఈ బోటులోంచి పేలుడు పదార్థాలు, ఇంప్రొవైజ్డ్ పేలుడు పరికరాలు, అస్సాల్ట్ రైఫిల్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు సైన్యం తెలిపింది. వీరంతా క్యూబా జాతీయులే. ఉగ్రవాదం సృష్టించాలనే ఉద్దేశంతోనే వారు అక్రమంగా అనుమతి లేకుండా తమ జలాల్లోకి దూసుకువచ్చారని, తమపై కాల్పులు జరిపారని సైన్యం స్పష్టం చేసింది. ఈ ఘటనతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు తలెత్తాయి. ఈ అసాధారణఘటనపై అమెరికా కూడా దర్యాప్తు ప్రారంభించినట్లు ఆ దేశ విదేశీమంత్రి మార్కో రుబియో మీడియాకు చెప్పారు. ఒకవైపు క్యూబాపై అమెరికా చమురు ఆంక్షలు విధించి సమస్యలు సృష్టిస్తున్న తరుణంలో రెచ్చగొట్టే ఉద్దేశంతోనే ఉద్దేశపూర్వకంగా క్యూబాపై అమెరికా ఇలాంటి చర్యకు పాల్పడిందని రష్యా విమర్శించింది. నిన్నమొన్నటిదాకా వెనిజులా నుండి క్యూబాకు చమురు రవాణా అవుతూ ఉండేది. ఇప్పుడు వెనిజులాల్లో అమెరికా పెత్తనం ప్రారంభం కావడంతో క్యూబాకు చమురు రవాణాను అమెరికా నిలివేసింది. దీంతో క్యూబా దేశానికి కష్టాలు పెరిగిపోయాయి. ఆ దేశంలో ప్రజల అవసరాలు తీరడంలేదు. దీంతో ఎటూపాలుపోక పెద్దసంఖ్యలో పౌరులు వలసలు వెళుతున్నారు.

## సుప్రీం నిషేధం

(మొదటి పేజీ తరువాయి)

ఎన్‌సిఇఆర్‌టి డైరెక్టర్‌కు, పాఠశాల విద్యాశాఖ కార్యదర్శికి షోకాజ్ నోటీసులు జారీ చేసి, సంబంధితులపై కోర్టు ధిక్కార చర్యలు ఎందుకు ప్రారంభించకూడదో వివరించాలని ఆదేశించింది. ఇలాంటి వ్యాఖ్యలు న్యాయవ్యవస్థపై ప్రజల్లో ఉన్న నమ్మకాన్ని దెబ్బతీస్తాయని, ఇది క్రిమినల్ కాంటెంప్ట్ పరిధిలోకి వచ్చే అవకాశం ఉందని కోర్టు అభిప్రాయపడింది. పాఠ్య పుస్తకంలో, న్యాయవ్యవస్థలో అవినీతి అనే విభాగంలో అవినీతి, భారీగా పెండింగ్, న్యాయమూర్తుల లేమి వంటి అంశాలు సవాళ్లుగా పేర్కొనబడ్డాయి. అలాగే న్యాయమూర్తుల ప్రవర్తనపై కోడ్ ఆఫ్ కండక్ట్ ఉందని కూడా ప్రస్తావించబడింది. అయితే, ఈ విషయాలను చిన్న వయసులోని విద్యార్థులకు పక్షపాత భావనతో పరిచయం చేయడం సరికాదని సుప్రీంకోర్టు పేర్కొంది. న్యాయ వ్యవస్థలో అవినీతి, భారీ సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉండడం, తగినంతమంది న్యాయమూర్తులు లేకపోవడం వంటి అంశాలను ఎన్‌సిఇఆర్‌టి పాఠ్యపుస్తకంలో ప్రస్తావించారు. కాగా, కోర్టు ఆదేశాల ప్రకారం, ఎన్‌సిఇఆర్‌టి, కేంద్రరాష్ట్ర విద్యాశాఖలు కలిసి పుస్తకంలోని అన్ని ప్రతులను ప్రజలకు అందుబాటులో లేకుండా చేయాలి. భవిష్యత్తులో ఆ పుస్తకాన్ని మళ్లీ ప్రచురించడం, ముద్రించడం లేదా డిజిటల్ రూపంలో పంపిణీ చేయడాన్ని పూర్తిగా నిషేధించారు. ఈ ఆదేశాలను ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని సుప్రీం కోర్టు హెచ్చరిస్తూ, తదుపరి విచారణను మార్చి 11కి వాయిదా వేసింది. న్యాయవ్యవస్థపై సముచిత విమర్శలను అణచివేయడం తమ ఉద్దేశం కాదని, కానీ, సంస్థ గౌరవాన్ని కాపాడడం తమ బాధ్యతనీ సుప్రీం కోర్టు ధర్మాసనం పేర్కొంది.

బాధ్యులను గుర్తిస్తాం: ధర్మేంద్ర ప్రధాన్

ఎన్‌సిఇఆర్‌టి 8వ తరగతి సోషల్ సైన్సెస్ పుస్తకంలో న్యాయ వ్యవస్థలో అవినీతిపై పాఠం ఉన్న విషయాన్ని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఒక ప్రకటనలో ప్రస్తావిస్తూ, బాధ్యులను గుర్తిస్తామని అన్నారు. తగిన విధంగా చర్యలు ఉంటాయని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థపై తమ ప్రభుత్వానికి అపారమైన గౌరవం ఉందని అన్నారు. కాగా, బిజెపి కూడా దాదాపు ఇలాంటి ప్రకటననే విడుదల చేసింది. ఎన్‌సిఇఆర్‌టి పుస్తకంలో న్యాయ వ్యవస్థపై పాఠ్యాంశం ఉండడాన్ని తాము సమర్థించబోమని బిజెపి జాతీయ అధికార ప్రతినిధి సబ్‌మిత్ పాత్ర స్పష్టం చేశారు.

## రూ.100 కోట్లు మంజూరు చేయండి

(మొదటి పేజీ తరువాయి)

కేటాయించకపోవడం వల్ల 40 శాతం మాత్రమే పూర్తియిందని, గండిపల్లి రిజర్వాయర్ ద్వారానే అక్కన్నపేట మండలంలోని ఎక్కువ గ్రామాలకు 14 వేల ఎకరాలకు నీరు అందించే అవకాశం ఉందని చాడ వెంకట రెడ్డి వివరించారు. గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి పర్యావరణ అనుమతులు, న్యాయపరమైన చిక్కులు, భూసేకరణ లంటి వాటిపై మంత్రులు ఎన్.ఉత్తమ్ కుమార్ రెడి, పొన్నం ప్రభాకర్, అధికారులు సమీక్ష చేసి ప్రాజెక్టు పనుల పురోగతికి ముందడుగు వేయడం హర్షణీయమని, అయితే ఆ సమావేశంలో గండిపల్లి రిజర్వాయర్ ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. ఈ ప్రాజెక్టు పూర్తికి ఇప్పటికే 660 ఎకరాలకు గాను 300 ఎకరాలు భూమిని సేకరించారని, మిగతా భూమిని సేకరించాల్సివుందన్నారు. గండిపల్లి ద్వారా మాత్రమే శ్రీరామ్‌సాగర్ వరద కాలువ పూర్తి లక్ష్యం నెరవేరుతుందన్నారు. ఇప్పటి వరకు పనులు చేపట్టిన గండిపల్లి రిజర్వాయర్ ఏజెన్సీ ద్వారా పనులు వేగవంతంగా పూర్తి చేయడానికి చర్యలు చేపట్టవల్సి ఉందని సిఎంకు చాడ వెంకట రెడ్డి లేఖలో తెలియజేశారు.

## పేదలే ఇందిరమ్మ ప్రభుత్వం పేటెంట్

(మొదటి పేజీ తరువాయి)

నాటి బిఆర్‌ఎస్ ప్రభుత్వమే పేదల ఇండ్లను కూలగొట్టించిందని చెబుతూ, నాడు కూల్చివేత సంఘటనల ఫోటోలను ప్రదర్శించారు. అంతేగాక వెలుగుమెట్లలో పేదలకు ఇండ్లు తిరిగి కట్టిస్తామని హామీ ఇచ్చి, గాలికి వదిలేసిందన్నారు. కానీ ఇందిరమ్మ ప్రభుత్వం హైకోర్టు ఉత్తర్వులకు అనుగుణంగా అక్కడ అక్రమంగా ఉన్న ఇండ్లను తొలగించడం జరిగిందని మంత్రి తెలిపారు.
ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సూచనల మేరకు అక్కడ అర్హులైన పేదలకు ఇంటి స్థలం, ఇల్లు ఇస్తాంమని, పేదలే ఇందిరమ్మ ప్రభుత్వం పేటెంట్ అని, ఈవిషయంలో నిజంగా పేదలపై బిఆర్‌ఎస్ బావ మరుదులు, ఫాంహౌస్‌లో ఉండి కుట్రలు చేస్తున్న కెసిఆర్ వెంటనే స్పందించి, కాళేశ్వరంలో దోచుకున్న, దాచుకున్న సొమ్ములో కొంత భాగాన్ని బయటకు తీసి పేదలకు ఇళ్లు కట్టించి పాప పరిహారం చేసుకోవాలని మంత్రి పొంగులేటి సూచించారు. గత బిఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్ట్‌ను కాదని కమీషన్ల కోసం కాళేశ్వరం ప్రాజెక్టును చేపట్టి ఎనిమిదవ వింతగా ప్రచారం చేసుకుందని, వారి హయాంలోనే లక్షలాది కోట్ల ప్రాజెక్ట్ కట్టడం, అవినీతి కారణంగా బీటలువారడం కూడా జరిగిందన్నారు. నాలుగేళ్లలో 168 టిఎంసి నీరు ఇస్తామని చెప్పి, దీనిలో 50 టిఎంసిల నీటిని సముద్రం పాలుచేశారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ బిఆర్‌ఎస్‌కు ఎటిఎంగా మారిందన్న బిజెపి నేతలు బిఆర్‌ఎస్‌తో చేతులు కలిపారని, జస్టిస్ ఘోష్ కమీషన్ నివేదిక ఇచ్చినా, అసెంబ్లీలో తీర్మానం చేసి సిబిఐకి ఇచ్చినా, ఇంతవరకు కేంద్రం కనీసం స్పందించలేదన్నారు. బిఆర్‌ఎస్ ప్రభుత్వం గతంలో వదిలేసిన ప్రాజెక్టలను మేం పూర్తి చేస్తున్నామని వివరించారు. మార్చి 16 నుంచి ప్రారంభమయ్యే అసెంబ్లీకి కెసిఆర్, బావ బావమరుదులు వచ్చి మాట్లాడాలని, వారు గతంలో ప్రతిపక్షానికి మాట్లాడే అవకాశం ఇవ్వలేదని, మేము కచ్చితంగా అవకాశం ఇస్తామని, వచ్చి మంచి సలహాలు, సూచనలు ఇవ్వాలని పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించారు.మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బిఆర్‌ఎస్ ప్రభుత్వం నీటి ప్రాజెక్ట విషయంలో ఉత్తర తెలంగాణకు పూర్తిగా అన్యాయం చేసిందన్నారు. 196 టిఎంసిల నీరు ఇస్తామని చెప్పి 168 టిఎంసిలకు పరిమితం చేసి, 50 టిఎంసిలు సముద్రంలో కలిపి రాష్ట్రాన్ని అప్పుల ఊబిలోకి నెట్టిందని మండిపడ్డారు. తమ ప్రభుత్వం వచ్చాక శ్వేత పత్రం ఇచ్చామని, కాళేశ్వరంపై చర్చించడంతో పాటు కేంద్రం చర్యలు కోరామని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ. 48వేల కోట్లు మిత్తీగా కట్టిందని, కేంద్రప్రభుత్వం ఇకనైనా నిధులు ఇవ్వాలని మంత్రి కోరారు. మంత్రి వివేక్ వెంకట స్వామి మాట్లాడుతూ బిఆర్‌ఎస్ పార్టీ అవినీతికి పాల్పడినందును దేశంలోని ప్రాంతీయ పార్టీల్లోకెల్లా ధనిక పార్టీగా మారిందన్నారు. సుమారు రూ. వెయ్యి కోట్లు ఫిక్స్‌డ్ డిపాజిట్లు, ఎలక్టోరల్ బాండ్లు దీనికి నిదర్శనమని, కాళేశ్వరం ప్రాజెక్ట్ కారణంగా ఏర్పడిన నష్టాన్ని కెసిఆర్ నుంచి వసూలు చేయాల్సిన అవసరం ఉందన్నారు. కాంట్రాక్టర్లు, కాసుల కోసమే బిఆర్‌ఎస్ అనుకూల నీటిప్రాజెక్టను చేపట్టిందని వివేక్ వెంకటస్వామి పేర్కొన్నారు.

## పునరావాసం కల్పించాలి

(మొదటి పేజీ తరువాయి)



పోలీసులు మోహరించి భయోత్పాతం సృష్టించాల్సిన అవసరం లేదని వారు తెలిపారు. గురువారం అంబేడ్కర్ భవన్‌లో ఉన్న వెలుగుమట్ల నిర్వాసితులను పరామర్శించారు. వివరాలను అడిగి తెలుసుకున్నారు. వెలుగుమట్ల ప్రాంతంలో వామపక్షాల నాయకులు పర్యటించి వాస్తవ పరిస్థితులను తెలుసుకున్నారు. వామపక్షల నేతల ముందు బాధితులు తమ గోడు వెళ్లబోసుకున్నారు. ఈ సందర్భంగా వామపక్షాల నాయకులు మాట్లాడుతూ ప్రతి కుటుంబానికి తక్షణ సాయంగా లక్ష రూపాయలు అందించాలని డిమాండ్ చేశారు. భూదాన్ భూమిలో ఆశ్రయం ఏర్పాటు చేసుకుని నివసిస్తున్న 600 కుటుంబాలకు సంబంధించిన రెండు వేల మంది జీవిస్తున్నారని వారందరికి ఎటువంటి హెచ్చరికలు లేకుండా బుల్‌డోజర్లతో విరుచుకుపడి కూల్చివేశారని ఇది ఒక అమానుష ఘటన అని వామపక్షాల నేతలు తెలిపారు. యంత్రాలతో కూల్చివేతలు జరిగాయని పిల్లలు, వృద్ధులు, మహిళలు అనే విచక్షణ లేకుండా బయటకు గెంటివేశారని వారు తెలిపారు. అంతే కాకుండా అడ్డుకోవడానికి ప్రయత్నించిన వారిపై అక్రమ కేసులు నమోదు చేశారని వారు తెలిపారు. ప్రభుత్వం ఇప్పటికైనా బాధితులను ఆదుకునే ప్రయత్నం చేయాలని వామపక్షాల నాయకులు డిమాండ్ చేశారు. ఇండ్ల కూల్చివేతకు గురైన కుటుంబాలకు ఎటువంటి షరతులు లేకుండా అదే స్థలంలో డబుల్‌బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలని నిర్వాసితులపై పెట్టిన అక్రమ కేసులను ఎత్తివేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వం తిరిగి వసతి కల్పించేంత వరకు నిర్వాసితులకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని కలెక్టర్‌కు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు పోతినేని సుదర్శన్, సిపిఐ, సిపిఎం, సిపిఐ(ఎంఎల్)మాస్‌లైన్ జిల్లా కార్యదర్శులు దండి సురేష్, ను న్నా నాగేశ్వరరావు, గోకినేపల్లి వెంకటేశ్వర రావు, సిపిఐ(ఎంఎల్)న్యూడెమోక్రసీ రాష్ట్ర నాయకులు ఆవునూరి మధు, సిపిఐ నాయకులు శింగు నర్సింహారావు, తాటి వెంకటేశ్వరరావు, సీతామహలక్ష్మి, పగడాల మల్లేష్, మేకల శ్రీనివాసరావు, సాంబశివారెడ్డి, తాటి నిర్మల, గాదె లక్ష్మి నారాయణ, శ్రావణ్, చి ంతల రమేష్, సిపిఎం నాయకులు మాచర్ల భారతి, వై. విక్రం, యర్రా శ్రీనివాస్, మాస్‌లైన్ నాయకులు సివై పుల్లయ్య, వై. ప్రకాష్, శిరోమణి, ఝాన్సీ, వివిధ పా ర్టీల నాయకులు బషీర్, మస్తాన్, శ్రీకాంత్, ఉదయ్ తదితరులు పాల్గొన్నారు.

## గుడుంబా తయారీ

(మొదటి పేజీ తరువాయి)

మామూళ్ల మత్తులో జోగుతూ అమ్మకందారు లకు అడ్డుకట్ట వేయలేకపోతున్నారనే విమర్శలు వస్తున్నాయి. గతంలో గుడుంబా తయారు చేసేవాళ్లకు రాష్ట్ర ప్రభుత్వం పునరావాసం కల్పిస్తూ పలు పథకాలను అమలు చేసింది. అయినప్పటికీ కొందరు గుడుంబా కాయడమే వృత్తిగా పెట్టుకుని పల్లెల్లో, తండాల్లో జోరుగా దందాను సాగిస్తున్నారు. గుడుంబా కేవలం పల్లెలు, తండాలకే పరిమితం కాకుండా ఇప్పుడు పట్టణాలకు సైతం పాకింది.

**జోరుగా నాటుసారా తయారీ :** డివిజన్ లో నాటుసారా తయారీ జోరందుకుంది. మద్యం ధరలు ఎక్కువగా ఉండడంతో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన వారు తక్కువ ధరలో లభించే గుడుంబా వైపు మరులుతున్నారు. దీంతో పల్లెలతో పాటు పట్టణాల్లోనూ సారాయి అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. డివిజన్ లోని వివిధ ప్రాంతాల్లో సారా విచ్చలవిడిగా తయారవుతోంది. గుట్టుచప్పుడు కాకుండా ప్లాస్టిక్ కవర్లలో నింపి రవాణా చేస్తున్నారు. ఇబ్రహీంపట్నం, మెట్ పల్లి, మల్లాపూర్ మండలాల్లోని మారుమూల గ్రామాల్లో, అటవీ ప్రాంతాల్లో గుడుంబా తయారీ జరుగుతున్నట్లు తెలుస్తోంది. ద్విచక్ర వాహనాలపై ఇతర గ్రామాలు, పట్టణాలకు సరఫరా చేస్తున్నారు. కొందరు సారా తయారీనే వృత్తిగా మలుచుకొని పెద్దఎత్తున తయారు చేసి అక్రమంగా తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. గతంలో గుడుంబా తయారీ పెద్దఎత్తున సాగేది. అప్పట్లో రాష్ట్ర ప్రభుత్వం తయారీకి అడ్డుకట్ట వేయడానికి బెల్లం తయారీని నిషేధించింది. దీంతో సారా తయారీకి అలవాటు పడిన కుటుంబాలకు వివిధ ఉపాధి అవకాశాలు కల్పించారు. అనంతరం వారు సారా తయారీ మానుకునేలా చర్యలు తీసుకున్నారు. అయితే ఇటీవల కాలంలో తిరిగి సారాయి గుప్పు మంటోంది. కొందరు తమ కోసం ఇప్పపువ్వుతో మేలి రకం సారా తయారు చేసుకుని తాగుతుండగా మరికొందరు ఇప్పపువ్వుతో పాటు బెల్లం, కుళ్లిన అరటిపండ్లు, ఇతర మత్తు పదార్థాలతో గుడుంబా తయారు చేసి దందా సాగిస్తున్నారు.మందుబాబులు నాటుసారా వైపుమద్యం ధరలు ఎక్కువగా ఉండడంతో పేద, మధ్య తరగతి వర్గాలకు చెందిన కొందరు మత్తు కోసం సారాకు అలవాటు పడుతున్నట్లు తెలుస్తోంది. దీంతో సారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మద్యం తాగాలంటే వందల రూపాయలు వెచించాల్సి వస్తోంది. క్వాటర్ మద్యం కొనాలన్నా రూ.100కు పైగానే ఖర్చవుతుంది. ఇలాంటి సమయంలో తక్కువ ధరలో దొరుకుతున్న గుడుంబా తాగేందుకు మందుబాబులు నాటుసారా వైపు చూస్తున్నారు. మెట్ పల్లి పట్టణంలో పేదలు, కూలీలు నివసించే పలు కాలనీల్లో గుడుంబా, సారా అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. అలాగే ఇబ్రహీంపట్నం, మెట్ పల్లి, మల్లాపూర్ మండలాల్లోని తిమ్మాపూర్ తాండా, ఎర్రపూర్ తాండా, వేములకుర్తి,ఏ ఎస్ ఆర్ తాండా, ఆత్మ నగర్, పాట మీద తండా, రంగ రావు పేట తండా, వెంపల్లి వెంకట్రావ్ పెట్ తాండా లో గుడుంబా అమ్మకాలు గుట్టుచప్పుడు కాకుండా నడుస్తున్నట్లు తెలుస్తోంది. రోజువారి కూలీ పనులు చేసుకుని బతికేవారు చాలా మంది సారా, గుడుంబా తాగుతున్నట్లు సమాచారం.

గుడుంబాపై నిఘా కరువు : డివిజన్ లో నిషేధిత గుడుంబాపై ఎక్సైజ్‌శాఖ ప్రత్యేక నిఘా పెట్టలేకపోతుందనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా నాటుసారా తయారు చేసే మూలాలపై సంబంధిత శాఖ అధికారులు దృష్టిసారించకపోవడంతో విచ్చలవిడిగా నాటుసారా తయారవుతుందనే వాదన వినిపిస్తోంది. సారా అమ్మకాలు ఆగాలంటే తయారీ మూలాలపై దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. గుట్టుగా తయారీ చేస్తూ వివిధ ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు.కొందరు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు సంపాదించాలనే దురాశతో గుడుంబాను పెద్ద ఎత్తున తయారు చేస్తూ ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. అప్పుడప్పుడు ఎక్సైజ్ అధికారులు తండాలపై దాడులు నిర్వహించి సారా అమ్మకాలపై వెతుకుతున్నారు. మూలాలను వెతకకుండా ఎక్కడో ఒకచోట దాడులు నిర్వహిస్తున్నారు.

ఆ శాఖలోనే లీకుల వీరులు : దాడులు నిర్వహించే సమయంలో అదే శాఖలో ఉన్న కొందరు సమాచారం అందించి సారా తయారీదారులకు సహకరిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి.సారా ఎక్కడ తయారు చేస్తున్నారో గుర్తించి పక్కా వ్యూహంతో దాడులు చేస్తే అసలు నిందితులు దొరికే అవకాశం ఉంది అని డివిజన్ ప్రజలు అభిప్రాయపడుతున్నారు. అధికారులు మముళ్లకు అలవాటు పడి మత్తులో మునిగిపోతారో లేక దాడులు నిర్వహించి గుడుంబాను అరికడతారో లేదో వేచి చూడాలి.

Printed & Published on behalf of M/s Navachethana Vignana Samithi by its president **Palla Venkat Reddy,** Printed at M/s Navachethana Vignana Samithi, 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda (Nagole), GSI Post Hyderabad-500068, Telangana State, Published at H.No 12-1-493/VA, Giriprasad Bhavan, Bandlaguda Main Road, Nagole, Hyderabad 500 068 RNI APTEL /1998/04664 **Editor : Makkena Subbarao,** Editorial : 040-29884450/51, E-mail : editorprajapaksham@gmail.com